


# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 340 • పేజీలు : 12 • ఆదివారం 1 సెప్టెంబరు 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada | Visakhapatnam | Srikakulam | Rajahmundry | Kurnool | Guntur | Ongole | Nellore Tirupati




- పట్టాలెక్కిన మరో మూడు కొత్త వందే భారత్ రైళ్లు
- సామాన్యులకు రైల్వేలను చేరువ చేస్తున్నామని వెల్లడి
- అన్ని వర్గాల వారికీ సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే రైల్వే లక్ష్యం..
- లఖ్‌నవూ- మేరఠ్, మదురై - బెంగళూరు, చెన్నై- నాగర్‌కోయిల్ మధ్య వందేభారత్ రైళ్లు ప్రారంభం
- వర్చువల్‌గా పచ్చ జెండా ఊపిన ప్రధాని మోడీ

# రైలు రవాణా బలోపేతం

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ఏళ్లుగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపడంలో భారతీయ రైల్వే ఎంతో పురోగతి సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల వారికీ సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే రైల్వే లక్ష్యమని, అప్పటి వరకు ఆగేది లేదని పేర్కొన్నారు. మూడు వందేభారత్ రైళ్లను శనివారం వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా.. రైల్వే కొత్త ఆశలు చిగురింపజేస్తోందని పేర్కొన్నారు. లఖ్‌నవూ- మేరఠ్, మదురై- బెంగళూరు, చెన్నై- నాగర్‌కోయిల్ మధ్య వందేభారత్ రైళ్లను శనివారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను మిగతా 7లో

# జలదిగ్బంధనం

- భారీ వర్షాలతో విజయవాడ అతలాకుతలం
- వాతావరణం అనుకూలించకపోవడంతో.. గాల్లోనే చక్కర్లు కొడుతున్న పలు విమానాలు
- బంగాళాఖాతంలో వాయుగుండంగా మారిన అల్పపీడనం
- కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో ఎనిమిదమంది మృతి
- పలుచోట్ల ఇళ్లలోకి చేరుతున్న నీరు
- ప్రధాన రహదారులపై వరదలు
- రాగల రెండురోజులు సైతం అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం

"భారీ వర్షాలతో విజయవాడ ఒక్కసారిగా వణికిపోయింది. కుంభవృష్టితో ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోయాయి. కొండచరియలు సమీపంలోని ఇళ్లపై విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో ఎనిమిదిమంది మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. (7లో)


విజయవాడలోని నిర్మల కాన్వెంట్ రోడ్డులో వరద ప్రవాహం

## హెలికాప్టర్ గల్లంతు.. తెలియని 22 మంది ఆచూకీ



**మాస్కో, ఆగస్టు 31:** తూర్పు రష్యాలోని కమ్‌చత్కాలో 22 మందితో ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గల్లంతయింది. హెలికాప్టర్‌లో ఉన్నవారిలో 19 మంది ప్రయాణికులు కాగా ముగ్గురు సిబ్బంది. ఈ విషయాన్ని రష్యా ఫెడరల్ రవాణా ఏజెన్సీ తెలిపింది. ఎంఐ-8టి శ్రేణికి చెందిన ఈ హెలికాప్టర్ శనివారం(ఆగస్టు31) కమ్‌చత్కాలోని వచ్కజెట్స్ అగ్నిపర్వతం వద్ద నుంచి బయలుదేరింది. కానీ గమ్యస్థానం చేరలేదని సమాచారం. హెలికాప్టర్ షెడ్యూల్ ప్రకారం గమ్యస్థానం చేరిన తర్వాత పైలట్ల వద్ద నుంచి రావాల్సిన సమాచారం రాలేదు. హెలికాప్టర్ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన మిగతా 7లో

## వారానికి 4 రోజులే పని

**జపాన్ కీలక నిర్ణయం**

**టోక్యో,ఆగస్టు 31:** జపాన్ పేరు వినగానే మనకు అక్కడి శ్రామిక శక్తి గుర్తొస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అణుబాంబులు జపాన్లోని హిరోషిమా, నాగసాకి మిగతా 7లో



# అధైర్యపడొద్దు

- సహాయక చర్యలు తీసుకోండి
- ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు
- స్తంభించిన జనజీవనం
- మృతిచెందిన 8మందికి 5లక్షల చొప్పున పరిహారం
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశం

**అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తోంది. వర్ష ప్రభావంతో జనం ఇళ్లలోనే ఉండిపోయారు. కొన్ని చోట్ల బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షాలపై మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. వర్ష ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. వర్షాలతో ఓర్వకల్లు పర్యటనను రద్దు చేసుకొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తోంది. 'మరో మూడు రోజులు వర్షం ప్రభావం ఉండనుంది. అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. భారీ మిగతా 7లో




జాతీయ సమగ్రతను కాపాడుతున్న

## సుప్రీం కోర్టు

- సుప్రీంకోర్టు మన ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసింది
- సుప్రీంకోర్టు 75ఏళ్ల వార్షికోత్సవం ప్రత్యేక సదస్సులో పాల్గొన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై.చంద్రచూడ్, ప్రధాని..

7లో

## గాజాపై ఇజ్రాయిల్ దాడులు.. 48 మంది మృతి

యుద్ధంలో ఇప్పటి వరకు 40 వేలకు పైగా మరణించిన సాధారణ పాలస్తీనా ప్రజలు



**గాజా,ఆగస్టు 31:** గాజాలో ఇజ్రాయిల్ దాడుల్ని తీవ్రతరం చేసింది. శనివారం గాజా స్ట్రిప్‌పై జరిగిన దాడుల్లో 48 మంది మిగతా 7లో

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి
- ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుంది
- చర్యలు తీసుకుంటాం..
- మంత్రి నారా లోకేష్

7లో

- భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాలలో ఇసుక సరఫరాలో అంతరాయం
- రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా
- వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత ఇసుక సరఫరా పునరుద్ధరణ

## వివిధ ఇసుక రీచ్‌లలో సరఫరా నిలిపివేత

**విజయవాడ,ఆగస్టు 31(ఆంధ్రపత్రిక):** గత రెండురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇసుక సరఫరాలో అంతరాయం నెలకొందని గనులు, అబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. వివిధ రీచ్‌ల నుండి సరఫరా నిలిపివేసామని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత అన్ని రీచ్‌ల నుండి ఇసుక సరఫరా కొనసాగుతుందన్నారు. వినియోగదారులు మిగతా 7లో



## హర్యానా ఎన్నికల తేదీల్లో మార్పు

అక్టోబర్ 1నుంచి 5కి మార్చిన ఇసి. కౌంటింగ్ 4కు బదులు 8న చేపడతామని వెల్లడి 7లో




## వైఎస్సార్ పేరు మార్పు సరికాదు



- జగన్ బాటలోనే నడుస్తున్న చంద్రబాబు
- ఆసుపత్రులకు వైఎస్ పేర్లు తొలగించడం సరికాదు
- పేరుమార్పును కాంగ్రెస్ ప్రతీకార చర్యగా భావిస్తోంది...
- ఎన్టీఆర్, వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పాటుపడిన వాళ్లే...
- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు

**విజయవాడ, ఆగస్టు 31(ఆంధ్రపత్రిక):** వైద్య, విద్యా సంస్థలకు ఎన్టీఆర్ పేరు తొలగించి మాజీ సీఎం జగన్ ఆనాడు పెద్ద తప్పు చేస్తే.. ఇప్పుడు అదే బాటలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడుస్తున్నారని అంటూ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ మిగతా 7లో



ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# 'సకల కళా వల్లభుడు!

తెలుగువారిని ఊరించి ఊగించి ఉప్పొంగించిన కళాస్వరూపాలలో అపురూపమైనది 'హరికథ'. ఈ కళాకేళికి అపూర్వమైన కీర్తిని కట్టబెట్టినవాడు ఆదిభట్ల నారాయణదాసు. ఆదిభట్ల అంటే హరికథ – హరికథ అంటే ఆదిభట్ల. వీరికి పూర్వం కూడా హరికథ ఉంది, హరికథకులు ఉన్నారు. ఈ ప్రక్రియకు కొత్తరూపును, సరికొత్త ప్రాపును తెచ్చినవాడు కేవలం నారాయణదాసు. సంగీత సాహిత్య సార్వభౌముడుగా, లయబ్రహ్మగా ప్రసిద్ధుడు. 'హరికథా పితామహుడు'గా సుప్రసిద్ధుడు. 'ఆటపాటల మేటి'గా అనంత వైభవశ్రీమంతుడు. ఆధునిక కాలంలో, తెలుగునేలపై ఇంతటి బహుముఖ ప్రతిభామూర్తి మరొకరు లేరనడం అతిశయోక్తికాదు. సామాన్యులను, అసామాన్యులను అనుపమానంగా మెప్పించి 'హరికథ'కు పట్టం కట్టిన ప్రతిభాశాలి. కేవలం తెలుగువారే కాదు, యావత్తు భారతీయులు, ఆంగ్లేయులు సైతం ఆయన ప్రజ్ఞకు మోకరిల్లారు. బహుకళా ప్రావీణ్యం, బహుభాషా ఆధిక్యం ఆదిభట్ల సొమ్ము."ఆధునిక కాలంలో నా దృష్టిలో దైవాంశ సంభూతులు ముగ్గురే ముగ్గురు. ఒకరు అసమాన దేహబల సంపన్నుడైన కోడి రామ్మూర్తి, ఇంకొకరు మారుత వేగ కవితా స్వరూపులైన కొప్పరపు కవులు, మరొకరు పంచముఖీ పరమేశ్వరుడైన ఆదిభట్ల నారాయణదాసు"..... అని 'కవి సమ్రాట్ ' విశ్వనాథ సత్యనారాయణ ఒక సమావేశంలో నారాయణదాసు శక్తి స్వరూపానికి అక్షరార్చన చేశారు. నారాయణదాసుపై అద్భుతమైన పరిశోధన చేసి డాక్టరేట్, గోల్డ్ మెడల్ తీసుకున్న డాక్టర్ గుండవరపు లక్ష్మీనారాయణ (గుంటూరు) ఈ విషయాన్ని ఆత్మీయుల దగ్గర చెబుతుండేవారు. కథాగానం చేస్తూ..ఏకకాలంలో శరీరంలోని ఐదు భాగాలతో ఐదు తాళలను మేళవించడం అతిమానుష శక్తిగా (సూపర్ హ్యూమన్ ) నాటి మహాకవి పండిత, కళామూర్తులు నిలువెల్లా భజించారు. రెండు చేతులు, రెండు కాళ్ళు, తలతో అయుదు తాళాలకు దరువు వేసి చూపించే ఆ ప్రజ్ఞ ప్రపంచంలోనే ఎవ్వరికీ లేదు. అది అనితర సాధ్యం. ఇంతటి శక్తి కేవలం నారాయణదాసుకే వశమైంది. ఇది నభూతో ! న భవిష్యతి! గా పెద్దలందరూ నిర్ణయించారు. మహారాష్ట్రలో 'అభంగులు', తమిళనాడులో 'కాలక్షేపం', కర్ణాటకలో 'హరికథా కాలక్షేపం', మనకంటే కాస్త ముందుగా రూపుదిద్దుకున్నాయి. మనకు 'యక్షగానం ఉంది. ఉన్నప్పటికీ, హరికథకు – యక్షగానానికి కొన్ని పోలికలతో పాటు, కొన్ని భేదాలు కూడా ఉన్నాయి. నారాయణదాసు చేతిలో 'తెలుగు హరికథ' సర్వాంగ సుందరంగా కొత్త రూపును దిద్దుకుంది, తీరు మార్చుకుంది, కొంగ్రొత్త వన్నెలు, వయ్యారాలు పోయింది. మరాఠా, తమిళ, కన్నడుల ప్రభావంతో, మన తెలుగుదేశంలో నారాయణదాసు కంటే ముందు కొందరు హరికథా ప్రదర్శనలు చేశారు. 'కథాగానం' మూలంగా రూపుదిద్దుకున్న ఈ కళ అత్యంత ప్రాచీనమైంది. మిగిలిన రాష్ట్రాలలో సంగీతం, సాహిత్యానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ కథాగానాలు సాగేవి. అందులో నృత్యం, అభినయం అనేవి ఉండేవి కావు. సంగీతం, కవిత్వం, నృత్యం, అభినయం, నాటకం పెనవేసుకున్న అపూర్వ సర్వ కళాస్వరూపం మన ఆదిభట్ల చేతుల్లో అవతారమెత్తిన ' హరికథా రూపం. హాస్య ప్రసంగాలు, పిట్టకథలు, విసుర్లు, చెణుకులు, చమత్కార భరితమైన చాటుపద్య మణిమంజరులతో, గజ్జెకట్టి, చిరు తాళాలు మోగిస్తూ... నారాయణదాసు హరికథా ప్రదర్శన చేస్తూంటే... కొన్ని వేలమంది ఒళ్ళు మరచి, ఆ రససముద్రంలో మునిగితేలేవారు. తెల్లవార్లూ సాగే ఆ ఆటపాటలతో అలిసిసొలసి పోయేవారు. ఆదిభట్ల వారి 'బేహాగ్' రాగ ప్రస్థానానికి 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాగూర్ మంత్రముగ్ధుడైపోయారు. సర్వేపల్లి రాధాకృష్ణ, సరోజనీదేవి వంటి విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎందరో ఆదిభట్లవారి ప్రజ్ఞకు నీరాజనాలు పట్టారు. విజయనగరంలో ఐదుతాళాలతో కథాగానం చేసి, దక్షిణాది పండితులను ఓడించి 'పంచముఖీ పరమేశ్వర' బిరుదును గెలుచున్న ఘనుడు ఆదిభట్ల. హరికథలే కాక, అష్టావధానాలు చేశారు. తెలుగు, సంస్కృతం, తమిళం, హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఇంగ్లిష్, అరబ్బీ, పార్శీ మొదలైన అనేక భాషల్లో ప్రావీణ్యం ఆయన ఐశ్వర్యం. శతాధిక గ్రంథాలు రాశారు. సంగీతాన్ని – సాహిత్యాన్ని సమ ప్రతిభతో ప్రదర్శన చేశారు. అనేక అంశాలపై అపురూపమైన పరిశోధనలు చేశారు. సంగీతంపై లాక్షణిక గ్రంథాలు రాశారు. తాత్వికత సిద్ధాంతాల శాస్త్ర గ్రంథాలు రాశారు. హరికథలు, ప్రబంధాలు, శతకాలు, నాటకాలు, అనువాదాలు ఇలా అనంతముఖంగా ఆ రచనా విన్యాసం విజృంభించింది. ఉమర్ ఖయ్యామ్ రుబాయీలను అనువాదం చేసిన తీరు అనన్య సామాన్యం. నాలుగు విధాలుగా ఆ అనువాదం సాగింది. పారశీలో నుంచి సంస్కృతంలోకి, అచ్చతెలుగులోకి అనువాదం చేశారు. ఫిట్స్ జెరల్డ్ ఇంగ్లిష్ లో రాసిన దానిని కూడా అచ్చతెలుగు, సంస్కృతంలో భిన్న ఛందస్సుల్లో అనుసృజన చేసిన తీరు ఆదిభట్లకే చెల్లింది. 'నవరస తరంగిణి' అద్భుతమైన రచన. కాళిదాసు సంస్కృత కవిత్వం, షేక్స్ పియర్ ఇంగ్లిష్ సాహిత్యంలోని నవరసాలను తెలుగులో అనువదించిన వైనం అనితర సాధ్యం. 'దశవిధ రాగ నవతి కుసుమ మంజరి' మరో మాణిక్యం. మంజరీ వృత్తంలో 90 రాగాలతో ఈ రచన సాగింది. ఋగ్వేదంలోని ఋక్కులను స్వరపరచి వీణపై వినిపించడమే కాక, ఎందరికో నేర్పించారు. ఆ ఋక్కులను తెలుగుగీతాలు గానూ సృష్టించాడు. ఆయన 'శంభో..' అంటూ నినాదం చేస్తూంటే.. విజయనగరం మొత్తం వినపడేది. కేవలం, ఆయన గురించే విజయనగరంలో సంగీత విద్యాలయాన్ని స్థాపించారు. దానికి ఆయనే మొట్టమొదటి ప్రిన్సిపాల్. నోబెల్ ప్రైజ్ కు నామినేట్ చేయడానికి బ్రిటిష్ వారు ఉత్సాహం చూపించినా, ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఎన్నో రచనలు చేశారు. ఎన్నో వేషాలు వేశారు. 'అచ్చతెలుగు'పై మక్కువ ఎక్కువ పెంచుకొని విశిష్టమైన కృషి చేశారు, రచనలు అందించారు. నూరుగంట, మొక్కుబడి, వేల్పువంద, తల్లి విన్కి (లలితా సహస్ర నామం), వెన్నుని వేయిపేర్ల వినికరి (విష్ణు సహస్ర నామ కీర్తనం) మొదలైనవి ఎన్నో ఉన్నాయి. అనేక అచ్చతెలుగు పదాలను సృష్టించారు. ఆయన ముట్టని కళ లేదు. ఆయనకు దక్కని బిరుదు సత్కారాలు లేవు. తెలుగునాట గజ్జెకట్టి కథ చెప్పే ప్రతి హరిదాసు మొట్టమొదటగా తలుచుకొనేది నారాయణదాసునే. సర్వ విద్యా పారంగతుడు, సర్వ కళాస్వరూపుడైన ఆయనకు గురువంటూ ప్రత్యేకంగా ఎవ్వరూ లేరు. అన్నీ స్వయంగా సిద్ధించినవే. రససిద్ధిని చేకూర్చినవే. చెన్నపట్టణానికి చెందిన భాగవతార్ కుప్పుస్వామి నాయుడు విజయనగరంలో చెప్పిన హరికథ విని, నారాయణదాసు 'ధ్రువ చరిత్రం' అనే హరికథను రాశారు. అదే ఆదిభట్ల రచించిన మొట్టమొదటి కథ. సొంత కీర్తనలు, భాగవత పద్యాలు, పంచతంత్రకథలు కలిపి రూపకల్పన చేశారు. వేణుగోపాలస్వామి దేవాలయంలో 1883లో తొట్టతొలిగా ప్రదర్శన చేశారు. కాళ్ళకు గజ్జెకట్టి ఆడిన ఆ ఆటే తర్వాత ' ఆటపాటల మేటి'గా అనంతమైన కీర్తిశిఖరాలకు చేర్చింది. శ్రీకాకుళం జిల్లా ఉర్లాం సంస్థానంలో తొలిసారిగా సంగీత సాహిత్య సమలంకృతంగా 'అష్టావధానం' చేశారు. ఎవరో సవాల్ విసిరితే! రాత్రికి రాత్రి 'అంబరీషోపాఖ్యానం' హరికథను రూపొందించారు. అదంతా ధారణలో ఉంచుకొని, ఆ మర్నాడే అద్భుతంగా ప్రదర్శించి అందరినీ అమితాశ్చర్యపరచారు. అది కూడా ఉర్లాం సంస్థానంలోనే జరిగింది. ఇది ఆయన రూపొందించిన రెండో హరికథ. 20ఏళ్ళ వయస్సు రాకముందే ప్రదర్శనలు ఇచ్చి, తెలుగుహరికథకు కొత్త రూపాన్ని ఇచ్చారు. ఆయన ఏకసంథాగ్రాహి. ఏదైనా కేవలం ఒక్కసారి వింటే, హృదయంలో నాటుకుపోయేది. చిన్నప్పటి నుంచీ అదే తీరు. నాలుగేళ్ల వయస్సులోనే భాగవత పద్యాలు చదివేవాడు. పద్నాలుగేళ్ళ వయస్సు వరకూ స్కూల్ ముఖమే చూడలేదు. కొన్ని వందల పద్యాలు, శ్లోకాలు, కీర్తనలు కేవలం విని హృదయస్థం చేసుకున్నారు. ఆ తర్వాత ఎఫ్ ఏ పాసయ్యారు. పదేళ్ల ప్రాయంలోనే తాళపత్ర రచనలో ప్రావీణ్యం పొందారు. వీణావాదనా ప్రజ్ఞ కూడా సహజ ప్రతిభా సంస్కారాలతోనే అబ్బింది. బొబ్బిలి సంస్థాన విద్వాంసుడు వాసా సాంబయ్య దగ్గర కేవలం ఒక నెలరోజుల పాటు వీణలో శిష్యరికం చేశారు. తదనంతర జీవితంలో ఎందరో పెద్దలతో పరిచయ భాగ్యం ఏర్పడింది. వారి నుంచి అనేక విశేషాలు, మెళుకువలను తన సూక్ష్మగ్రాహ్య ప్రజ్ఞతో ఒంటపట్టించుకున్నారు. ఆ గానం, ఆ గాత్రం, ఆ ప్రదర్శనం, ఆ వ్యక్తిత్వం, ఆ వైభవం అన్నీ ముగ్ధమనోహరమైనవే. ఆయన ఆత్మకథ ' నా ఎరుక' పెను సంచలనం. తన ముప్పైఏళ్ళ వరకూ జీవితంలో సాగిన విశేషాలన్నీ అందులో ఉంటాయి. తన విలాస పురుషత్వం, రసికత్వం అన్నీ అక్షరబద్ధం చేశారు. ఏ అనుభవాన్నీ దాచిపెట్టని తెగువ ఆయనకే చెల్లింది. ఆయన జీవితమే ఒక ప్రభంజనం. ఆగష్టు 31 ఆదిభట్లవారి జయంతి. ఎనిమిది పదుల సంపూర్ణ జీవితాన్ని అనుభవించిన పరిపూర్ణుడు (1864–1945). సూర్యనారాయణ నుంచి నారాయణదాసుగా మహా అవతారమూర్తిగా వాసికెక్కిన ప్రతిభామూర్తి. ఈ హరికథా పితామహుడు మన తెలుగువాడు. సర్వ కళలకు రేడు.

# సరస్వతీపుత్రునికి సాహిత్య నీరాజనం

"సెప్టెంబర్ 1వ తేదీ పుట్టపర్తి నారాయణాచార్యుల వారి వర్ధంతి" సందర్భంగా "వాణి నారాణి" అని "పిల్లలమర్రి పిన వీరభద్రుడు" చెప్పుకున్నట్లు, "శ్రీశ్రీ" "ఈ శతాబ్దం నాది" అని వెల్లడించుకున్న తరహాలోనే "పాండితీ శోభ" "పదునాల్గు భాషలందు" అని సగర్వంగా చెప్పుకున్న "సాహిత్య పిపాసకుడు" మన "పుట్టపర్తి" వారు. "తమ్ములై ఘటిత మోదమ్ములై సుకృత రూ పమ్ములై, శాస్త్ర భాగ్యమ్ములై కులుకు నీలపు గండ్ల దళుకు జూపులు బూయ ఘల్లు ఘల్లుమని కాళ్ళ జిలిపి గజ్జెలు మ్రోయ ఆడెనమ్మా శివుడు పాడెనమ్మా భవుడు"! అనుచు అచ్చ తెలుగు పదాలతో పాఠకుల మనస్సుతో శివతాండవం ఆడించిన పండితుడు, మహాకవి మన "పుట్టపర్తి నారాయణాచార్యులు". పుట్టపర్తి వారికి అఖండమైన కీర్తి తెచ్చిపెట్టిన కావ్యం "శివతాండవం". పండితుడు కవి కావచ్చు. కవి సంగీత నిధి కావచ్చు. కవి వక్త కావచ్చు. వక్త విమర్శకుడు కావచ్చు. విమర్శ కుడు బహుభాషాప్రవీణుడు కావచ్చు. కానీ ఈ లక్షణాలన్నీ ఒకే వ్యక్తిలో ఉండటం అరుదు. ఆ అరుదైన ఆణిముత్యం లాంటి మనిషి, 14 భాషల్లో పాండిత్యం, ఎనిమిది భాషల్లో కవిత్వం కూడా చెప్పగల దిట్ట. సంగీత, సాహిత్య, నాట్య శాస్త్రాలలో సంపూర్ణ పాండిత్యం కలవాడు, సాక్షాత్తు ఆ సరస్వతీ మాతనే మెచ్చిన ఘనుడు మన "సరస్వతీపుత్రుడుగా" కీర్తిశిఖరాలన ధిరోహించిన సాహిత్యాభిమాని, మనమందరం నచ్చిమెచ్చిన మహా పండితుడు మన "పుట్టపర్తి నారాయణాచార్యులు" గారు. పలుకు పలుకులో మధురిమలను ఒలికించిన ఈ మహోన్నత సాహితీ శిఖరం 1914 మార్చి 28 వ తేదీనఅనంతపురం జిల్లాలో చియ్యేడు గ్రామంలో జన్మించారు. తల్లి లక్ష్మీదేవి, తండ్రి శ్రీనివాసాచార్యులు గారు. అసలు పుట్టపర్తి వారి ఇంటి పేరు తిరుమల వారు. శ్రీకృష్ణదేవరాయల రాజగురువు తిరుమల తాతాచార్యుల వంశం వారిది. చిత్రావతీ తీరంలో పుట్టపర్తిలో ఉండడం వల్ల ఇంటిపేరు పుట్టపర్తిగా మారింది. అగ్నివీణ, పెనుగొండలక్ష్మి, శివతాండవం, మేఘదూతం, గాంధీజీ మహాప్రస్థానం, సిపాయి పితూరి, అష్టాక్షర కృతులు, కబీరు వచనావళి, బుద్ధ భగవానుడు,, రామకృష్ణుని రచనా వైఖరి, మహాభారత విమర్శ మొదలైనవి వీరి రచనలు. పుట్టపర్తి వారి "ఆంధ్రాభిమానం" ప్రశంసనీయం. సమకాలీన కవులవలె పుట్టపర్తి వారు ముమ్మూర్తులా ఆంధ్రాభిమానం కల మనిషి అని చెప్పవచ్చు. అందుకు నిదర్శనం "పెనుగొండలక్ష్మి" అనే కావ్యం మాత్రమే కాదు. కావ్యమాలలో గల "ఆంధ్రప్రశస్తి" ఖండిక కూడా! తన 12వ ఏటనే ఈకావ్యాన్ని రచించారట. "పిట్ట కొంచెం కూత ఘనం" అంటే ఇదేనేమో మరి. తాను విద్వాన్ పరీక్షకి వెళ్ళినప్పుడు తాను రచించిన పుస్తకం చదివి తానే జవాబులు రాయవలసిన పరిస్థితి ఏర్పడిందట. ఇంతకంటే విశేషమైన, విచిత్రమైన గుర్తింపు ఇంకా ఏకవికి దక్కలేదనటంలో "అతిశయోక్తి లేదని" చెప్పవచ్చు. "పెనుగొండ లక్ష్మి" కావ్యాన్ని "మద్రాసు విశ్వవిద్యాలయం" వారు "విద్వాన్" పరీక్ష రాసే విద్యార్థులకు పాఠ్యపుస్తకంగా నిర్ణయించారు. పెనుగొండలక్ష్మి "క్షేత్రప్రశస్తికి" చెందిన కావ్యాల్లో మొట్టమొదటిదని ఆచార్య "సింగిరెడ్డి. నారాయణరెడ్డి" గారు అన్నారు. "అగ్నివీణ లోని" ఖండికలు పుట్టపర్తి వారు తన 16 వ ఏటనే రచించారు. కవి హృదయమె ఒక వీణ. సన్నివేశాలకు శృతిని కల్పించి అనుభూతిని కలిగించారు. కావ్యనాయిక "వరూధిని"ని ఇలా పలకరించారు. "ఓసి! యేమే !వరూధినీ! ఒక్కసారి కౌగిలింతవు రమ్ము.. ద్రాక్షాగుళుచ్ఛ ములు బిగిసికొన్న మా తెనగు పొలము లందు వలపు దూసికిళ్ళువోవు నీవాలు చూపుయవనపు పొంగు పాషాణమైనయట్టి ప్రవరుని క్రోధాగ్నిలో వేల్చి భావచిక్క ణాస్త్రములగుందుచున్న సుధా స్రవంతి హత్తి కొందును నా



హృదయమ్మునందు" అని వరూధిని పట్ల సానుభూతి చూపిస్తారు. వరూధిని బతుకులాటకు దివ్యదీపమట "కవితా పితామహ రక్తయవకాంకిత శిరీష సుమకోమలాంఘ్రి యుగళ అట!" ఇంతటి "ప్రౌఢకవిత్వం" చిన్నప్పుడే అలవడింది పుట్టపర్తి వారికి. "మహాకవి కాళిదాసు మేఘసందేశం" ఆధారంగా నవ్యతని సమకూర్చుకొని సామాజిక స్పృహతో పుట్టపర్తి వారు "మేఘదూతం" అనే గేయకావ్యాన్ని రచించారు. అధికారుల అన్యాయాన్ని, ఎదిరించినందుకు ఒక యువకుడు జైలుపాలవ్వటం, కారాగారంలో నరకం వంటి జీవితాన్ని గడుపుతూ కొత్తగా పెళ్లైన తన భార్యను గురించి పరిపరివిధాల విచారిస్తున్న ఆ ఖైదీకి కిటికీలోంచి ఒక మేఘం కనిపించింది. ఆంధ్రదేశానికి ఉత్తరపు కొన శ్రీకాకుళంలో ఉన్న తన భార్యకు సందేశాన్ని అందించవలసిందిగా ఖైదీ ఆ మేఘుణ్ణి ప్రార్థిస్తాడు. చుట్టూ తిరిగి వెళ్ళటం దూరమైనా సరే ఆ ప్రాంతాలన్నీ చూస్తూ పొమ్మని చెప్తూ ఆ మార్గాన్ని కవి వర్ణించిన తీరు కడు ప్రశంసనీయం. "చుట్టనుచు జడిసేవు చేరంగ మఱచేవు కాకతీయుల యోరుగల్లు ఆంధ్ర చారిత్రక కన్యక పుట్టినిల్లు రుద్రమ్మ చండీశ్వరీ దేవి జలజలా పారించె శాత్రవుల రక్తమ్ము చెడని సెలయేఱుగా" అంటూ అద్భుతమైన వర్ణనలతో కావ్యాన్ని పరిపుష్టంగా పాఠక లోకానికి అందించారు. "పండరిభాగవతము ద్విపద కావ్యము" ఇందులో "పుండరీక చరిత్ర, చోకామీళునికథ, నామదేవ చరిత్రము, గోరాకుంభారు కథ, నరహరి చరిత్రము" అన్న కథలు ఉన్నాయి. తెలుగులో ఉన్న ఇతర రామాయణాలకూ పుట్టపర్తి వారి "జనప్రియ రామాయణానికీ" చాలా తేడా ఉంది. పుట్టపర్తి వారి కావ్యాల్లో మరో ఆణిముత్యం షాజీ. ఈ కావ్యాన్ని తన తొమ్మిదవ ఏటనే రాశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఇంటర్మీడియట్ కి పాఠ్య గ్రంథముగా నిర్ణయించారు. పుట్టపర్తి వారు చిరుప్రాయం నుంచి రచనలు చేయడాన్ని బట్టి "చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడే" శ్రీనాథుడు కావ్య రచన చేసినట్టుగా "మరో శ్రీనాథుడుగా "మన నారాయణాచార్యులు గోచరిస్తున్నారు. తులసీదాసు గారి "రామాయణాన్ని" చదివేందుకు "హిందీ భాషను" పట్టుబట్టి మరీ నేర్చుకున్నారు. దేశపర్యటనలో భాగంగా హృషీకేశ్ వెళ్ళినప్పుడు పుట్టపర్తి వారి పాండిత్యాన్ని పరీక్షించిన "శ్రీ శివానంద సరస్వతి" గారు అతనికి "సరస్వతీపుత్ర" అనే బిరుదునిచ్చి సత్కరించారు. 1972 వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం వారిచే "పద్మశ్రీ" బిరుదును పొందారు. 1968లో "జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా" గౌరవాన్ని పొందారు. 1975లో "జనప్రియరామాయణం" రచనకు గాను "కేంద్ర సాహిత్య అకాడమీ" అవార్డు లభించింది. 1988లో "భారతీయ భాషా సంస్థాన్ అవార్డును" అందుకున్నారు. 1990లో తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే అన్నమాచార్య జయంతి సందర్భంగా "బంగారు పతకాన్ని" పొందారు. "పండరీ భాగవతమ్" అనే ద్విపద కావ్యానికి "ఓరియంటల్ లిటరరీ" అవార్డు లభించింది. ఇలా ఎన్నెన్నో బిరుదులు, అవార్డులను తాను పొందినప్పటికీ తనకు మాత్రం "సరస్వతీపుత్ర" అనే బిరుదు ఎంతో ఇష్టమట తన 74వ ఏట కూడా ఆయన "ఉర్దూ భాషను" నేర్చుకున్నారంటే అతని భాషాభిమానానికి తూకం వేయగలమా! ఓ మంచి రచన ఎలా ఉండాలి అనే అంశాన్ని చెబుతూ రచనా నియమాల కంటే భావమే ప్రధానమని పేర్కొంటారు. విజయవాడలో పుట్టపర్తి వారు తన "శివతాండవం" గానం చేసినప్పుడు మొట్టమొదటి "జ్ఞానపీఠ అవార్డు" గ్రహీత "విశ్వనాథ సత్యనారాయణ" గారు ఆనంద పరవశుడై అతనిని భుజాలపైన కూర్చోబెట్టుకుని ఎగిరారట. ఇంతకంటే గొప్ప సన్మానం ఇంక ఏ కవికైనా ఈ ప్రపంచములో జరిగి ఉంటుందా! ఇంకొకసారి వైజాగ్ యూనివర్సిటీలో ప్రాకృత భాషల గురించి మాట్లాడుతున్నప్పుడు ఉపన్యాసం అయిపోయాక ప్రాకృత భాషలలో పాండిత్యం గల "పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి" గారు సభికులలో నుంచి వచ్చి పుట్టపర్తి గారి ప్రతిభకు మెచ్చి "సాష్టాంగ నమస్కారం" చేశారట. "పుట్టపర్తి గారు తెలుగసాహిత్యంలో ఓ భక్త కవిగా నిలిచిపోతారనుచు".... "ఆచార్య తిరుమల రామచంద్ర గారు" ప్రశంసించారు. "కవిత్వాన్ని, పాండిత్యాన్ని కలగలిపి ఔపోశన పట్టిన అగస్త్యుడు! వ్యవహారాజ్ఞత అంటని వైదిక జాతకుడాతఁడు. రక్తికి, భక్తికి సేతువు రచియించిన రసికుడతడని"..... రెండవ "జ్ఞానపీఠ అవార్డు" గ్రహీత " సినారె" గారన్నారు. "ఆయన కవితా రచనలో నన్నయగారి నాదమధుర్యం కూడా వుంది. పద్యంలో, పదంలో, గేయంలో అక్షర రమ్యత సాధించారు. ఈ శతాబ్ది తెలుగు కవులలో వారిది ఒక విశిష్టమైన వ్యక్తిత్వం. ఒక విలక్షణమైన సాహితీ మూర్తిమంతం. పదిమంది సమూహంలో ఇట్టే పోల్చుకోదగిన ప్రతిభ ఆయన సొంతం" అని... "అక్కిరాజు రమాపతిరావు" గారన్నారు. "శివతాండవం విన్నప్పుడు తుంగభద్రా ప్రవాహంలో కొట్టుకు పోతున్నట్లునిపించింది. తర్వాత మేఘదూతం చదివాను. ఇది నా దృష్టిలో శివతాండవం కంటే గొప్ప రచన".... "రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ" గారన్నారు. జ్ఞానపీఠం వంటి గౌరవానికి వారు నిజంగా అర్హులు. కానీ అది తెలుగువారి దురదృష్టం వల్ల వారికి లభించలేదు. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు. """దివికేగిన మరో సాహిత్య తార""" 1990వ సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీన గుండెపోటు కారణంగా ఆయన దివికేగి అశేష సాహిత్యాభిమానులను శోకసంద్రంలోకి నెట్టేశారు. 1991లో నారాయణాచార్యుల వారి "రాతి విగ్రహాన్ని ప్రొద్దుటూరులోను" ,2007లో ప్రొద్దు టూరు పట్టణంలో "కాంస్య విగ్రహాన్ని" ప్రతిష్ఠించారు. "సాహిత్య వినీలాకాశంలో" పుట్టపర్తి నారాయణాచార్యులు గారు "ఓ ధృవతారగా" నిలిచిపోయారు.



– లలితారెడ్డి

# తెలుగు సినీ సంగీతాన్ని గగన దిశకు తీసుకెళ్లిన పెండ్యాల

సప్తస్వరాల ఉయ్యాల.... పెండ్యాల...అని ఘనత వహించిన శ్రీ పెండ్యాల గారికి వర్ధంతి నివాళులు.. చిత్రసీమలో వెలయగ చేసి దివ్యగానమున జీవము పోసి ఆలాపనలకే రూపం తెచ్చి తెలుగు సినీ సంగీతాన్ని... గగన దిశకు తీసుకెళ్ళి తారాపథంలో నిలబెట్టి ఆచంద్రతారార్కం ఆ మధుర సంగీతాన్ని వింటూ పరవశిస్తూ పాడుకునేలా చేసిన మకుటం లేని సంగీత సామ్రాట్టు కీ.శే. పెండ్యాల నాగేశ్వరరావు గారు. పేరుకు నాగేశ్వర రావే గానీ... సంగీత లోకాన రాగేశ్వర రావు! తెలుగు చిత్రసీమలో సంగీతక్షేత్రాన్ని, హార్మోనియం అనే హలంతో దున్ని, సప్తస్వరాలనే విత్తనాలు చల్లి. ఎన్నో చక్కని పాటల పంటలు పండించిన పెండ్యాల గారి గురించి ఓ మూడు ముక్కల్లో చెప్పెయ్యొచ్చు! ఓర్పుబినేర్పుబికూర్పుబిఅని. ఏస్వరాన్ని ఎటుమార్చి, ఆస్వరంపైన మరోస్వరం పేర్చి, పాటకు రసపుష్టి చేర్చే ఓర్పు గాయనీ గాయకుల సత్తా ఎరిగి, ఎవరి దగ్గర ఏవైనంతో ఎంత పిండాలో అంతా పిండేసే.. నేర్పు పాటలోని పదాల బరువును తూచి దానికి సరితూగే వరాల స్వరాలు పేర్చి సందర్భశుద్ధి, మెలొడీ, మూడ్ అన్నీ తూచి...తాననుకున్నట్లు వచ్చేవరకు సాగుతుంది వారి కూర్పు మరి అందుకే సినిమా ఏదైనా హీరో హీరోయిన్లు ఎవరైనా దర్శకుడెవరైనా సంగీతం పెండ్యాల అనగానే పసందైన పాటలు వినగలమని ఇచ్చేస్తారు ప్రేక్షకులు.. తీర్పు! ఇంతటి వీరికి కూడా...ఒకరి దగ్గర శిష్యరికం చేసి.... వారి దగ్గర ఆయన చేసే క్రొత్త పోకడలన్నీ నేర్చుకోవాలని ఆశ! అంటే! వారెవరో కాదు! విదేశీయ సంగీతాన్ని, హిందూస్థానీ పోకడల్ని మిళితం చేసి అచ్చతెలుగు పాటలా వినిపించగల సమర్థులు కీ.శే.ఎస్.రాజేశ్వర రావు గారే! కానీ కుదరలేదు. వీరి సంగీత ప్రతిభ, హార్మోనియం శైలి, రాగ జ్ఞానం అన్నీ విన్నారు రాజే(స్వర)శ్వర రావు గారు. మెచ్చుకున్నారు కూడా. అప్పుడు పెండ్యాల గారు తల్లిప్రేమ(41), సతీ సుమతి(42) మూవీస్‌కి సహాయ సంగీత దర్శకుడుగా ఉండేవారు. అప్పుడే యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. మన పెండ్యాల గారు మద్రాస్ విడిచి సొంత ఊరు వెళ్ళిపోయారు తండ్రి సీతారామయ్య గారు సంగీతం మాస్టర్ పిల్లలకు సంగీతం చెప్తుంటే చిన్నప్పటి నుండే పెండ్యాల సంగీతంలో నిగ్గు తేలినా ఇంకా ఎంతో నేర్చుకోవాలనే తృష్ణతో ఉండేవారు! హరికథలకు నాటకాలకు హార్మోనియం వాయించడం నాటకాలలో స్నేహితుడైన అక్కినేనితో సమానం గా ఆడ వేషాలేయడం చేసే వాడు. అక్కినేని సీతారామ జననంతో నటుడై వెళ్ళాక పెండ్యాల మాయా లోకం (45), గృహ ప్రవేశం చిత్రాల కు అసిస్టెంట్‌గా చేస్తున్నప్పుడు మొట్టమొదటి అవకాశం కె.ఎస్. ప్రకాశరావు కల్పించాడు. అదే ద్రోహి(48) సినిమా. పాటలకు మంచి పేరొచ్చింది. స్థిరపడి పోయి ఇక తిరుగులేకుండా పని చేశారు. తను అనుకున్నట్లు పాడించడంలో పెండ్యాల సిద్ధహస్తుడు. శ్రావ్య మాధు ర్యాలు ముప్పిరిగొన్నట్లు గానంలో మాధుర్యం పాల మీద మీగడ తేలుతున్నట్లు ఉన్నా ఆ ఎఫెక్ట్ రావడానికి ఎంత కష్టపడాలో అంతా పడి గాయనీగాయకుల నుండి బెస్ట్ వెలికి తీసుకొచ్చే వరకు వదిలేవారు కాదు! పెండ్యాల గారి దృష్టిలో ఘంటసాల మాస్టర్లాంటి గాయకుడు ఇంకెవరూ లేరు. ఇక రారు అనేవారు. అంత ఇష్టం మరి. అది సత్యదూరం కూడా కాదు. ఎందరో గాయనీమణులను పరిచయం చేసినా... వారిలో మణిపూసలైన గాయనీమణులు మాత్రం పి.సుశీల గారు ఎస్.జానకి గారని చెప్పనక్కరలేదు. ఏ గాయనీ గాయకుల బెస్ట్ సాంగ్స్ లిస్టులలోనైనా సరే.... పెండ్యాల స్వరపరచినవే అధిక శాతం ఉంటాయి! దొంగరాముడు(55), ముద్దుబిడ్డ(56), భాగ్యరేఖ (57),జయభేరి(59),మహాకవి కాళిదాసు, వేంకటేశ్వర మహా త్యం (60), బావామరదళ్ళు, జగదేకవీరుని కథ(61), మహా మంత్రి తిమ్మరుసు (62),శ్రీకృ ష్ణార్జున యుద్ధం(63) రాముడు–భీముడు (64),శ్రీకృష్ణ తులాభారం (66) ఇవి కేవలం కొన్ని మాత్రమే. షుమారు 150 సినిమాలకు పైగా చేశారు అన్ని



భాషలలో కలిపి! పద్యాలు....వాటికి రాగాలు అందించ డంలో పెండ్యాల గారి శైలికి చక్కటి ఉధాహరణ శ్రీకృష్ణ తులాభారం(66)... న భూతో...న భవిష్యతి. సంగీత దర్శకులప్పుడు అంత డెడికేషన్ చూపించి.... గాయనీ గాయకులతో అద్భుత సంగీత నిధిని మనకందించారు. అది మన తెలుగు వారి అదృష్టం. మరిప్పుడు....సంగీతం....భ్రష్టు పట్టిపో యింది. కనీసం థియేటర్ లోనే వినలేక పోతున్నాం! విన్నా...ఆ రోజే మరచిపోతున్నాం. ఎన్ని శతాబ్దాలైనా పాతపాటలు అలాగే స్థిరంగా నిలిచి మురిపిస్తూనే ఉంటాయి! సప్తస్వరాలను ఊయల ఊగించిన ఘనత వహించిన పెండ్యాల నాగేశ్వరరావు గారి వర్ధంతి. (31–8–1984).ఆ సంగీత స్రష్టకు స్మృత్యంజలి సమర్పిస్తూ. వారు స్వరపరచిన ఆణిముత్యా ల్లాంటి 2 పాటలు ఆనందనిలయం. గోపాలునికెంతమంది గోపికలున్నా గుండెలోన నెలకొన్నా రాధ ఒక్కటే.. ఆకాశవీధిలో తారలెన్ని ఉన్నా అందాల జాబిల్లి అసలు ఒక్కటే. పదిమందిలో పాటపాడినా.. అది అంకితమెవరో ఒకరికే విరితోటలో పూలెన్ని పూసినా గుడికి చేరేది నూటికి ఒకటే !!పది!! సత్య హరిశ్చంద్ర. సదా సుప్రకాశా మహాపాపనాశా ఆ.... కాశీ విశ్వనాథా దయా సింధువీవే నమో పార్వతీ వల్లభా నీలకంఠా నమో భూత నాథ నమో దేవదేవ నమో భక్తపాల నమో దివ్యతేజా నమో భూత నాథ. బావా మరదళ్ళు. అందుకో జాలనీ... ఆనందమే నీవు ఎందుకో చేరువై దూరమౌతావు నీలిమేఘాల లో.. గాలి కెరటాలలోనీవు పాడే పాట వినిపించునీ వేళా నీలిమే ఘాలలో... కృష్ణప్రేమజి అవని భారము అమితముకాగా అవతరించితివి యెన్ని సారులో! కృష్ణా! అన్నిటి కన్న అపురూప మైనది కన్నుల విందగు ఈనాటి రూపము మోహన రూపా గోపాలా! ఆఆ.. మోహన రూపా గోపాలా! ఊహాతీతము నీ లీల మోహన రూపా గోపాలా!

–సేనాధిపత్యం రమేష్

# కొండ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

## శాసనసభ్యులు గద్దె రామమోహన్





**విజయవాడ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడుతున్న నేపథ్యంలో కొండ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని శాసనసభ్యులు గద్దె రామమోహన్ కోరారు.శనివారం ఉదయం క్రీస్తురాజపురం సున్నపు బట్టీల సెంటర్ ఏరియాలో కొండ చరియలు పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హుటాహుటిన అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలలో ఇటువంటి వర్షాలు ఎప్పుడూ పడలేదన్నారు. నిత్యం కరుస్తున్న వర్షాల కారణంగా కొండ చరియలు విరిగి పడి నలుగురు ప్రాణాలు కొల్పోవడం చాలా బాధాకరమని గద్దె రామమోహన్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో గతంలో అనేక సార్లు చిన్న చిన్న కొండ రాళ్ళు పడిన సందర్భాలు ఉన్నాయి గాని ఇంత పెద్ద కొండచరియ పడి ఈ స్థాయిలో ప్రమాధం జరగడం ఇదే మొదటి సారి అన్నారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి తగు సూచనలు చేస్తున్నారని, అలాగే తనతో మాట్లాడి సహాయక కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకుంటున్నారన్నారు. రెస్క్యూ టీమ్ వచ్చి రాళ్ళను తొలగించి కొందరి ప్రాణాలు కాపాడడం జరిగిందన్నారు. గతంలో కూడా తాను ఈ ప్రాంతంలోని వారికి అనేక మార్లు మీరు ప్రమాద ప్రాంతంలో ఉంటున్నారని ఖాళీ చేయాలని విన్నవించడం జరిగిందన్నారు. అయినా కూడా ఎప్పటికప్పుడు కొత్తవారు రావడం జరిగిందన్నారు. ఇంకా కూడా కొంత మంది తాము ఎంతోకాలం నుంచి ఉంటున్నామని, ఏమి జరగదనే ధైర్యంతో ఉంటున్నారని, ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లోని వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని కోరారు. వారు వెళ్ళని సందర్భంగా ప్రమాధాలను నివారించేందుకు బలవంతంగా అయినా వారిని ఖాళీ చేసి ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా చూస్తామన్నారు. కొండ ప్రాంతాల్లో ఉండే వారు వర్షాలు పడేటప్పుడు సురక్షిత ప్రాంతానికి చేరుకుని అక్కడ తలదాచుకోవాలని తద్వారా ప్రాణాపాయ ప్రమాధాలు తప్పుతాయన్నారు. గద్దె రామమోహన్తో పాటు డివిజన్ తెదేపా అధ్యక్షులు నందిపాటి దేవానంద్, షేక్. షరీఫ్, కోడూరు సుబ్రమణ్యం, పటమట సతీష్ చంద్ర, దోమకొండ రవి, పెనుగొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మండలంలో 91 శాతం ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్‌ల పంపిణీ : ఎంపీడీవో దేవసేన కుమారి



**అద్దంకి ఆగస్టు31( ఆంధ్రపత్రిక)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాలలో 91 శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో దేవసేన కుమార్ తెలిపారు శనివారం మండలంలోని అన్ని గ్రామాలనందు సచివాలయ సిబ్బంది ద్వారా మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో భారీ వర్షం కురుస్తున్నప్పటికీ వర్షంలోనే వికలాంగులకు వృద్ధులకు ఇబ్బంది కలగకుండా మండలంలోని 7076 మంది గాను 6443 మందికి రెండు కోట్ల 67 లక్షల 44 వేల రూపాయలను ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ లను పంపిణీ చేశామన్నారు ఇవ్వాల్సిన పెన్షన్ లను రెండు రోజుల్లో అందజేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



15 డివిజన్ రామలింగేశ్వర నగర్ సాయిరాం కట్ పీసెస్ రోడ్ లో పర్యటించి వర్షపు నీటిలో మునిగిన ఇళ్లను పరిశీలించిన యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ అధికారులతో మాట్లాడి మోటార్లు ఏర్పాటు చేయించి వర్షపు నీటిని తొడించారు. అలాగే JCB తెప్పించి నీటి సరఫరా ఆగిపోకుండా చెత్త చెదారం తీయించారు.



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల లో ని మోడల్ కాలనీ లో వర్షంలోనే గొడుగుతో శనివారం పింఛన్లు పంపిణీ చేస్తున్న అంగన్వాడి టీచర్ బి నీరజ

# రైతులకు సబ్సిడీపై పామ్ ఆయిల్ మొక్కలు

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి





**నూజివీడు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** నూజివీడు నియోజకవర్గంలో ఈ ఏడాది 2,000 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ తోటలు విస్తీర్ణం లక్ష్యంగా చర్యలు తీసుకోవడం జరిగిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో రైతులకు సబ్సిడీపై పామ్ ఆయిల్ మొక్కలను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు.తొలుత గ్రామంలో వేంచియున్న.ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తదనంతరం మొక్కల కార్యక్రమం ప్రారంభించిన మంత్రి మొదట గ్రామ రైతు గోళ్ళ నాగరాజు కి ఆయిల్ ఫామ్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో ముసునూరు, ఆగిరిపల్లి ,చాట్రాయి ,నూజివీడు మండలాల్లో ప్రస్తుతం 15 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు అవుతుందని, ఈ ఏడాది మరో 2,000 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ తోటలను విస్తరించాలని లక్ష్యంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో ప్రస్తుతం 60 ఎకరాల్లో మాత్రమే ఈ పంట ఉండగా ఈ ఏడాది 200 ఎకరాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు .ఈ ఏడాది నూజివీడు మండలంలో 600 హెక్టార్లలో మిగిలిన మూడు మండలాల్లో 1400 హెక్టార్లలో పామాయిల్ తోటల విస్తరణ చేయాలని లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు .ఆయిల్ ఫామ్ తోటలు వేసుకునేందుకు హెక్టారుకు నాలుగు సంవత్సరాల పాటు 71 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మొదటి సంవత్సరంలో మొదటిగా మొక్కల మీద రూ.29,000 ఎరువుల కోసం ప్రతి ఏడాది 5,250 రూపాయలు చొప్పున, అదేవిధంగా పామాయిల్ పంట చేతికి వచ్చేవరకు అంతర్ పంటలు వేసుకునేందుకు నాలుగు సంవత్సరాల పాటు రూ. 5,250 సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. చాప్ కట్టర్స్ కోసం 50 వేల రూపాయలు సబ్సిడీని ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. నియోజకవర్గంలో ఆయిల్ ఫామ్ తోటల విస్తరణ కోసం రైతులను ప్రోత్సహించేందుకు నూజివీడు, ఆగిరిపల్లి మండలాలకు చెందిన రైతులకు పతాంజలి ఫుడ్స్ ముసునూరు ,చాట్రాయి మండలాలకు చెందిన రైతులు గోద్రెజ్ కంపెనీ మొక్కలను ముందుగా రైతులకు ఉచితంగా అందించాలని మంత్రి కోరారు .రైతులు అధిక దిగుబడి సాధించేందుకు ఉద్యానవన శాఖ సహకారం అందించాలన్నారు. అదేవిధంగా అదనపు ఆదాయం కోసం రైతులు అంతర పంటలను వేసుకోవాలని ఆయన సూచించారు ఆయిల్ ఫామ్ తోటల్లో మైక్రో ఇరిగేషన్ వినియోగించు కోవాలని సూచించారు .ఆయిల్ ఫామ్ విస్తీర్ణ పథకంలో రైతులకు మొక్కలను అందించడానికి ఉద్యాన శాఖ మరియు ఆయిల్ ఫామ్ కంపెనీలు (పతంజలి, గోద్రెజ్ ) సిద్ధంగా ఉన్నామని ఉద్యానశాఖ డిడి రామ్మోహన్ తెలిపారు. ఈ పథకము కావాల్సిన రైతులు, రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అనంతరం సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రతి మంగళ,బుధవారాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది వాల్ పోస్టర్ ను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డిడి రామ్మోహన్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి - పి. రవికుమార్ , జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ కె. హబీబ్ భాష , పతాంజలి లిమిటెడ్ డి జీ యం వీరేంద్ర చౌదరి , నూజివీడు ఉద్యాన శాఖ అధికారిని- ఆర్ హేమ, కే జ్యోతి ప్రియాంక, పార్టీ నాయకులు కాపా శ్రీనివాసరావు , అక్కినేని చందు , అక్కినేని బెనర్జీ , వ్యవసాయ శాఖ అధికారులు,అభ్యుదయ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్త, విశ్రాంత ఐఏఎస్ తలం విజయ్ కుమార్

### రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్



**గుంటూరు ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాలలో పని చేసినా గాని దేశంలో రైతు బాగుంటేనే వ్యవస్థ బాగుంటుందన్న ఆలోచనతో రైతు సాధికార సంస్థ ద్వారా సాంప్రదాయ వ్యవసాయానికి విశేషంగా కృషిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి తల్లం విజయ్ కుమార్ దేశం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్తని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ ఐఏఎస్ పేర్కొన్నారు. బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్డు హోటల్ వెల్కమ్ సమావేశ మందిరంలో సాంప్రదాయ వ్యవసాయ పరిశోధనలలో విశేషంగా కృషి చేసినందుకు పోర్చుగీస్ దేశం ప్రతిష్టాత్మకమైన "గుల్బెన్ కియన్" అవార్డుతో సత్కరించిన సందర్భంగా సత్కర సభ నిర్వహించారు. సభకు బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ వైస్ చైర్మన్ మరియు ఇండియన్ టొబాకో అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్ అధ్యక్షత వహించారు. రైతు నేస్తం ఎడిటర్ పద్మశ్రీ వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు మౌలికమైన వాతావరణ మార్పులను అధ్యయనం చేస్తూ రసాయనాల భారీ నుండి భూమిని కాపాడుకునే ప్రయత్నాలు చేయకపోవడం దురదృష్ట కరమన్నారు. ఐ టి సి వైస్ ప్రెసిడెంట్ కే కృష్ణకుమార్ మాట్లాడుతూ గ్లోబల్ ప్రోగ్రెస్ కోసం నోబెల్ బహుమతితో సమానమైన గుల్బెంకియన్ అవార్డు కోసం 117 దేశాలు పోటీ పడగా విజయ్ కుమార్ ను ఈ అవార్డు కు అర్హత ప్రకటించడం దేశంతో పాటు తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు. సత్కారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచర్ ఫార్మింగ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టి విజయకుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల వ్యవసాయాన్ని విషపూరితమైన రసాయనాల బారి నుండి కాపాడే ఉద్దేశంతో ఏపీ సీఎన్ ఎఫ్ ద్వారా సాంప్రదాయ వ్యవసాయం వైపు మార్చేలా అభివృద్ధి చెందిన దేశాల శాస్త్రవేత్తలతో కలిసి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయంలో ప్రధాన భూమిక అయిన మహిళల సాధికారత కోసం స్వయం సహాయ గ్రూపుల ద్వారా వారికి ఆర్థిక స్వావలంబన చేకూరుస్తున్నామన్నారు. భూతాపాన్ని తగ్గించాలన్నా, విషతులిత ఆహార ఉత్పత్తులు ద్వారా మనుషులతో పాటు సమస్త జీవజాతులు నశించకుండా పర్యావరణ సమతుల్యత కొనసాగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలలో తప్పనిసరిగా మార్పు రావాల్సిన అవసరం ఉన్నది అన్నారు. కార్యక్రమంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఫార్చ్యూన్ మురళి పార్క్ ఎండి ముత్తవరపు మురళీకృష్ణ, పలువురు ఐ సి ఎం ఆర్ శాస్త్రవేత్తలు, లాం వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతమైన ఉపాధ్యాయు వృత్తిలో ప్రభుత్వ ఉద్యోగి ప్రతి ఒక్కరూ ప్రజా సేవకులె

### సామాజికవేత్త డాక్టర్ గొల్లమూడి రాజ సుందర్ బాబు



**గుంటూరు ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ప్రభుత్వ సర్వీసులో పనిచేసే ప్రతి ఉద్యోగి, ప్రజా సేవకులు అని, ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవలను ప్రజలకు అందిస్తారని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర్ బాబు అన్నారు ఆగస్టు 31వ, గుంటూరు రెవిన్యూ కళ్యాణ మండపంలో, గుంటూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని కె ఉషారాణి పదవీ విరమణ సన్మాన సభలో డాక్టర్ గొల్లమూడి రాజసుందర్ బాబు పాల్గొని ప్రసంగిస్తూ నవభారత జాతి నిర్మాణం తరగతి గదుల్లోనే జరుగుతుందని ఆ కర్మాగారంలో ఉపాధ్యాయులు చేస్తున్న బోధనల వల్లనే భారత జాతి నిర్మాణం జరుగుతున్నదని, దేశంలో ఉన్న అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని డాక్టర్ గోళ్ళమూడి రాజసుందర్ బాబు అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా దేశ అభివృద్ధి నిర్మాణంలో భాగంగా ప్రతి విద్యార్థికి విద్యాబోధన నేర్పించడం ద్వారా భవిష్యత్తులో దేశానికి సమాజానికి ఉపయోగపడే ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మనిషిని సమాజానికి అందిస్తారని అటువంటి ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవప్రద మైనదని అన్నారు. సమావేశంలో పాల్గొన్న గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 41 సంవత్సరాల 21 రోజులు ఎటువంటి మచ్చ లేకుండా పనిచేయటం నేటి ఉపాధ్యాయు లందరికీ ఆదర్శనీయమని సన్మాన గ్రహీత ఉషారాణి యొక్క గుణగణాలను సేవలను కొనియాడారు. బోయపాలెం డైట్ ప్రిన్సిపాల్ అత్తోట కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నటువంటి సంతృప్తి మరి ఏ వృత్తిలో కానరాదని అన్నారు. లక్షలాదిమంది విద్యార్థుల భవితను నిర్ణయించేది ఉపాధ్యాయ వృత్తి అని అందులో ఉషారాణి రాణించారని, ఆయన తోపాటు ఉషారాణి గతంలో పనిచేసిన విషయాలను సభకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాసిం అధ్యక్షత వహించి ఉషారాణి సేవలను కొనియాడారు. అనంతరం గుంటూరు ఎం ఈఓ కుద్దూస్ మాట్లాడుతూ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక ముందే పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం 40000 కి మత్తు గలిగే మోటారును పాఠశాలకు అందించారని విద్యారంగం తరఫున కుషారాణికి కృతజ్ఞతలు తెలియ జేశారు. అందరికీ ఆదర్శనీయులుగా 40 సంవత్సరాల ఉద్యోగ ప్రయాణం లో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అందరిచే మంచి పేరు ప్రఖ్యాతల తో అందరి మన్నలను పొంది పదవి విరమణ చేయటం గొప్ప శుభ పరిణామం అని అన్నారు. ప్రసంగిం చిన వారిలో మాజీ ప్రధాన ఉపాధ్యాయురాలు బడుగు విజయలక్ష్మి, బోయపాలెం మరో ప్రిన్సిపాల్ సుభాని, సీనియర్ ఉపాధ్యాయులు జుబేదా బేగం, ఆరిఫ్, ఖయ్యూం, దేశ విదేశాల నుంచి వచ్చిన ఉషారాణి ఒక రక్త సంబంధీకులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

# కిక్కిరిసిన గోరంట్ల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంగణం



**గుంటూరు ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** స్థానిక గోరంట్ల అన్నపూర్ణ నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి సొసైటీ దేవస్థానం పెద్ద గుడి శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా అశేష కిటకిటలాడింది. వేకువజామున నిత్య పూజలు అనంతరం విశ్వక్సేన పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనే యులు దంపతులచే అమ్మవారికి సార సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ పవిత్ర శ్రావణమాసం సందర్భంగా గత నెల రోజులుగా ప్రతి శుక్రవారం 300 నుండి 500 మంది వరకు మహిళలు వరలక్ష్మి పూజలలో పాల్గొని దేవాలయానికి పవిత్రతను ప్రతిష్టను ఇనుముడింప చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ఎర్రం శెట్టి వేణుగోపాల్ సభ్యులు గజవల్లి శివన్నారాయణ, ఆళ్ల శివారెడ్డి, కేవీరెడ్డి, దేవరశెట్టి సురేష్ ,జల్లేపల్లి ముసలయ్య, పూసల శివయ్య, కటకం శెట్టి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో మీడియాపై జరిగిన దాడిని ఖండించిన ఏ.పి.ఎం.పి.ఏ.



**చల్లపల్లి, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల ద్వారా ఇంజనీరింగ్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినుల 300 వీడియోలు బయటకు వెళ్లాయి అన్న ఆరోపణతో కాలేజీ విద్యార్థులకు జరిగిన అన్యాయం గురించి న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై కాలేజీ యాజమాన్యం తమ అనుచరులతో మీడియాపై చేయించిన దాడిని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏ.పి.ఎం.పి. ఏ.) తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మీడియాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హిడెన్ కెమెరాల బాగోతం పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించి కాలేజీ విద్యార్థులకు అండగా నిలబడాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మన్నే సోమేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లికార్జున రావు, రాష్ట్ర కోశాధికారి, కృష్ణజిల్లా అధ్యక్షులు మత్తి శ్రీకాంత్, కృష్ణ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లాడ రామాంజనేయులు, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్, కృష్ణజిల్లా కోశాధికారి రేపల్లె యువరాజ్, అవనిగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు పండలనేని ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలను సంరక్షించండి

### అధికారులకు ఆదేశించిన: తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** గుంటూరు నగరంలో లోతట్టు ప్రాంతాలు ఈరోజు కురుస్తున్న భారీ వర్షాలకు వీధులన్నీ మునిగిపోయి ఇళ్లల్లోకి నీరు చేరడంతో వారి సంరక్షణకై ఆ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. నిన్నటి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గడ్డిపాడు చెరువు నిండి వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుందని ఆటోనగర్, మద్దిరాల కాలనీ,బసవ తారక్ నగర్, పాత గుంటూరు, ప్రాంతాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా వర్షంలో తిరుగుతూ పరిశీలించి వారికి తగు సూచనలతో అప్రమత్తం చేశారు. గత ప్రభుత్వం డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి వాగులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వలన నీరు పోయే దారి వీల్ లేక రోడ్ల ఇళ్లల్లోకి.నీరు చేరుతుందని ప్రధానంగా రైల్వే మొండికేట్ వద్ద డ్రైనేజీ వెంట్ ను తక్షణమే నిర్మాణం చేపట్టినైతే ఇటువంటి అధిక వర్షాల వల్ల వచ్చిన నీరు కానీ డ్రైనేజ్ నీరు గాని సులభంగా పోవడానికి ఉపయోగపడుతుందని అధికారులు మొండి గేట్ వెంట్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. అలాగే ప్రజలు కురుస్తున్న వర్షాలకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇళ్లలో నుండి బయటికి రావద్దని,ప్రజలను కోరారు. అలాగే వాతావరణ మార్పు వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు అప్రమత్తమై వేడి పదార్థాలు తినడం, గోరువెచ్చని నీరు తాగాలని కోరారు. అలాగే అధికారులతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో లో డ్రైనేజ్ వ్యవస్థకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు వీలైనంత త్వరలో తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ఇంతటి వర్షంలో కూడా తమ పట్ల బాధ్యతతో తమ ఏరియాలలో సందర్శించిన ఎమ్మెల్యే నసీర్ కు ఆయా ప్రాంత ప్రజలు అభినందించారు.

## మానవతా విలువలకు బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ ఉదయ శంకర్

### అమెరికాలో డాక్టర్ ఉదయ శంకర్ ను సత్కరించిన ఆప్త నిర్వాహకులు



**గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) మహోత్సవాలు ఇటీవల అమెరికాలో వైభవంగా నిర్వహించారు. మహోత్సవాలకు అహల్య నర్సింగ్ హోమ్ ఫిజీషియన్ అండ్ జేరియాట్రీషన్ డాక్టర్ శనక్కాయల ఉదయ శంకర్ గెస్ట్ ఆఫ్ హానర్ గా ఆప్త నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆప్త నిర్వాహకులు డాక్టర్ ఉదయ శంకర్ చేసిన పలు సేవా కార్యక్రమాలను కొనియాడారు. డాక్టర్ ఉదయ శంకర్ చిన్న పిల్లలకు వయోవృద్ధులకు ఎంతో సాంకేతికమైన వైద్యాన్ని అందించి ఎందరో జీవితాలకు సంజీవినిలా నిలిచారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని వైద్యం అందకుండా ఏ పేదవాడు బాధపడ కూడదని భావించి మానవతా వాదంతో ఎన్నో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ వైద్యో నారాయణుడు అయ్యారు. ఎన్నో సేవా కార్యక్రమాలకు వెన్నెముకలా ఉంటూ మానవ సేవే మాధవ సేవ అని చాటారు. మానవతా విలువలకు బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ శనక్కాయల ఉదయ శంకర్ అని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ నిర్వాహకులు కొనియాడారు. అనంతరం ఆప్త నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉదయ శంకర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం



**అద్దంకి, ఆగస్టు31( ఆంధ్రపత్రిక):** శనివారం రాత్రి సింగరకొండ ప్రసన్న ఆంజనేయస్వామి గుడి వెనుక వైపున గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం ఉందని అన్నారు అద్దంకి పోలీస్ వారు అందించిన సమాచారం ప్రకారం ప్రసన్నాంజనేయ స్వామి గుడి వెనుక వైపున మహిళలు వస్త్రాలు మార్చుకొని రేకుల షెడ్ నందు బిక్షాటన చేసి గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం ఉంది అన్నారు .పోలీస్ వారు వచ్చి మృతదేహాన్ని మార్చురికి పంపినామని అన్నారు ఎవరైనా తెలిసిన వారు ఉంటే ఈ మృతదేహాన్ని గుర్తు పట్టవలసిందిగా కోరుచున్నాము. వివరాలకు స్టేషన్ సిఐ ఎస్ఐ ఫోన్ నెంబర్లు9 121102167,8978777290

# నూజివీడు ట్రిబుల్ ఐటీ లో విద్యార్థుల సౌకర్యాల విషయంలో

# సమూలమైన మార్పులు రావాలి





**నూజివీడు ట్రిబుల్ ఐటీ విషయంలో ముఖ్యమంత్రి చాలా సీరియస్ గా ఉన్నారు-నూజివీడు ట్రిబుల్ ఐటీ లో విద్యార్థులకు చదువుకునేందుకు చక్కని వాతావరణం కలిపించాలి-సక్రమంగా పనిచేయని కాంట్రాక్టర్లను తొలగించాలి-రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి -విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి**

**నూజివీడు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** నూజివీడు ట్రిబుల్ ఐటీ లో విద్యార్థుల సౌకర్యాల విషయంలో సమూలమైన రావాలని విద్యార్థులు చదువుకునేందుకు చక్కని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ట్రిబుల్ ఐటీ క్యాంపస్ ను శనివారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. కిచెన్, మెస్ లను పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీ విధానాన్ని, కిచెన్, మెస్ లలో పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. త్రాగునీటిని స్వయంగా తాగారు, విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన నూజివీడు ట్రిబుల్ ఐటీ లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాలా సీరియస్ గా ఉన్నారని, నూజివీడు ట్రిబుల్ ఐటీ లో విద్యార్థులకు చదువుకునేందుకు చక్కని వాతావరణం కల్పించాలని ఆదేశించారన్నారు. ట్రిబుల్ ఐటీ లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై జాయింట్ కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, తదితరులు తనిఖీ నిర్వహించారన్నారు. నాణ్యత లేని ఆహారం, పారిశుధ్యం లేకపోవడం కారణంగానే విద్యార్థులు వ్యాధుల బారిన పడ్డారన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజ్ రేయింబర్సుమెంట్, స్కాలర్షిప్ లు, మెస్ చార్జీలు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని, ఈరోజు తాను విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నానని, ఇంత తనిఖీలు జరిగి, హెచ్చరికలు చేసిన తరవాత ఆహార నాణ్యతలో కొంత మాత్రమే మెరుగుదల కనపడిందన్నారు. ఇటువంటి పరిస్థితి తప్పనిసరిగా మారవలసిందేనని, నిబంధనల మేరకు సేవలందించని కాంట్రాక్టర్లను తొలగించి, కొత్త కాంట్రాక్టర్లను నియమించాలని మంత్రి ట్రిబుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. కిచెన్ లో పాత్రలను శుభ్రంచేయడం, కిచెన్, మెస్ లలో పరిశుభ్రతకు ఆధునిక టెక్నాలజీ యంత్ర పరికరాలను ఉపయోగించాలన్నారు. ట్రిబుల్ ఐటీ లో కిచెన్, మెస్, డైనింగ్ లలో పరిశుభ్రత, ఆహార పదార్థాలు నాణ్యత పరిశీలన, ఆహార నాణ్యతను పర్యవేక్షించేందుకు గాను ప్రతీ మెస్ కి ఒక ఫుడ్ టెక్నాలజీ లో అర్హత కలిగిన వారిని అవుట్ సోర్సింగ్ లో నియమించాలన్నారు. ట్రిబుల్ ఐటీ లో ఫ్యాకల్టీలు, ఇతర అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామక సమయంలో వారికి ఎటువంటి నేర చరిత్ర లేని వారిని నియమించాలని, ఈ విషయంలో పోలీసులు సహకారం తీసుకోవాలన్నారు. ఫుడ్ కమిటీ సభ్యులు కూడా వారానికి ఒకసారి కిచెన్, మెస్ లను పరిశీలించి ఆహార పదార్థాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతలను పరిశీలించాలన్నారు. ట్రిబుల్ ఐటీ లో విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా చక్కని సౌకర్యాలు, నాణ్యమైన ఆహా రం, చదువుకోడానికి చక్కని వాతావరణం కల్పించడంలో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పార్థసారథి చెప్పారు. ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, పరిపాలనాధికారి, సిబ్బంది , పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టొయోటా కిర్లోస్కర్ మోటర్ భాగస్వామ్యం




**గుంటూరు,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించటం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) భాగస్వామ్యం చేసుకుంది. కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం, టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. దీనిలో భాగంగా వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నారు. అలాగే యూనియన్ వెహికల్ స్కీమ్ కింద సంవత్సరానికి 8.80 శాతం నుండి ప్రారంభమయ్యే ప్రస్తుత వడ్డీ రేట్లతో 84 నెలల వరకు సౌకర్యవంతమైన ఈఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చు. వీటితో పాటుగా యూనియన్ పరివాహన్ పథకం కింద వాణిజ్య వాహనాల కోసం 60 నెలల వరకు ఫైనాన్సింగ్ అవకాశాలు అందిస్తారు.

## ఫియోనా రిఫైన్డ్ అయిల్‌ను మార్కెట్ లో విడుదల చేసిన లావణ్య త్రిపాఠి




**నెల్లూరు, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** 2004 ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (బంగే ఇండియా), ఫియోనా రిఫైన్డ్ సన్ వర్ ఆయిల్ బ్రాండ్, ఫీయోనాను సినీ నటీ లావణ్యా త్రిఫాఠి విజయవాడలో ప్రారంభించారు.రిఫైన్డ్ స్కివర్ అయిల్లో పౌష్టికాహారానికి కీలకమైనవవిటమిన్ ఎడిఇలు ఉన్నాయి. అయినప్పటికీ, పాత ప్రక్రియలో ఈ విటమిన్లు గణనీయమైన మొత్తంలో నాశనమువుతాయని, సరైన మొత్తంలో ఆహారాన్ని చేరుకోలేనిని చాలామందికి తెలియదు. దీనిని గుర్తించిన బంగే ఇండియా, కొత్త ఓప్రటియో పార్ములాతో సియోనాను వంటచేయడానికి ఒక అత్యుత్తమ ఎంపికగా ప్రారంభించింది. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇతర సన్ ఫ్లవర్ ఆయిల్స్ లో వంటచేయడం ద్వారా ఆహారంలోకి చేరుకునే విటమిన్లలో పోలిస్తే, ఫీయోనా యొక్క ప్రత్యేకమైన కాన్సెప్ట్ ద్వారా విటమిన్లు 50% ఆధికారికంగా మీ ఆహారానికి చేరుతాయి. ఈ సంవత్సరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు మార్కెట్లలో పోషకమైన వంట నూనెను ప్రారంభించడంతో బ్రాండ్ తన పరిధిని మరింత విస్తరించింది. ఫీయోనా రిఫైన్డ్ అయిలను ఆంధ్రప్రదేశ్ కు తీసుకురావడం పట్ల తన హర్షం వ్యక్తం చేస్తూ, మిస్టరీ వినయ్ శ్రీవాస్తవ- వైస్ ప్రెసిడెంట్ ,బిజెనెస్ హెజ్,బిబిసి, బంగే ఇండియా ఇలా అన్నాడు. "బంగి ఇండియాలో, "శిష్టత భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అత్యుత్తమ నాణ్యత ఉత్పత్తులను అందించాలనే మా నిబద్ధత దృఢంగా ఉంది. ఇది వంట నూనెల్లో అత్యుత్తమ ఎంపికగా ఫియోనా రిసైన్ట్ సన్ ఫ్లవర్ ఆయిల్ ను ప్రారంభించడం ద్వారా నిరూపిం చబడింది. "ఆంధ్రప్రదేశ్ తెలంగాణాలు సన్ వర్ అయిలేకు కిందు పెద్ద మార్కెట్లు అయిన పదుని వినియోగదారుల డిమాండ్ లలో స్థిరమైన పెరుగుదలను చూస్తున్నాయి. ఈ రెండు ముఖ్యమైన మార్కెట్లలో పియో నాను విస్తరించాలనే మా నిర్ణయం వెనుక ఇది ప్రధాన కారణం. పియోనా రిఫైన్డ్ సన్ఫనర్ అయిల్ యొక్క ఏ కిష్టమైన ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్ అందించడం మాకు చాలా సంతోషంగా ఉంది.పెరుగుతున్న ఈ మార్కెట్లో దీనికి నుంచి ఆదరణ లభిస్తుందని విశ్వసిస్తున్నారు.ఈ లాంచ్ గురించి మాట్లాడుతూ, ప్రఖ్యాత తెలుగు నటి లావణ్య త్రిపాఠీ ఇలా అన్నారు. "ఫియోనా రిఫైన్డ్ సన్ఫ్లవర్ ఆయిల్ లాంటిలో భాగమైనం దుడు నాడు చాలా ఆనందంగా ఉంది. నాకు, వంట అనేది నా కుటుంబా నికి ఆరోగ్య కరమైన, రుచికరమైన ఆహారం అందించడం.ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి ఇంట్లో పియోనా ప్రధాన ఎంపికగా మారుతుందని నేను విశ్వసిస్తున్నన్నారు.

## జోరు వానలో పెన్షన్లు పంపిణీ



**విజయవాడ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** యనమలకుదురు గ్రామంలో జోరు వానలో కూడా గ్రామ సచివాల సిబ్బం దితో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేశారు.ఈ నెల ఒకటో తారీకు ఆదివారం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆదేశానుసారం ఒక్కరోజు ముందు అంటే 31 వ తారీఖున పింఛన్దారులకు సచివాలయ సిబ్బందితో కలిసి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతి ఇంటికి తిరిగి 4,000 పింఛన్లు అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది.పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు బొడే ప్రసాద్ గారి ఆదేశానుసారం పెనమలూరు నియోజకవర్గం, తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు గ్రామంలో కృష్ణా జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ శౌంఠి శివరాం ప్రసాద్ గౌడ్ సచివాలయ సిబ్బందితో కలిసి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు జోరు వానను కూడా లెక్కచేయకుండా ఇంటింటికి తిరిగి పింఛన్దారులకు 4000 రూపాయలు అందజేయడం జరిగింది.ఇంతటి జోరు వానలో కూడా ఇంటింటికి వచ్చి నాలుగు వేల రూపాయలు పెన్షన్ అందజేస్తున్నందుకు పింఛన్దారులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తిని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే 4000 పింఛను మీ ఇంటికి వచ్చి అందజేస్తారని చంద్రబాబు గారు చెప్పిన మాట గత 3 నెలలుగా నిలబెట్టుకున్నారు అన్నారు. అటువంటి నాయకుడిని గతంలో ఓడించడం మేము చేసిన పొరపాటు అని, దాని పర్యవసానమే పేద ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు 4000 పింఛన్ తీసుకుని వారి కళ్ళలో ఆనందం చూడడం జరిగిందని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.

## ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సెప్టెంబర్ నెల నిత్యావసర సరుకుల పంపిణీ



**విజయవాడ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సెప్టెంబర్ నెల నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఒకటవ తేదీ ఆదివారం ఉదయం నుండి ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు.చౌక ధరల దుకాణ డీలర్లు, ఎండియు ఆపరేటర్లుద్వారా సరుకుల పంపిణీని ప్రతిరోజు ఉదయం 7.గం.లకు నిర్దేసించిన ఎడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార మొదలైన నిత్యావసర సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం నుండి 17వ తేదీ వరకు కార్డుదారులకు ఇంటివద్దనే పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని రైస్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. సరుకుల పంపిణీలో ఏమైనా పిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967 కు ఫోన్ చేయవచ్చునని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ డిప్యూటీసీఎం పవన్ కళ్యాణ్ జన్మదినవేడుకలు




**కర్నూల్ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** కర్నూల్ నగరం నందు రాయలసీమ కన్వీనర్ పవన్ కుమార్ గారి అద్వర్యం జరుగుతున్న వేడుకలో భాగంగా రెండవరోజు కర్నూల్ నగరం నందు గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో నగరం నందు నారాయణ పాఠశాల, నెహ్రు మెమోరి యల్ ప్రభుత్వ పాఠశాల, ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల నందు మొక్కలు ఉపాధ్యాలు మరియు చిన్నారులతో కలిసి మొక్కలు నాటటం జరిగింది.

ఈ సందర్భంగా రాయలసీమ కన్వీనర్ పవన్ కుమార్ మాట్లాడుతూ గతలో ఎపుడు చెప్పటాని విధంగా తన జన్మదిన వేడుకను కూడా ఒక మంచి కార్యక్రమం గ్రీన్ ఆంధ్ర అన్న పేరుతో ప్రతిఒకరు మొక్కలు నాట్టాలని రాష్ట్రాన్ని 50శాంతం పచ్చదనంగా కాలుష్యంలేని ఆంధ్రప్రదేశ్ గా ఉండాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని అందులో భాగంగా ఈ కార్యక్రమం చేపత్యము అందరూ చెట్లు నాటటం ఒక అనవయితీగా మన పిల్లలకు నేర్పలని చెట్లు నాటటం వల్ల ఎన్ని లాభాలు కలుగుతాయో తెలియచేసి ఉత్సాహ పరిచి రాబోవు తరానికి కాలుష్యం లేని ఆంధ్రప్రదేశ్ ను అందచేదాం మొక్కలను పెంచటం సంరక్షించటం అలవాటుగా తీసుకోవాలని అని తెలిపటం జరిగింది .

## తుఫాన్ భారీ వర్షాలలో సహాయక చర్యలు చేపట్టేలా

# అధికారులను అప్రమత్తం

### భాదితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం... ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా




**విజయవాడ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను తక్షణ సహాయక చర్యలు అందించేలా అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని కొండచరియలు విరిగిపడిన సంఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా తెలిపారు.

నగరంలోని మొగల్రాజపురం సమీపంలోని సున్నపు బట్టీల ప్రాంతాన్ని శనివారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా, జిల్లా కలెక్టర్ డా. జి. సృజనతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన సంఘటనన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించామన్నారు. ఇటువంటి సంఘటలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించమన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు చెరువులు పొంగిప్రవహిస్తున్నాయని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అవసరమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయం అందిస్తున్నామన్నారు. ముంపుకు గురైన ప్రాంతాలలో డ్రైన్ల పూడిక తీసి వర్షపు నీటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యతనిచ్చి అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా తెలిపారు. పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ హెచ్ఎం. ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవాని శంకర్, తహశీల్ధార్ రోహిణి ఉన్నారు.

## కొండ రాళ్లు పడకుండా ప్రస్తుతం తాత్కాలిక చర్యలు




**విజయవాడ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి,విజయవాడ రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు కమీషనర్ అయిన ఎస్ సత్యనారాయణ, దేవస్థానం నకు విచ్చేసి అత్యధికముగా కురుస్తున్న వర్షముల వలన కొండ రాళ్లు జారిపడి, పాక్షికముగా దెబ్బతిన్న డోనార్ సెల్ ను ఆలయ కార్యనిర్వాహనాధికారి కె ఎస్ రామరావు మరియు ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, చర్చించారు. అనంతరందేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి మాట్లాడుతూ కొండ రాళ్లు పడకుండా ప్రస్తుతం తాత్కాలిక చర్యలు చెప్పట్టడం జరుగుచున్నదని, శాశ్వత పరిష్కారం కోసం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మీటిగెషన్ వారితో మాట్లాడటం జరిగినదని, వారి సహకారంతో సెన్సార్ లు మరియు ఇతర టెక్నాలజీ కూడా వినియోగించి, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టడం జరుగుచున్నాదని తెలిపారు. కేశఖండన శాల నిర్మాణం కోసం గౌరవ దేవాదాయ శాఖ మంత్రివర్యుల సూచనల ప్రకారం కృష్ణా నది ఒడ్డున ప్రదేశములు పరిశీలించుట జరిగినదని, త్వరలో భక్తులకు సదరు వసతులు అన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

గత 2 రోజులుగా తీవ్ర వర్షము పడుట కారణముగా ఘాట్ రోడ్ నందు భక్తుల భద్రత దృష్ట్యా ఘాట్ రోడ్ నందు తాత్కాలికముగా భక్తులకు మరియు భక్తుల వాహనములకు ప్రవేశం నిలుపుదల చేయడమైనదని, అందరూ లిఫ్ట్ మార్గం ను వినియోగించుకొ నవలేనని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వారితో పాటుగా దేవాదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ GVR శేఖర్ , ఆలయ ఈఈలు కె వి ఎస్ కోటేశ్వరరావు, లింగం రమ , డిఈఈ, ఏఈఈలు మరియు ఇంజినీరింగ్ సిబ్బంది, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## ముంబై నటి కేసులో దోషుల అరెస్టుపై కాలాతీతం వద్దు



**విజయవాడ ,ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర పరువును, ఐపిఎస్ గౌరవాన్ని తీసి ముంబై నటి పై హిడింబి లా ప్రవర్తించిన ముగ్గురు ఐపిఎస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటంలో ఆలస్యం, కాలాతీతం సరైనది కాదని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాల కోటయ్య వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పుటికే ఈ దుర్మార్గమైన వ్యవహారంలో ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయమే, ఐనా చర్యలు తీసుకుంటేనే చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు వ్యవస్థ లో మార్పు వస్తుందన్నారు. సోషల్ మీడియా లో నటి పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్య హింసను కాపాడేందుకు కొందరు పనికి మాలిన ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మహిళలు బాదితురాలైన నటికి అండగా ఉండాలని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు.

# అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటికి రావాలి : మంత్రి గొట్టిపాటి



**బల్లికురవ ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** అత్యవసరం అయితేనే ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావాలిఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలిబాపట్ల జిల్లాలో పరిస్థితిపై జిల్లా కలెక్టర్ తో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి.ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. విద్యుత్ తీగలు తెగిపడినా, కిందకు జారిన వెంటనే సమీప అధికారులకు సమాచారం అందించాలని, తాకడం, పక్కకు నెట్టడం లాంటి పనులు చేయవద్దని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపైనా అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. భారీ వర్షాలు, తుఫానుల సమయంలో విద్యుత్ శాఖ అధికారులపైనే ఉన్నత బాధ్యత ఉంటుందని, దానికి అనుగుణంగా పని చేయాలని అన్నారు.

## సంతమాగులూరులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు



**సంతమాగులూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** మండల పరిధిలోని శుక్రవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నాయి. వర్షాల కారణంగా మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో ఉన్న రైల్వే అండర్ పాస్ కింద వర్షపు నీరు నిలిచాయి. అందువల్ల వాహనాలకు, గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లా మంత్రి గొట్టుపాటి రవికుమార్ ద్వారా ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లినట్లు ప్రజలు తెలిపారు. వర్షపు నీరు రహదారులపై పారుతుండగా పాదచారులకు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.చిరు వ్యాపారులు,రోజు వారి కూలీలు పనికి లేక ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## వినాయక చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి



**సంతమాగులూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** వినాయక చవితి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉత్సవాలు జరిపేందుకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సంతమాగులూరు సీఐ కె.వెంకటరావు అన్నారు. సంత మాగులూరు సర్కిల్ పరిధిలోని రెండు మండల లోని గ్రామ ప్రజలు వినాయకుని విగ్రహం, పందిళ్ళ నిర్మాణాలు చేయవలసిన వారు ముందుగా తమకు తెలియజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

## కరెంటు షాక్‌తో యువకుడు మృతి



**బల్లికురవ ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** బల్లికురవ మండలం లో విషాదం నెలకొంది స్థానికంగా ఓ స్వీట్ షాపులో పని చేసే లక్ష్మణ్ రాథోడ్ (22) ప్రమాదవశాతం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పొట్టకూటి కోసం రాజస్థాన్ నుంచి లక్ష్మణ రాథోడ్ స్వీట్ షాపులో పనిచేసేందుకు వచ్చాడు. బంక్ లో లైట్ ఆన్ చేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు.

## 51వ డివిజన్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి కార్పొరేటర్ రాజేష్ సాయం



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** స్థానిక 51వ డివిజన్ లో నిన్నటి నుంచి ఎడతెరగని వర్షాల వల్ల పితాని అప్ప లస్వామి వీధి కొండపైన నివాసం వుంటున్న ఎరుసు నీలమ్మ ఇల్లు, రాజగిరివారి వీధిలో కొండపైన ఇంకో ఇల్లు కూలిపో వడంతో 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ వెంటనే పశ్చిమ ఎమ్మార్వో ఇంతియాజ్, విఆర్ఓలు జయరాజు,వెన్నెల మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం వారికి శానిటేషన్ విభాగం వారికి తెలియచేసి వారిని అప్రమత్తంచేసారు. శనివారం ఉదయం 6 గంటలకు వర్షంలో కూడా వారిని ఘటనా స్థలానికి తీసుకువచ్చి నిర్వాసితులైన 9 కుటుంబాలవారిని విద్యాధరపురంలోని లేబర్ కాలనీ కమ్యూనిటీహాల్‌కు తరలించి అక్కడ వారికి ఆశ్రయం కల్పించడం జరిగింది. అలాగే ఇళ్లు కూలిపోయిన చోట పేరుకుపోయిన మట్టిని తొలగించేలా తదుపరి చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో యువకుడి మృతి



**కృత్తివెన్ను ,ఆగస్టు 31 (ఆంధ్ర పత్రిక) :** కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సాన రామాంజనేయులు ( రాజు) ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా విద్యుత్ వైర్ తెగి పడి ఉండడాన్ని గమనించని రాజు, చెరువుగట్టున గడ్డి కోసే సమయంలో విద్యుత్ ఘాతానికి గురై ప్రమాదానికి గురికాగా బంధువులు భీమవరంలోని హాస్పిటల్ కి తీసుకుని వెళ్ళగా అప్పటికే మృతి చెందినడని నిర్ధారించారు.

ఈ సంఘటనతో లక్ష్మీపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రాజు మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు కూటమి నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షబాధితులకు అండగా ఎమ్మెల్యే సుజనా కార్యాలయం



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** భారీవర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ సభ్యులు ఎన్డీయే కూటమి నాయకుల సహకారంతో భారీ వర్షంలోనూ శనివారం తమ సేవలను అందించారు.

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పశ్చిమ లోని రాజా రాజేశ్వరి పేట, ఊర్మిళ నగర్, లేబర్‌కాలనీ, ప్రియ దర్శిని కాలనీ, ఇందిరాగాంధీ కాలనీ, హెచ్ బి కాలనీలతోపాటు అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. ఇళ్లలోని ఫర్నిచర్ ఇతర సామాగ్రి తడచి వంట చేసుకోవడానికి కూడా అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సుజనా ఆదేశాలతో అనేక వందల మందికి భోజన ప్యాకెట్లను శనివార పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ సభ్యులు, భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసి ధైర్యం చెప్పారు. జోరు వానలోనూ భోజన ప్యాకెట్లను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సుజనాకు పశ్చిమ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ సభ్యులు, వీరమాచనేని కిరణ్, చింతా బాబి, మంతెన తరుణ్, ఎన్డీయే నాయకులు బోగవల్లి శ్రీధర్, బి ఎస్ కే పట్నాయక్, అవ్వారు బుల్లబ్బాయి, దొడ్ల రాజా, ప్రదీప్, ఉమాకాంత్, పచ్చిపులుసు ప్రసాద్ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షపునీటిలో చిక్కుకున్న కుటుంబాలకు భోజనాల అందచేత

### 44వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి దుర్గారావు దంపతులు



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మోకాలి లోతున రోడ్లపై నీరు నిలవడంతో బయటకు వచ్చేందుకు వీల్లేక వర్షపు నీటిలో చిక్కుకున్న పలు కుటుంబాల వారికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, తెలుగుదేశం నాయకులు దుర్గారావు దంపతులు భోజన ప్యాకెట్లను అందజేశారు. శనివారం 44వ డివిజన్‌లోని లేబర్‌కాలనీలోని ఆరు బిల్డింగుల ప్రాంతంలో, ఇళ్లలో నీరుచేరి వంటచేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న కుటుం బాలవారికి భోజనం తెలుగుదేశం నాయకులు మైలవరపు దుర్గా రావు మోకాలిలోతు నీటిలో ఇంటింటికీ తిరుగుతూ భోజనం ప్యాకెట్లను పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి, దుర్గారావు మాట్లాడుతూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ ఎప్పటికప్పుడు ఇక్కడి పరిస్థితిని సమీక్షిస్తున్నారని, ఆయన ఆదేశాల మేరకు తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షపు నీరు బయటకు పోయేలా కార్పొరేషన్ సిబ్బందితో కలిసి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరిం చారు. ఇక్కడ పరిస్థితిని విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరి కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు హరికృష్ణ, పెద్ది సాయి, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీవర్షాలకు పశ్చిమ నగరం జలమయం



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** భారీవర్షాలకు నగరంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు మోకాలిలోతున నీట మునగడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్, కొత్తపేట, చిట్టినగర్, విద్యాధరపురం, భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీ , రాజరాజేశ్వరీపేట, ఊర్మిళానగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. వర్షాలకు రోడ్లు మురుగునీటితో మునిగిపోయాయి. అలాగే పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. కబేళారోడ్డులోని రాముక్వారీ కొండప్రాంతంలో ఏలూరి కిరణ్‌కుమార్ ఇంటిపై కొండపై వున్న చెట్టు విరిగిపడటంతో ఇల్లు కొంతమేర దెబ్బతింది. అలాగే సితార ఎదుట కొండమీద ఇళ్లపై కూడా కొండరాళ్లు పడ్డాయి. విద్యాధరపురం- చిట్టినగర్‌లను అనుస ంధానం చేసే సొరంగం మార్గంలో ముందుజాగ్రత్త చర్యగా రాకపోకలను నియంత్రించారు.

అలాగే 53వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మహదేవు అప్పాజీ జోరువర్షం లోనూ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కార్పొరేషన్ సిబ్బందితో సహాయచర్యలు తీసుకున్నారు. కాగా పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మురుగునీరు రోడ్లను ముంచెత్తడంతో మురుగునీరులో ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## జోరు వర్షంలో సైతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్



**వినుకొండ , ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒకటవ తేదీ ఆదివారం కావ డంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వినుకొండ టౌన్ కట్ట కింద బజార్ ఒక వైపు జోరుగా వర్షం పడుతున్న పింఛన్ల పంపిణి కార్యక్రమన్ని తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే ప్రారంభించారు .

వినుకొండ టౌన్ కట్ట కింద బజార్ మున్సిపల్ కమిషనర్ యం సుభాష్ చంద్రబోస్ఏడతెరపి లేకుండా జోరుగా వర్షం పడుతున్నప్పటికి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్లు పంపిణి చేసి అవ్వతాతల ముఖలలో ఆనందాన్ని చూడాలనే ఉద్దేశంతో వర్షాన్ని సైతం లెక్కచేయ కుండా లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు. దాదాపు ఈరోజు అందరికి అందేలా కృషి చేస్తామని ఎవరైనా అందుబాటులో లేని యెడల వారికీ సోమవారం పంపిణి చేస్తామని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

## 43వ డివిజన్‌లో జోరువర్షంలోనూ పెన్షన్ల పంపిణీ



**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక):** జోరువానలోనూ 43వ డివిజన్ పార్క్ సెంటర్ సచివాలయం పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం 43వ డివిజన్ అధ్యక్షులు కొనికి కొండయ్య మాట్లాడుతు జోరువర్షంలో సైతం వృద్దులు, వికలాంగులు తదితరులకు పెన్షన్లను అందచేసినట్లు చెప్పారు. డివిజన్‌లో తెలుగుదేశం శ్రేణులు పెన్షన్ల పంపిణీలో పాల్గొ న్నాయని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా తెలుగుదేశం అండగా వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు డబ్బుగొట్టు ఏడుకొండలు, యువత అధికార ప్రతినిధి పూజల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు (టైలర్) సచివాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది.

## నూతన పెట్రోల్ బంకులను ప్రారంభించిన కాగిత



**కృత్తివెన్ను ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** స్థానిక మండల పరిధిలోని రెండు పెట్రోల్ బంకులను ప్రారంభించిన పెడన నియోజకవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్. లక్ష్మీపురం గ్రామంలో హెచ్ పి పెట్రోల్ బంక్ ను, మోడీ దిబ్బన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ను ఆయన ప్రారంభించారు. ఈ బంకుల యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తులసీ రావు, పిన్నింటి రత్తయ్య, నెక్కంటి భాస్కరరావు, పడవల కొండ, అందే పెదకాపు, పులగం చిన్నబ్బులు, కొప్పర్తి రంగారావు తదితర కూటమి నాయకులు , ప్రజలు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం లేదు.. గత ప్రభుత్వం లాగా సాకులు లేవు

### కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ:కాగిత కృష్ణ ప్రసాద్



**బంటుమిల్లి ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** పెడన నియోజకవర్గం,బంటుమిల్లి మండలం మల్లపరాజు గూడెం గ్రామంలో మరియు పెద్దతుమ్మిడి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంనకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ హాజరై పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి అందజేశారు. కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తూనే ఇంటి పెద్ద కుమారునిగా మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం లాగా నిర్లక్ష్యం గానీ సాకులు చెప్పి పెన్షన్ ఆలస్యం చేయడం గాని ఈ ప్రభుత్వంలో ఉండదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ మహాకూటమి నాయకులు, మల్లప రాజు గూడెం గ్రామ సర్పంచ్ దూసనపూడి అవతారం,మరియు కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

## భారీ వర్షాలకు ఊర్లకు ఊర్లే చెరువులుగా మారాయి

### పల్లపు ప్రాంతాలంతా జలమయంగా మారాయి-పంట పొలాలు నీట మునిగాయి-నీట మునిగిన నివాస గృహాలు- తిరువూరు నియోజకవర్గంలో వాగులు వంకలు చెరువులు- పొంగి ప్రవహిస్తున్నాయి.







**తిరువూరు ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల శుక్ర శని వారం కురిసిన భారీ వర్షం కారణంగా తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం విస్సన్నపేట ఎ. కొండూరు తిరువూరు గ్రామాల్లోని రహదారులు వరదముంపునకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామంలోని నల్లచెరువుకు గండిపడి ఆయకట్టు కింద పంట పొలాలను ముంచెత్తిన వర్షనీరు ఆందోళన చెందుతున్న రైతాంగం. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లో వరద నీరు చేరటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆరుగాలం కష్టించి రైతాంగం సాగుచేసిన పంట పొలాలన్నీ నీటమునిగాయి దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇబ్రహీంపట్నం... జగదల్పూర్ జాతీయ రహదారి పై వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మైలవరం డివిజన్లో ఏసీపీ సుంకర మురళీమోహన్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ. కొండూరు జి కొండూరు రెడ్డిగూడెం గంపలగూడెం విసన్నపేట తిరువూరు మండలాల్లో శనివారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు పొంగి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కావటం గంపలగూడెం మండలంలోని తోటమూల.. వినగడప గ్రామాల మధ్యలో ఉన్న కట్టలేరు వాగు ఉధృతి ముత్యాలంపాడు రోడ్డుపైన కుంటముక్కల మెయిన్ రోడ్డు పైనగడ్డమడుగు వాగు మరియు మైలవరం సబ్ డివిజన్ సంబంధించి 7 మండలాల్లో ప్రధాన రహదారులపై వరద నీరు చేరి ప్రమాదకరంగా మారటంతో ప్రయాణికులను ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లవలసిందిగా పోలీస్ డిపార్ట్మెంట్ తరపున పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ప్రమాదకరంగా ఉన్న రహదారుల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగింది. ప్రజలు ప్రయాణికులు గమనించాలని ముందు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు గురి కావద్దని ఎసిపి సుంకర మురళీమోహన్ ఆదేశాలు జారీ చేశారు. పల్లపు ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు వేడుకుంటున్నారు.

## వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచే పెన్షన్ పంపిణీ చేస్తున్న మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి



**ఎ. కొండూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** జోరు వానను కూడా లెక్క చేయకుండా శనివారం ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి. 1వ తారీకు ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎ. కొండూరు మండలం రామచంద్రపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త పద్మ పెన్షన్ దారులు పాల్గొన్నారు.

## వాగ్దేవిలో సరిత బర్త్డే వేడుక



**జగ్గయ్యపేట, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** జగ్గయ్యపేట పట్టణంలోని వాగ్దేవి నర్సింగ్ కళా శాలలో వాగ్దేవి కళాశాల అధినేత్రి కరస్పాండెంట్ బుస్సా సరిత జన్మదిన వేడుకలు అత్యంత వైభ వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి సురేష్ అకాడమిక్ డైరెక్టర్ బి . జ్వలిత్ సాయి నర్సింగ్ కాలేజ్ ఫ్యాకల్టీ మెంబర్స్ ఈశ్వరి ప్రవీణ మరియు బిఎస్సి నర్సింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకంగా నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేయడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి సైతం అనగా శ్రీకాకుళం విజయనగరం తణుకు ఏలూరు విజయవాడ వంటి ప్రాంతాల నుంచి కూడా జగ్గయ్యపేట వాగ్దేవి నర్సింగ్ కళాశాలలో ప్రత్యేకంగా మహిళలకు ఏర్పాటు చేయడం వల్ల నాణ్యమైన అధునాతన వసతులతో కూడిన నర్సింగ్ విద్యను అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు అదే విధంగా ఈ కార్యక్రమంలో ఇంటర్ మరియు డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు నిర్వహించి విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. గత 15 సంవత్సరాల నుండి జగ్గయ్యపేట పట్టణంలో మహిళా విద్యార్థులకు ప్రత్యేకంగా మహిళా కళాశాలను స్థాపించి అత్యుత్తమ ప్రమాణాలతో క్రమశిక్షణతో కూడిన విద్యను సురక్షితమైన వాతావరణంలో అందిస్తున్నందుకు విద్యార్థులు తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు ఈ సందర్భంగా కరస్పాండెంట్ మేడంను అభినందించారు.

# నగరంలో భారీ వర్షం

## భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి





**నూజివీడు ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు పెద్దచెరువుకు వచ్చిన వరద కారణంగా నీట మునిగిన నూజివీడు లోని పలు ప్రాంతాలను మంత్రి కొలుసు పార్థసారథి అధికారులతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ పెద్దచెరువుకు గండి పడిన కారణంగా నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయని, వెలమపేట లో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను నూజివీడు పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలకు తరలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నూజివీడు నియోజకవర్గంలోని మొగలు చెరువు, నూజివీడు ఊరచెరువు, పోతురెడ్డిపల్లి పెద్దచెరువులకు పలు చోట్ల గండ్లు పడి పలు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, భారీ వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రజలకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితి ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధం చేయడం జరిగిందని మంత్రి చెప్పారు. వర్షం నీరు నిల్వ ఉన్న కారణంగా త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించాలని మంత్రి మునిసిపల్ కమీషనర్ ను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో వైద్య కేంద్రాలు ఏర్పాటుచేయాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, మలాథియాన్ స్ప్రే చేయాలనీ మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎస్పీ కె. శివప్రతాప్ కిశోర్, ఆర్డీఓ వై. భవానీశంకరి, మునిసిపల్ కమీషనర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పెడన మాజీ ఎం. ఎల్. ఎ.మాజీ డిప్యూటీ స్పీకర్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేదవ్యాస్.



**మచిలీపట్నం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** గత రెండు రోజులుగాఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెడన నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి రాష్ట్రాల మాజీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ సూచించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కూడా అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని తెలియజేశారు.తెగిపడిన కిందకు జారిపడిన విద్యుత్ తీగలు ఉంటే గమనించి వెంటనే సమీప అధికారులకు సమాచారం అంది ంచాలని, వాటిని తాకడం పక్కకు నెట్టడం లాంటి పనులు చేయవద్దని సూచి ంచారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పై అధికారులు తక్షణమే స్పంది ంచి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వ్యాస్ అన్నారు. కాలువలకు బోదులకు గండ్లు పడిన చోట రైతాంగం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**బాపట్ల ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** భారీ వర్షాల హెచ్చరికలతో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. తుపాను హెచ్చరికలతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లా కలెక్టర్ శనివారం లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు.

బాపట్ల పట్టణం శారదాపురికాలనీ, శాంతినగర్ లలో గృహాలు నీట మునగడంతో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ వెంకట మురళి కలిసి పరిశీలించారు. వర్షపనీరు కాలనీలో నిలిచి గృహాలలోకి ప్రవేశించడంతో మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. సిసిరోడ్డును మధ్యలో కట్ చేసి దిగువ ప్రాంతాలకు వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఆ కాలనీలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ప్రజలను పరామర్శించారు. ఏ సమస్య వచ్చినా తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల కోసం కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట బాపట్ల ఆర్డిఓ జి. రవీందర్, తదితరులు పాల్గొన్నారు.







### ప్రధాన రహదారులతో బాటు లోతట్టు ప్రాంతాలు కూడా పూర్తి జలమ యం- స్తంభించిన జనజీవనం- అల్పపీడన ప్రభావంతో 18 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు.

**మచిలీపట్నం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** నగరంలో శుక్రవారం అర్ధరాత్రి నుండి కురుస్తున్న భారీ వర్ష ప్రభావం వల్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో బాటు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా మోకాలు పైగా నీళ్లలో మునిగి ఉన్నాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది.

**నగర ప్రజలకు ఈ ఇక్కట్లు తొలగేదెప్పుడు?**

కాస్త వర్షం వస్తే చాలు నగరం చిగురుటాకులా వణికి పోతుంది. వర్షం తగ్గి వారం రోజులైనా డ్రైనేజ్ వాటర్, వర్షపు నీరు కలిసి ప్రవహిస్తాయి. ఈ సమస్యకు విముక్తి ఎప్పుడా? అని నగర ప్రజలు నిరీక్షిస్తున్నారు.

కలెక్టరేట్ చుట్టుపక్కల ఉన్న గాంధీనగర్ ప్రాంతం పూర్తిగా నీట మునిగిపోంయింది. సాక్షాత్తు నగరానికి గుండెకాయ లాంటి కలెక్టరేట్, చుట్టుపక్కల రోడ్లన్నీ పూర్తి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీనికి ప్రధాన కారణం లోపభూయిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ అని చెప్పక తప్పదు. నగరపాలక సంస్థ అధికారులు కూడా ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం కూడా ప్రధాన కారణమని నగర ప్రజలు అనుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అధికారులు, నగరపాలక సంస్థ అధికారులను ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్న పెడచెవిన పెట్టడం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎప్పుడు వర్షం పడినా ఈ ప్రాంతంలో మురుగు నీళ్లు పోవడానికి కనీసం 10 రోజుల సమయం పడుతుంది. డ్రైన్లో వాటర్ సైతం రోడ్లపై ఉప్పొంగి ప్రవహిస్తోంది. వర్షం తగ్గి రోజులు గడుస్తున్నా కలెక్టరేట్ చుట్టుపక్కల నివసించే ప్రాంతవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే నారాయణపురం, ఈడేపల్లి, దిమ్మల సెంటర్, నవీన్ మిట్టల్ కాలనీ, ఇత్యాది ప్రాంతాలన్నీ వర్షం తగ్గి వారం రోజులైనా జలదిగ్బంధనంలోనే ఉంటాయి.సాధారణంగా వర్షం వచ్చి తగ్గాక ఒక పూటలో రోడ్లపై నిల్వ ఉన్న నీరు తగ్గిపోతుంది. కానీ కలెక్టరేట్ చుట్టుపక్కల ఉన్న ప్రాంతం మాత్రం ఎప్పుడు నీళ్లలోనే నాని తేలుతుంది. దీనికి తోడు పారిశుద్ధ్య వ్యవస్థ కూడా ఈ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. ఎప్పటికప్పుడు డ్రైన్లలో పూడిక తీయకపోవడం, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఎక్కడి చెత్త అక్కడే వదిలేయడం వల్ల కలెక్టరేట్ చుట్టుపక్కల ప్రాంతాలు తీవ్ర దుర్గంధ భరితంగా తయారయ్యాయి. నిత్యం దోమలు కూడా స్వైర్య విహారం చేయడం గమనార్హం. ఇప్పటికే నగరంలోని ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో నగరపాలక సంస్థ విఫలమైందని చెప్పవచ్చు.వీటితోపాటు నగరంలోని లోతట్టు ప్రాంతాలు సైతం వర్షం తగ్గి వారం రోజులైనా నీళ్లలోనే నానుతూ కనిపిస్తాయి.

**ప్రజలు అప్రమత్తంగా ఉండండి:మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు.**

భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్ర గనులు భూగర్భ, మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మ్యాన్ హోల్స్, విద్యుత్ స్తంభాలు, ఎత్తైన చెట్ల వద్ద, ఎవరు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముఖ్యంగా పిల్లలు, వృద్దులు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుం దన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అధికార యంత్రాంగం, పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారన్నారు. నష్ట నివారణకు కావలసిన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, సహాయక చర్యల నిమిత్తము అధికారులంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. వర్షాల వల్ల ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అధికారుల సూచనలను, ప్రజలు పాటించాలని తెలిపారు. ఎవరికైనా ఏ విధమైన ఇబ్బంది కలిగినా అధికారులను కానీ, తనని గాని సంప్రదించవచ్చని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, బందరు నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు వేగవంతం చేయడం జరుగుతుందని, నగర ప్రజల కష్టాలు, కడగండ్లు త్వరలోనే తీరనున్నాయని, రవీంద్ర తెలిపారు. మంత్రి రవీంద్ర తెలిపినట్లు త్వరలోనే నగర ప్రజల కష్టాలు, కడగండ్లు తీరుతాయని, నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు సైతం సస్యశ్యామలంగా ఉంటాయని, ఆశిద్దాం..!

## భారీ వర్షంలో సైతం పింఛన్ల పంపిణీ

### పింఛన్లు పంపిణీ చేసిన కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ



**కానూరు (బందరు మండలం) ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం కానూరు గ్రామంలో భారీ వర్షం లో సైతం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదీ ఏమైనా చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడిసెప్టెంబర్ 1వ తారీకు సెలవు దినం కావటంతో అనగా ఆగస్టు 31 నే పింఛన్లను ఇవ్వమని అధికారులను ఆదేశించడంహర్షించదగ్గ విషయం అన్నారు. ప్రజలపై ఆయనకు ఉన్న అభిమానానికి ఇది నిదర్శనమన్నారు. ఆయన మాట ఇస్తే నిలబెట్టుకుంటారనడానికి నేటి పింఛన్ల పంపిణీ కార్యక్రమమే ఉదాహరణ అన్నారు.భారీ వర్షంలో సైతం పింఛన్లను ఒక రోజు ముందు ఇవ్వడం ప్రజల్లో హర్షాతి రేఖాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. వర్షంలో సైతం నాయకులు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు ఇవ్వడంతో పింఛనుదారుల ఆనందానికి అవధులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో చిటికినేటి అయ్యప్ప, పీతా రాము, గోపు వెంకట రమణ, దివి మహేష్, బోలిశెట్టి నాని, బొమ్మిడి ఏడుకొండలు,వంకా కాశి, చిటికెనేటి నాగాంజనేయులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నానికి మహర్దశ వస్తోంది

### టిడిపి కృష్ణా జిల్లా ప్రచార కార్యదర్శి పి వీ ఫణి కుమార్



**మచిలీపట్నం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి లు నగర అభివృద్ధికి చక్కటి ప్రణాళికలు రూపొందిస్తున్నారని అతి త్వరలోనే అవి కార్యరూపంలోకి వస్తాయని బందరు నగరానికి మహర్దశ రానుందని, టిడిపి 45వ డివిజన్ ఇంచార్జ్ తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి పి వీ ఫణి కుమార్ అన్నారు. శనివారం 45వ డివిజన్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పింఛన్లు పొందుతున్న వారికళ్ళలో ఆనందాన్ని చూసి తన్మయానికి లోనయ్యామన్నారు.పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నగర కార్పొరేషన్ 45వ డివిజన్ నందు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటా పి. వి. ఫణి కుమార్ పింఛన్లను పంపిణీ చేసారు.మంత్రి కొల్లు రవీంద్ర ఎంపీ వల్లభనేని బాలసౌరి లు మచిలీపట్నం నగర అభివృద్ధికి చక్కటి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు.వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు అండగా నిలిచి పెన్షన్లు పెంపొందించిన చంద్రబాబుకు లబ్ధిదారులు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు.సెప్టెంబరు ఒకటో తేదీ సెలవు కావడంతో ముందు రోజే పెన్షన్లు పంపిణీ చేయించడంతో లబ్ధిదారుల సంక్షేమం కోసం ఆలోచించే కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.వాలంటీర్లు లేకపోయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు భరోసా తో మూడోసారి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, కూటమి ప్రజాప్రతినిధులు రాష్ట్రం లోటు బడ్జెట్ లో ఉన్నా వ్యూహాత్మకంగా ఆలోచన చేస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ అధ్యక్షుడు, గంజాల రవికుమార్, 45వ డివిజన్ సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ, ఏ. రామాంజనేయులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీని స్వయంగా పర్యవేక్షించిన కమిషనర్ సత్యనారాయణ



**అద్దంకి, ఆగస్టు 31(ఆంధ్రపత్రిక ):**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లో భాగంగా పట్టణంలోని పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనారాయణ శనివారం సచివాలయ సిబ్బంది ద్వారా అన్ని వార్డులను నందు వికలాంగులకు వృద్ధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ సక్రమంగా జరిగే విధంగా అధికారులకు సూచనలు ఇస్తూ స్వయంగా పర్యవేక్షిస్తున్న కమిషనర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు సైడ్ కాలవలనందు పూడికలను వ్యర్థాలను గమనించి ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని త్రాగునీరు పారిశుద్ధ్య సమస్యలు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని భారీ వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని మున్సిపల్ కార్మికులకు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోంది

### జోరు వాన సైతం లెక్కచేయకుండా పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పట్ల ఎంతో బాధ్యతగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అర్హులైన పేదలం దరికీ పింఛను అందించి ఆదుకోవడమే లక్ష్యమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఆబ్కారి శాఖ మంత్రివర్యులు కొలు రవీంద్ర అన్నారు. శనివారం ఉదయం మచిలీపట్నం నగరంలోని 20 వ వార్డు గిలకలది ండిలో రాష్ట్ర మంత్రివర్యులు ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఒకవైపున జోరుగా వర్షం కురుస్తున్న ప్పటికీ మంత్రివర్యులు పింఛన్లు పంపిణీ చేయడం చెప్పుకోదగ్గ విశేషం. తొలుత మంత్రి గిలకలదిండిలో మంచానికి పక్షవాతంతో మంచానికే పరిమితమైన లంకే పోతురాజు ఇంటి కి స్వయంగా వెళ్లి అతనిని, అతని భార్య లక్ష్మీ దేవమ్మను ఎంతో ఆప్యాయం గా పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి 15 వేల రూపాయల పింఛన్ను పోతురాజుకు మంత్రి అందజేశారు. గిలకలదిండి తుఫాన్ షెల్టర్ లో ఉన్న పింఛను లబ్ధిదారులు, ప్రజలతో మంత్రి మమేకమై అందరూ బాగున్నారా అని పలకరించి, వారి యోగక్షేమాలను, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పెంచిన పించన్తో చాలా సంతోషంగా ఉన్నామని పలువురు పింఛన్దారులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.అక్కడ దివ్యాంగులు లంకే సాయి ప్రకాష్ కు 6000 రూపాయలు, వృద్ధులైన చిట్టా వీరబాబుకు 4000 రూపాయలు, తమ్ము పద్మకు 4000 రూపాయలు, మోకా గంగాదేవికి 4000 రూపాయల నగదును మంత్రి అందజేశారు. పింఛను ఎవరు ఇస్తున్నారు అని లబ్ధిదారులను మంత్రి వివరాలు అడగడంతో వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇస్తున్నారని ఆనందంతో చెప్పారు.ఈ సందర్భంగా చింతా లక్ష్మి అనే మహిళ తన భర్త వీర్రాజు గత 4 సంవత్సరాలుగా ఆరోగ్యం బాగాలేక మంచం మీదే ఉన్నారని, 15 వేల రూపాయల పింఛను అందజేయాలని మంత్రిని కోరడంతో మంత్రి వెంటనే స్పందిస్తూ వారికి తప్పకుండా పింఛను వచ్చేలాగున సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి రవీంద్ర మాట్లాడుతూ పింఛన్లను 4000 చేయడం ప్రతినెల 1వ తేదీ ఇవ్వడమనే ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో ఆ పింఛన్లు 3 వేల రూపాయలకు పెంచిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సెప్టెంబరు నెల 1 వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో పింఛనుదారులు ఎదురుచూస్తూ ఉంటారనే ఉద్దేశంతో ఉద్యోగులను కూడా ఇబ్బంది పెట్టకుండా ముందు రోజునే అంటే ఆగస్టు 31వ తేదీనే శనివారం పింఛన్లు పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి దక్కుతుందన్నారు. పేదవారిపట్ల వారికి ఉన్న బాధ్యతకు ఇదే నిదర్శనం అన్నారు.గత ప్రభుత్వం 10 వ తేదీ వరకు పింఛన్లు ఇచ్చిన సందర్భాలు మనం చూసామన్నారు. ఆగస్టు 31 వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయా లని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఉద్యోగులు సహకరిస్తూ ఎంతో ఉత్సాహంతో పని చేస్తూ వర్షం సైతం లెక్కచేయకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 10:30 గంటలకే 74 శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.అలాగే మచిలీపట్నం నియోజకవర్గంలో కూడా 68 శాతం ఇప్పటివరకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సాయ ంత్రం లోపు నూటికి నూరు శాతం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గన్నవరం మండలం కొత్తగూడెం గ్రామ సచివాలయ కార్యదర్శి కె. పావని 8 నెలల గర్భవతి అయినప్పటికీ పేదవారికి పింఛన్లు ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడం గమనిస్తే ఉద్యోగులు ఎంత అంకితభావంతో పనిచేస్తున్నారో గమనించాలన్నారు. పింఛన్ల కోసం 2500 కోట్ల రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం పడిందన్నారు. దాదాపు 33 వేల కోట్ల రూపాయల మేరకు ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందన్నారు.మంచానికి పరిమితమైన ఒక వ్యక్తికి 15 వేల రూపాయలు, దివ్యాంగులకు 6 వేల రూపాయల పింఛను అందిస్తుంటే వారు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. ఒక డ్వాక్రా మహిళ బలగం గంగ తన భర్త చనిపోగా 4 వేల రూపాయల వితంతు పించను పొందుతూ తన ఇద్దరు పిల్లలను బాగా చదివించుకుంటూ ఉందన్నారు. గత ప్రభుత్వం అర్హులైన పేదలకు పింఛను రాకుండా తొలగించిందని వారి అభ్యర్ధన పరిశీలించి తప్పకుండా వారికి పించను పునరుద్ధరించే బాధ్యతను తీసుకుంటుందన్నారు.ఈ సందర్భంగా ప్రజలు తమ ప్రాంత ంలో మురికినీటి కాలువ సరిగా లేదని చాలా ఇబ్బందులు పడుతున్నా మని మంత్రి దృష్టికి తీసుకుని రాగా మంత్రి వెంటనే స్పందిస్తూ ఆ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట వార్డు సచివాలయ కార్యదర్శులు అలియా భాష, నాగ కిరణ్, మిర్యాల సురేష్ ,చందన వెంకట సాంబశివరావు, హరీష్ కుమార్, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, యోగానంద్, స్థానిక నాయకులు వైవిఆర్ పాండురంగారావు, బచ్చల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## తుఫాను నేపథ్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు

**బాపట్ల , ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** తుపాను హెచ్చరిక నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నిరంతరం కొనసాగుతుందన్నారు. అత్యవసరమైన సహాయం కొరకు కంట్రోల్ రూమ్ 8712655881 ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ లో నిరంతరం పనిచేసేలా ఉద్యోగులను నియమించామన్నారు. అత్యవసరమైన పరిస్థితులు ఎక్కడైనా ఏర్పడితే ప్రజలు గమనించి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవో కార్యాలయాలలోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామన్నారు.

# అధైర్య పడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

వర్షాలు, వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తతతో ఉంటే ప్రజల ఇబ్బందులను తగ్గించొచ్చు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి అని' అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'వర్షాలు, వరదల వల్ల తాగునీరు, ఆహారం కలుషితం అయ్యే అవకాశం ఎక్కువ ఉంది. అల్లూరి జిల్లాలో కలుషిత ఆహారం ఘటన జరిగింది. బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలి. కలుషిత ఆహారం ఘటనకు గల కారణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధుల తీవ్రత దృష్ట్యా మరింత సమర్థవంతంగా పని చేయాలని వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. ఏజెన్సీలో జ్వరాల బారిన పడిన గిరిజనులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి. ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, వాగులు దాటేందుకు ప్రజలను అనుమతించవద్దు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వివిధ శాఖల అధికారులు నిత్యం సంప్రదింపులు జరుపుకుని సమన్వయంతో పనిచేయాలి. క్రైసిస్ మేనేజ్మెంట్ విషయంలో డ్రోన్లు వంటి టెక్నాలజీ వాడండి. డిజాస్టర్ మేనెజ్‌మెంట్ శాఖ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వర్షాలపై సమాచారం ఇవ్వాలి.

భారీ వర్షాలు, వరదలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలెర్ట్ మెసేజ్ పంపించాలి. విపత్తు వచ్చిన సమయంలో ప్రభుత్వం తమకు ఆదుకుంటుందనే నమ్మకం వారికి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను నిరంతరం మానిటర్ చేయాలి.

అధికారులు బాధ్యతగా ఉండాలి అని' సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. 'పెన్షన్ల పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులకు వెసులుబాటు ఇచ్చాం. రేపు సెలవు కాబట్టి ముందు రోజే పెన్షన్లు ఇవ్వాలని చూశాం. భారీ వర్షాల వల్ల పెన్షన్ల పంపిణీ సమయం పెంచాం. వచ్చే రెండు మూడు రోజుల్లో సచివాలయ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీని పూర్తి చెయ్యవచ్చు.

వర్షాలు లేని ప్రాంతాల్లో యధావిధిగా పెన్షన్ల పంపిణీ కొనసాగుతుంది. విజయవాడలో కొండచరియలు విరిగి ఇంటిపై పడిన ఘటన బాధ కలిగించింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది అని' సీఎం చంద్రబాబు అన్నారు

## వైఎస్సార్ పేరు మార్పు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో మెడికల్ కాలేజీలకు, ఆసుపత్రులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేరు తొలగించడాన్ని.. కాంగ్రెస్ పార్టీ ప్రతీకార చర్యగా భావిస్తోందన్నారు. ఎన్టీఆర్ అయినా వైఎస్సార్ అయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పాటుపడిన వాళ్లే అని చెప్పుకొచ్చారు. పాలనలో తమదైన ముద్ర వేసిన వాళ్లే అని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇద్దరిని చూడాలి తప్పితే.. నీచ రాజకీయాలు ఆపాదించడం సమంజసం కాదన్నారు. వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్మెంట్, రుణమాఫీ, ఉచిత కరెంట్, పెన్షన్లు ఇలా ప్రతి పథకం దేశానికే ఆదర్శమన్నారు. వైఎస్సార్ ఏదో ఒక్క పార్టీకి సొంతం కాదని.. తెలుగు వారి ఆస్తి... తెలుగు వారి గుండెల్లో ఆయన స్థానం ఈనాటికీ పదిలమన్నారు. వైసీపీ మీద ఉన్న కోపాన్ని వైఎస్సార్ మీద రుద్దడం సరికాదన్నారు. వైసీపీలో వైఎస్సార్ లేరని... అది ఎన్నటికైనా వైవీ, సజ్జల, సాయి రెడ్డి పార్టీనే అంటూ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అమరావతి. ఆగస్టు 31(ఆంధ్రపత్రిక):** ప్రజలను అలెర్ట్ చేసిన మంత్రి నారా లోకేష్ ఇక ఏపీవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతోటి అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు రాష్ట్ర ప్రజలకు మంత్రి నారా లోకేష్ సూచనలు చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వంతోపాటు విపత్తు నిర్వహణ శాఖ ఇస్తున్న అలర్ట్ మెసేజ్ లను గమనిస్తూ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచన వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలు బయటకు రాకుండా ఉండటమే మంచిదని పేర్కొన్నారు. కొండ చరియలు విరిగిపడి ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికార యంత్రాంగం సూచించిన సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజాప్రతినిధులు, టిడిపి నేతలు, కార్యకర్తలు సహాయ చర్యలు చేపట్టాలని పూర్తి సహకారం అందించాలని లోకేష్ పిలుపునిచ్చారు. విపత్తుల కష్ట సమయాలలో ప్రజలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించాలని నారా లోకేష్ పేర్కొన్నారు.

## హెలికాప్టర్ గల్లంతు.. తెలియని 22 మంది ఆచూకీ

(మొదటిపేజీ తరువాయి)

హెలికాప్టర్ 1960లో తయారైన డబుల్ ఇంజిన్ హెలికాప్టర్. ఈ మోడల్ హెలికాప్టర్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ వీటిని రష్యాతో పాటు ఇతర దేశాల్లో ఎక్కువగా వాడుతుండడం గమనార్హం.

## కలుషిత ఆహారంతో పిల్లలకు అస్వస్థత

**రెండు నెలల్లో పది ఘటనలు: బొత్స విమర్శలు**



**విశాఖపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):**కలుషిత ఆహారం తిని, పిల్లలు, అస్వస్థతకు గురవుతున్నారని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. రెండు నెలల్లో పది ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. సంబంధిత అధికారుల మీద చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పిల్లల విషయంలో సరైన ప్రాధాన్యత కల్పించడం లేదని మండిపడ్డారు. ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినులు సీసీ కెమెరాలు పెట్టారని, ఆరోపిస్తుంటే దీనిపైన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరినైనా శిక్షించాలి. పార్టీలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో ఇంగ్లీష్ మీడియం ప్రాధాన్యం ఇచ్చామని.. తెలుగు మీడియం తీసివేయలేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అమ్మఒడి పైసలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడులో అనేక పనులు చేపట్టామని తెలిపారు. మిగిలిన పనులు కూడా ఈ ప్రభుత్వం చేయాలని కోరారు. విద్య మీద ఖర్చుపెట్టి ప్రతి పైసా కూడా రేపు భవిష్యత్తు కోసమేనని చెప్పారు. ఫార్మా క్షతగాత్రులకు, పార్టీ తరపున, ప్రకటించిన పరిహారం రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల అస్వస్థతపై కఠినమైన చర్యలు తీసుకొని, ఒక ఎస్ఓపీని అమలు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

## పార్టీ మార్పు ప్రచారం ఊహాగానమే

**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రోజా**



**తిరుమల,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):**తాను పార్టీ మారుతానని జరుగుతున్న ప్రచారం ఊహాగానమేనని మాజీ మంత్రి రోజా అన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో మహిళలపై జరిగిన ఘటనల పట్ల ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలయ్యాక మాజీ మంత్రి రోజా రాజకీయంగా తక్కువగా కనిపిస్తున్నా రు. ఇటీవలి కాలంలో రోజా పార్టీ మారుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఏపీ రాజకీ యాలకు శాశ్వతంగా గుడ్ బై చెప్పనున్నారని.. తమిళనాడులో విజయ్ పార్టీలో చేరతారని టాక్ నడుస్తోం ది. దీనిపై తొలిసారిగా ఆమె స్పందించారు. తిరుమల శ్రీవారిని రోజా ఇవాళ దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ముచ్చుమర్రిలో ఘటన జరిగి 60 రోజులు అవుతున్నా ఆ పాప శవాన్ని ఇంకా కనిపెట్టలేక పోయారని విమర్శించారు. గుడ్లవల్లేరులోని హాస్టల్‌లో హిడెన్ కెమెరాలు పెట్టారంటూ విద్యార్థులు ఫిర్యాదు చేసినా ఏమి జరగలేదని ఎస్పీ చెప్పడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వ హయంలో ర్యాగింగ్ విపరీతంగా పెరిగిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పైన పెట్టిన దృష్టిని పక్కన పెట్టి.. ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంపై దృష్టి సారించాలని రోజా విమర్శించారు. పార్టీలు మారే వారిని ప్రజలు విశ్వసించరని అన్నారు ఎంత మంది పార్టీని వీడినా వైసీపీకీ వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు.

## హర్యానా ఎన్నికల తేదీల్లో మార్పు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31**: హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీని భారత ఎన్నికల కమిషన్ శనివారం నాడు సవరించింది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1న జరగాల్సిన పోలింగ్ తేదీని అక్టోబర్ 5వ తేదీకి మార్చింది. దీనితో పాటు జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను లెక్కించే తేదీని కూడా అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 8వ తేదీకి మార్చింది. బిష్ణోయ్ కమ్యూనిటీ ఓటింగ్ హక్కులను, శతాబ్దాలుగా వారు అనుసరిస్తున్న అసోజ్ అమావాస్య ఫెస్టివల్ సెలబ్రేషన్లను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల తేదీని సవరించినట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. అక్టోబర్ 1వ తేదీ పోలింగ్‌ను రీషెడ్యూల్ చేయాల్సిందిగా ఆల్ ఇండియా బిష్ణోయ్ మహాసభ, బికనీర్ (రాజస్థాన్) జాతీయ అధ్యక్షుడు తమకు లేఖ రాసినట్టు తెలిపింది. ఈ ఏడాది బిష్ణోయ్ కమ్యూనిటీ ఫెస్టివల్ అక్టోబర్ 2న జరుగనుందని, ఇందుకోసం సిర్సా, ఫతేబాద్, హిసార్‌లోని వేలాది కుటుంబాలు రాజస్థాన్ వెళ్తారని, అక్టోబర్ 1న ఎన్నికలైనందున వారు తమ ఓటింగ్ హక్కును వినియోగించుకోలేరని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈసీ తాజా నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. గతంలో కూడా వివిధ కమ్యూనిటీల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ తేదీలను ఈసీ సవరించినట్టు వివరించింది.

## వివిధ ఇసుక రీచ్‌లలో సరఫరా నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపధ్యంలో తమవంతు సహకారం అందించాలని సూచించారు. అదివారం నాటికి 39 ఇసుక నిల్వ కేంద్రాలలో 15,19,239 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. శనివారం 18,031 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1,412 ధరఖాస్తులు అందాయన్నారు. వీరిలో 1,115 ధరఖాస్తుదారులకు 15,636 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసామన్నారు.

## సెప్టెంబర్‌లో రాహుల్ యూఎస్ పర్యటన

**ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్ శామ్ పిట్రోడా వెల్లడి**



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:**లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సెప్టెంబర్ 8 నుంచి 10 వరకూ అమెరికాలో పర్యటించనున్నట్టు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్ శామ్ పిట్రోడా తెలిపారు. సెప్టెంబర్ 8న ఢల్లాస్, 9-10 తేదీల్లో వాషింగ్టన్ డీసీలో రాహుల్ పర్యటిస్తారని చెప్పారు. రాహుల్ గత ఏడాది మేలో అమెరికాలో మూడు రోజుల పర్యటనను శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ప్రారంభించారు. తన పర్యటనలో అక్కడి ప్రవాస భారతీయులను కలుసుకున్నారు. పలువురు యాక్టివిస్టులు, విద్యావేత్తలు, సివిల్ సొసైటీ సభ్యులతో కాలఫోర్నియా యూనివర్శిటీలో చర్చలు జరిపారు. రాహుల్ గాంధీ సెప్టెంబర్‌లో జరిపే అమెరికా పర్యటనపై శామ్ పిట్రోడా మాట్లాడుతూ.. 'రాహుల్ గాంధీ విపక్ష నేత అయినప్పటి ఆయనతో ముఖాముఖీ కోరుతూ ఇండియన్ ఓవర్సీస్ ఛైర్మన్‌గా ఉన్న నాకు 32 దేశాలకు చెందిన భారతీయ దౌత్యవేత్తలు, విద్యావేత్తలు, వ్యాపారులు, నేతలు, అంతర్జాతీయ మీడియా, ఇతరుల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తుతు న్నాయి. స్వల్ప పర్యటన కోసం రాహుల్ అమెరికా వస్తున్నారు' అని తెలిపారు. 8న ఢల్లాస్, 9-10 తేదీల్లో వాస్టింగ్టన్ డీసీలు ఉంటారని, టెక్సాస్ యూనివర్శిటీ విద్యార్థులు, విద్యావేత్తలు, కమ్యూనిటీ ప్రజలతో ఇంటరాక్షన్ ఉంటుందని, పలువురు టెక్రోక్రాట్లను కలుసుకునంటా రని, డల్లాస్ ప్రాంత నేతలతో డిన్నర్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆ మరుసటి రోజు వాషింగ్టన్ డీసీలో కూడా నేషనల్ ప్రస్ క్లబ్ సహా పలువురితో సమావేశమవుతారని, రాహుల్ అమెరికా పర్యటన విజయ వంతం చేయడానికి తామంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని చెప్పారు.

## రైలు రవాణా బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకోవానికి దక్షిణాది రాష్ట్రాలు వేగంగా వృద్ధి చెందడం కీలకమని పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు పెంచిన బడ్జెట్ కేటాయింపుల వల్ల దక్షిణాదిలో రైలు రవాణా మరింత బలోపేతం అవుతుందన్నారు. వందేభారత్ రైలు వల్ల మేరట్- లఖ్‌నవూ మధ్య ప్రయాణ సమయం దాదాపు గంట మేర ఆదా అవుతుందన్నారు. అలాగే, చెన్నై ఎగ్మోర్- నాగర్‌కోయిల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వల్ల రెండు గంటలు, మదురై- బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వల్ల గంటన్నర వరకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని మోదీ చెప్పారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వెంబడి కెనెక్టివిటీని మరింత పెంచే మూడు వందే భారత్ రైళ్ల ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారంనాడు ప్రారంభించారు. మీరట్ సిటీ-లక్నో, మధురై-బెంగళూరు, చెన్నై ఎగ్మోర్-నాగర్‌కోయిల్ మధ్య ప్రయాణించే ఈ కొత్త రైళ్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ప్రారంభించినట్టు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్బర్ భారత్' చర్యల్లో భాగంగా కొత్త రైళ్లతో మరింత వేగం, సౌకర్యవంతమైన ప్రయాణం సాకరమవుతుందని పేర్కొంది.'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా వందే భారత్ రైళ్లను తొలిసారిగా 2019 ఫిబ్రవరి 15న ప్రవేశపెట్టారు. సౌకర్యవంతమైన ప్రయాణం, వేగవంతమైన ప్రయాణం కోసం తీసుకువచ్చిన వచ్చిన ఈ రైళ్లు ప్రస్తుతం 100కు పైగా రాకపోకలు సాగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 280 జిల్లాలను కలుపుతూ ప్రయాణం సాగిస్తున్నాయి. -మీరట్ సిటీ-లక్నో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ : మీరట్‌ను లక్నోతో కలిపే తొలి వందే భారత్ రైలు ఇది. పర్యాటకాన్ని పెంచేందుకు, రాష్ట్ర రాజధానితో వేగవంతమైన అనుసంధానం వల్ల స్థానిక పరిశ్రమలకు ఈ రైలు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.-మదురై-బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్: మదురై టెంపుల్ సిటీని బెంగళూరు కాస్మో పాటిటలన్ హబ్‌ను కలుపుతుంది. దీంతో వాణిజ్యం, విద్య, తమిళనాడు-కర్ణాటక మధ్య ఉద్యోగుల రాకపోకలకు మరింత సౌకర్యం కలుగుతుంది. చెన్నై ఎగ్మోర్-నాగర్‌కోయిల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్: ఈ ప్రాంతంలో తొలి వందే భారత్ సర్వీస్ ఇది. తమిళనాడులోని 726 కిలోమీటర్లను కలుపుతూ 12 జిల్లాల మీదుగా వెళ్తుంది. యాత్రికులు, స్థానికులకు మెరుగైన ట్రావెల్ సదుపాయాన్ని అందిస్తుంది. కాగా, ఈ వందే భారత్ రైళ్లలో కవచ్ టెక్నాలజీ, రొటేటింగ్ చైర్స్, ఫ్రెండ్లీ టాయిలెట్స్, ఇంటిగ్రేటెడ్ బ్రయిలె సిగ్నేజెస్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్లు కల్పించారు.

## జాతీయ సమగ్రతను కాపాడుతున్న సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** సుప్రీంకోర్టు మన ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసిందన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. అలాగే, వ్యవస్థల పట్ల గౌరవాన్ని, విశ్వాసాన్ని సుప్రీంకోర్టు నెలకొల్పిందని ప్రశంసలు కురిపించారు. కాగా, సుప్రీంకోర్టు 75ఏళ్ల వార్షికోత్సవం పురస్కరించుకొని జిల్లా న్యాయవ్యవస్థపై ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ ప్రత్యేక సదస్సులో ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై. చంద్రచూడ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు 75 ఏళ్ల స్మారక చిహ్నం స్టాంప్‌ను, 75 రూపాయా నాణెంను విడుదల చేశారు. అనంతరం, ప్రధాని మోదీ మాట్లాడుతూ..'సుప్రీంకోర్టు ప్రయాణంలో 75 ఏళ్లు పూర్తి కావడమంటే, రాజ్యాంగ విలువలకు, పరిపక్వమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనం. సుప్రీంకోర్టు మన ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. వ్యవస్థల పట్ల గౌరవాన్ని, విశ్వాసాన్ని నెలకొల్పింది. ఎమర్జెన్సీ చీకటి కాలంలో కూడా సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులకు హామీ ఇచ్చింది. జాతీయ ప్రయోజనాలను, జాతీయ సమగ్రతను సుప్రీం కోర్టు ఎప్పుడూ కాపాడుతుంది. మన న్యాయవ్యవస్థ 140 కోట్ల మంది దేశ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. మహిళలపై నేరాలకు సత్వరమే తీర్పులు రావాలి. మహిళలపై చోటు చేసుకొనే నేరాలపై సత్వరమే విచారణ పూర్తి అయి తీర్పులు రావాలి. మహిళలు, చిన్నారుల భద్రత సమాజానికి ఆందోళనకరంగా మరిందన్నారు. కాగా, కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రి ఘటన నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

## వారినికి 4 రోజులే పని

(మొదటిపేజీ తరువాయి)

నగరాలను నేలమట్టం చేసినా, పట్టుదలతో ముందడుగు వేస్తూ అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. అక్కడి ప్రజలు ఎంతో క్రమశిక్షణగా ఉంటూ, దేశాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. తాజాగా జపాన్ ప్రభుత్వం ఓ వినూత్న నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు వారానికి నాలుగు రోజులు మాత్రమే పని చేయాలని పేర్కొంది. ఈ విధానం అన్ని సంస్థల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జపాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానాన్ని 2021లోనే అమలు చేయాలని జపాన్ నిర్ణయం తీసుకుంది. ఆదేశాలు కూడా జారీ చేసింది.

## గాజాపై ఇజ్రాయిల్ దాడులు.. 48 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

మరణించినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. పోలియో వ్యాక్సిన్ ప్రచారాన్ని ప్రారంభించే ముందు గాజాలోని మధ్య, దక్షిణ ప్రాంతాల్లో ఈ ఘర్షణలు జరిగాయి. ఐక్యరాజ్యసమితి దాదాపుగా 6,40,000 మంది పిల్లలకు పోలియో టీకాలు వేయడం ప్రారంభించనుంది. ఈ కార్యక్రమం ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరిగే పోరాటంలో రోజూవారీ ఎనిమిది గంటల విరామంపై ఆధారపడి ఉంది. శనివారం, గాజా స్ట్రిప్‌లోని ఎనిమిది చారిత్రాత్మక శరణార్థుల శిబిరాల్లో ఒకటైన నుసీరత్‌లోని వైద్యులు ప్రచారం ప్రారంభానికి 2,000 మందికిపైగా వైద్య, కమ్యూనిటీ వర్కర్లు సిద్ధమవుతుండగా, ఇజ్రాయెల్ దాడుల్లో తొమ్మిది మంది సభ్యులతో సహా కనీసం 19 మంది మరణించారని వైద్యులు తెలిపారు. గాజాలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన వరుస దాడుల్లో మరో 30 మందికి పైగా మరణించారు. సెంట్రల్, దక్షిణ గాజా స్ట్రిప్‌లో తమ కార్యకలాపాలను కొనసాగించినట్లు ఇజ్రాయిల్ సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసింది. పశ్చిమ రఫాలోని టెల్ అల్ సుల్తాన్‌లో తమ సైనికులు ఉగ్రవాదుల్ని హతమార్చినట్లు తెలిపింది. దశాబ్ధాల నాటి ఇజ్రాయిల్ పాలస్తీనా వివాదంలో అక్టోబర్ 07న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేయడంతో గాజా యుద్ధ ప్రారంభమైంది. ఈ దాడిలో హమాస్ మిలిటెంట్లు 1200 మంది ఇజ్రాయిలీ పౌరుల్ని హతమార్చడమే కాకుండా, 240 మందిని బందీలుగా పట్టుకెళ్లారు. అప్పటి నుంచి ఇజ్రాయిల్ హమాస్‌ని నేలకూల్చే లక్ష్యంతో గాజాపై దాడులు చేస్తోంది. ఇప్పటికే ఈ హమాస్ పొలిటకల్ బ్యూరో ఛీఫ్ ఇస్మాయిల్ హానియేని హతమార్చడమే కాకుండా, దాని మిలిటరీ వింగ్ నాయకుడు మహ్మద్ డయిఫ్‌ని చంపేసింది. మరికొందరు కీలక కమాండర్లను హతమార్చింది. ఈ యుద్ధంలో ఇప్పటి వరకు 40 వేలకు పైగా సాధారణ పాలస్తీనా ప్రజలు మరణించారు.

# జలదిగ్బంధనం



విజయవాడలోని మొగల్రాజపురం సున్నపుబట్టి సెంటర్‌లో విరిగిపడిన కొండచరియలు





**విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** "భారీ వర్షాలతో విజయవాడ ఒక్కసారిగా వణికిపోయింది. కుంభవృష్టితో ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోయాయి. కొండచరి యలు సమీపంలోని ఇళ్లపై విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో నలుగురు మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొండచరియల ధాటికి ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇంకా శిథిలాల కింద ఎవరైనా ఉన్నారేమో అన్న అనుమానంతో యుద్ధ ప్రాతిపదికన శిథిలాలను అధికారులు తొలగిస్తున్నారు. మొగల్రాజపురం సున్నపుబట్టి సెంటర్ వద్ద ఈ కొండ చరియలు విరిగిపడిన ఘటన జరిగింది. మరికొన్ని ప్రాంతాల్లో కూడా కొండ చరియలు విరిగిపడినట్టు చెబుతున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఓ ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. మరో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతానికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయాక చర్యలు చేపట్టాయి. ధ్వంసమైన ఇళ్ల శిథిలాలను తొలగిస్తున్నారు అధికారులు. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్న వేళ వాటిపై జాగ్రత్తగా పనులు చేస్తున్నారు. విజయవాడలో రాత్రి నుంచి పడుతున్న వర్షంపై అధికారులను మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అప్రమత్తం చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీలలో నీరు పారుదలకు ఆటంకాలు లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వైపు రాగల రెండురోజులు సైతం అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది. తెలంగాణలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది.



ఎడతెరపులేని వర్షం కారణంగా విజయవాడ బందరు రోడ్డులోని నిలిచిపోయిన ట్రాఫిక్

# ఉప్పొంగి పొర్లుతున్న వాగులు

## పరిస్థితిని సమీక్షిస్తున్న మండల తహసిల్దార్, ఎస్ ఐ





**ఆగిరిపల్లి ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ఆగిరిపల్లి మండలంలో గత రాత్రి నుండి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుం డడంతో జన జీవనం స్తంభించింది .. వడ్లమాను గ్రామం వద్ద పెద వాగు, ఆగిరిపల్లి నుండి శోభనాపురం వెళ్లేదారిలో కుంపిని వాగు, ఆగిరిపల్లి నుండి నూగుం డపల్లి వెళ్లే దారిలో ఉప్పు వాగు,. ఆగిరిపల్లి నుండి విజయవాడ వెళ్లే వాగు, ఆగిరిపల్లి నుండి గన్నవరం వెళ్లే దారిలో చిన్న ఆగిరిపల్లి వద్ద వాగు , నెక్కలం గొల్లగూడెం పొలిమేరలో ఉన్న ఊర చెరువు మరియు మండల ంలో ఉన్న మరికొన్ని చెరువులు పొంగి పొర్లు తుండటంతో ప్రజలు ప్రయాణించడానికి చాలా ఇబ్బంది పడ్డారు. వ్యవసాయదారులు వరి విత్తనం విత్తిన రోజునుండి నీరు లేక చాలా ఇబ్బంది పడ్డారు, దీంతో వరి విస్తీర్ణం కూడా తగ్గింది, మిగిలిన కొద్దీ మంది ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి పంట పండిస్తుంటే వర్షం వల్ల పంట అంతా నీటి పాలు అవడంతో రైతుల ందరూ బోరున విలపిస్తున్నారు. మండలంలో ఈనెల 30 సాయంత్రం 5 గంటల నుండి ఈరోజు సాయంత్రం 5 గంటల వరకు మండల తాసిల్దార్ పి ఎన్ వి ప్రసాద్ తెలిపిన వివరం ప్రకారం 221.2 ఎం ఎం గా వర్షపాతం నమోదయిందని మండలంలో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు లేవని, ప్రతి గ్రామానికి వి.ఆర్.ఓ లను, సచివాలయం సిబ్బందిని ఎలర్ట్ ఉంచామని, ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఆగిరిపల్లి తహసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని మండలంలో వర్షాభావం వల్ల ఎవరికైనా ఇబ్బంది వస్తే కంట్రోల్ రూమ్ తెలియచేస్తే తక్షణమే స్పందిస్తామని తహసిల్దార్ ప్రసాద్ తెలియజేశారు. ఆగిరిపల్లి ఎస్ ఐ బి సురేంద్ర కుమార్ అగిరిపల్లి మండలంలో పొంగిపొర్లుతున్న వాగులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలను వాగులు దాటనీయకుండా పోలీస్ బీట్ ఏర్పాటు చేస్తున్నారు.

## ఒకే నెలలో రెండు పెన్షన్లు పంపిణీ

# చంద్రబాబుకే సాధ్యం



**ఆగిరిపల్లి ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ఆగిరిపల్లి మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం 80% పూర్తయిందని ఎంపీడీవో తెలియజేశారు. మండలంలో తీవ్ర వర్షాభాగం ఉన్నప్పటికీ ఉదయం ఐదు గంటల నుండే పెన్షన్ పంపిణీ కార్యక్రమం మొదలైంది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వార్డు మెంబర్లు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పామర్తి నరసయ్య మాట్లాడుతూ ఒకే నెలలో రెండు పెన్షన్లు ఇవ్వడం చంద్రబాబుకే సాధ్యమై ందని, గత ప్రభుత్వ హయాంలో 2 వేల నుండి 3 వేల రూపాయలకు పెంచడానికి వాయిదాల ప్రకారం పెంచారని, చంద్రబాబు హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడగానే 4000 రూపాయలు పెన్షన్ కార్యక్రమం అమలు చేశారని, దీనివల్ల ఎంతో మంది వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, దివ్యాంగులకు 15 వేల కు పెంచడంతో పలువురు దివ్యాం గులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, పనులు చేసుకోలేక ఇబ్బంది పడుతున్న వితంతువులు, దివ్యాంగులు, కులవృత్తులు చేసుకునే వారికి పెన్షన్ ప్రారం భించింది కూడా చంద్రబాబే నని కొనియాడుతూ చంద్రబాబుకు, నారా లోకేష్ కు, పవన్ కళ్యాణ్ కు, మంత్రి పార్థసారథి కి కృతజ్ఞతలు తెలియజేశారు

# సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేయుటకు ఆహ్వానం



**ఆగిరిపల్లి ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ఆగిరిపల్లి స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాల లో సివిక్స్ అధ్యాపకుడిగా పని చేయుటకు అర్హు లైన అభ్యర్థులు అనగా సంబంధిత సబ్జెక్టులో "పోస్ట్ గ్రాడ్యుయేట్" లో 50 శాతం మార్కులు గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సోమవారం అనగా సెప్టెంబర్ 1 తారీఖు నాటికి అందించ వలసినదిగా తెలియజేయడమైనదని ప్రిన్సిపాల్ యోహాన్ తెలియజేశారు.



మృతుల కుటుంబ సభ్యులకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ తరపున ఐదు లక్షల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె, కమిషనర్ ధ్యానచంద్ర ,

**మృతి చెందిన మేఘన, లక్ష్మి, అన్నపూర్ణ కుటుంబ సభ్యులకు చెక్కుల పంపిణీ**

# గంజాయి, రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

## గుంటూరులో ఈవ్ టీజింగ్ వినపడకూడదు- పోలీసు ఉన్నతాధికారులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** గంజాయి విక్రయాలు, వినియో గంపై ఉక్కుపాదం మోపండి. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోండి.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు లోని ఎంపీ కార్యాలయంలో ఐ.జీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ లు పెమ్మసానితో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ మాట వినపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈవ్ టీజింగ్ నియంత్రణ కోసం కాలేజీలు, యూనివర్సిటీ ల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద ఎక్కువగా ఉంటుందని చెప్పారు. అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలపై మరింత కఠినంగా వ్యవహరిం చాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిత్యావసర సరుకులు అందించే విషయంలో ఎంతో నిబద్ధతగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేదలకు అండ



**బాపట్ల ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం నగదు పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి శనివారం బాపట్లలో లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు భీమావారిపాలానికి చేరుకుని జోరున కురుస్తున్న వర్షంలోనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. మారిశెట్టి శంకరరావుకు వృద్ధాప్య పింఛన్ నగదు అందించారు. జి నాగేశ్వరమ్మకు వృద్ధాప్య పింఛన్ ఇచ్చారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మీకు నెల మొదటి రోజే పింఛన్ నగదు ప్రభుత్వం అందిస్తుందని వారికి హామీ ఇచ్చి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

జోరున వర్షం కురిసినప్పటికీ, విపత్తు వచ్చినా లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఒకటవ తేదీ ఆదివారం సెలవు దినం రావడంతో సచివాలయం ఉద్యోగు లంతా ముందు రోజే నగదు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింద న్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా సచివాలయాల సిబ్బంది పింఛన్ పంపిణీలో నిమగ్నమయ్యారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వర్షంలో సైతం పింఛన్ పంపిణీ సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోకి పింఛన్ నగదు వేస్తే దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడతారని సీఎం గుర్తించి నేరుగా నగదు అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. జోరున కురుస్తున్న వర్షంలో తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ నగదు ఇస్తుంటే లబ్ధిదారులు ఎంతో సంతోషిస్తున్నారని తెలిపారు. జిల్లాలో రెండు లక్షల 31 వేల రెండు వందల మంది లబ్ధిదారులకు రూ.96.24 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమం సమర్థంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డిఆర్డిఏ పిడి వై పిచ్చిరెడ్డి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, బాపట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ జిట్టా ప్రమీలారాణి, జనసేన నాయకులు కారుమూరి ఆంజినేష్, బిజెపి నాయకులు మామిడి రమేష్, టిడిపి నాయకులు శీలం శ్రీనివాస రావు, స్థానిక కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీ - న్యూకాన్ ఏరోస్పేస్‌ల మధ్య అవగాహన ఒప్పందం



**గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటె డ్ల ఎన్ఏపీఎల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్‌తో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చు కున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన రంగాలలో ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టలను సులభతరం చేయవచ్చు న్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్ లు మరియు ఇండస్ట్రీ-అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ఎన్ఏపీఎల్ ఉద్యోగుల కోసం ఎంటెక్ కోర్సును ప్రత్యేకంగా రూపొందించి వారిలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపం చడంతో పాటు విద్యా అర్హతలను పెంచుతామన్నారు.

అంతేకాకుండా నిర్దిష్ట పరిశ్రమ అవసరాలను తీర్చడంతో పాటు విద్యా అనుభవాన్ని పెంచుకోవ డానికి ఏరోస్పేస్ టెక్నాలజీస్‌లో న్యూకాన్ టైలర్డ్ మైనర్/హానర్/మాడ్యులర్ ప్రోగ్రామ్‌లను పరిచయం చేస్తామన్నారు. వీటితో పాటు న్యూకాన్ ఉద్యోగులకు పీహెచ్‌డీలో ప్రవేశంకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు.

ఈ సందర్భంగా ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకో వడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదనివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎన్ఏపీఎల్ హెచ్‌ఆర్ విభాగాధిపతి అరవింద్ కుమార్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రవహిస్తున్న వర్షపు నీటిలో ఎన్.ఎస్.యు.ఐ పడవ ప్రయాణం



**గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** గుంటూరు నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యాన్ని నిలువునా ఎండ కట్టారు యన్. ఏస్.యూ.ఐ గుంటూ రు జిల్లా అధ్యక్షులు షేక్ కరీం గత వారం రోజులుగా భారీ వర్షం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపినప్పటికీ గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూశారు. ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు డ్రైనేజీలలో పూడికతీత వంటి పనులు ఏ మాత్రం చేపట్టలేదు. దీంతో వర్షపు నీటితో నిండిపోయిన డ్రైనేజీ, సైడు కాలువలోని నీరు రోడ్లపైకి భారీగా చేరింది. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన యన్. ఏస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చెరువును తలపిస్తున్న వర్షపు నీటిలో పడవ ప్రయాణం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.యన్. ఏస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం చేపట్టిన వినూత్న నిరసనకు అటుగా పయనించే వాహనదారులు మద్దతు పలికారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మొద్దు నిద్ర వీడి, కళ్ళు తెరిచి డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని కోరుతున్నారు. ఇప్పటికే గుంటూరు నగరాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేశామని చెబుతున్న అధికారులు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గుంటూరు నగరంలో కమీషన్లకు కక్కుర్తి పడి అభివృద్ధి విషయంలో అవినీతికి పాల్పడుతూ ప్రజలను నగర ప్రజలను ఇబ్బందులు గురిచేయడం సరికాదని ఇప్పటికైనా మొద్దు నిద్ర మేల్కొని అధికారులు రాజకీయ పార్టీ నాయకులు గుంటూరు నగర డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు నిలవకుండా ముందుకు వెళ్లే విధంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమం లో గుంటూరు నగర ఇంచార్జి ఏసు రాజు,తూర్పు నియోజకవర్గం ఇంచార్జి సుమంత్, పశ్చిమ నియోజకవర్గం మదన్, బృందం సలాం, జానీ, రాజు, సోహెల్, కుమార్, కళ్యాణ్, మారుతీ, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

# అంకిత భావంతో పనిచేసిన ఎంపీడీవో



**ఆగిరిపల్లి ,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** ఆగిరిపల్లి మండల పరిషత్ అధికారి పి శంకర్రావు ఈరోజు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ప్రభుత్వ వైద్యశాల అధికారి డాక్టర్ జగన్మోహన్రావు మాట్లాడుతూ శంకరరావు టైం పంచ్యాలిటీ అనేది మెయింటైన్ చేస్తారని, ప్రతి విషయంలోనూ వెంటనే స్పందిస్తారని, లైన్ డిపార్ట్మెంట్స్ కోఆర్డినేషన్ బాగా చేస్తారని కొనియాడారు.

హౌసింగ్ ఏఈ సయ్యద్ అలీముల్లా మాట్లాడుతూ శంకరరావు మంచి కార్య దీక్షపరుడని, ప్రతి విషయంలోనూ అందరిని కలుపుకుపోతూ, అందరి సలహాలు తీసుకుంటూ ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, కరెంటు డిపార్ట్మెంట్ వారు, మండలాధికారులు అందరూ పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ కోసం బాల కుటీర్ పాఠశాల లీజ్ ను పొడగించాలి

## కౌన్సిల్ సమావేశంలో సుధీర్ఘంగా ప్రసంగించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** అనేక సంవత్సరాలుగా విద్యార్థు లకు మెరుగైన విద్యను అందిస్తున్న గుంటూరు శ్యామల నగర్ లోని బాల కుటీర్ పాఠశాల లీజును ప్రజాప్రయోజనాలు మరియు విద్యార్థుల భవిష్యత్తు కోసం పొడిగించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళ మాధవి విజ్ఞప్తి చేశారు శనివారం గుంటూరు మున్సిపల్ కౌన్సిల్లో టేబుల్ అజెండాగా ఉన్న బాల కుటీర్ పాఠశాల లీజు అంశం మరియు ఇతర అంశాల పై కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజా జీవి తంలో ఉన్న మనము ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వివిధ చట్టాలను ప్రత్యేక నిర్ణయాలను తీసుకుంటాం కాబట్టి బాల కుటీర్ స్కూల్ లీజు అంశం కూడా అలాగే పరిగణించాలి. ఆ స్కూలుకు ప్రత్యేక చరిత్ర ఉన్నది కాబట్టి దాని లీజును పొడిగించాలని కోరుతున్నాను ఎందుకంటే దానిమీద ఆధారపడిన విద్యార్థులు సిబ్బంది ఉన్నారు. ఇప్పటికే మనం చూస్తున్నాం కొన్ని ప్రైవేట్ స్కూల్లో వారు ఆదాయం కోసం ఎంతమంది విద్యార్థులకైనా అడ్మిషన్లు ఇస్తున్న ఈ రోజుల్లో విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని లక్ష్యంతో పరిమిత సీట్లతో మరియు ఆ సీటును పొందాలంటే ప్రవేశ పరీక్షల ఉత్తీర్ణులైన వారికి మాత్రమే సీటును కేటాయిస్తున్నారంటే వారి ఉన్నత లక్ష్యాన్ని, ఆశయాలను మనం అర్థం చేసుకోవాలి కాబట్టి ప్రజా ఆమోదం పొందిన బాల కుటీర్ పాఠశాల లీజును పొడిగించాలని, ప్రజాప్రతినిధులు అయినా తాము దీనికి తాను ఆమోదం తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## బోర్డు మెంబరు నియామకంలో అవకాశం కల్పించుటకు వినతి



**యాదగిరి , ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** యాదగిరి గుట్ట దేవస్థానంలో ఆధ్యా త్మిక- సమాజ సేవకుడిగా , కాంగ్రెస్ పార్టీ సభ్యుడనైన నిరుద్యోగికి నాకు బో ర్డు మెంబరు నియామకంలో అవకాశం కల్పించుటకు వినతి నా మనవి ఏమనగా పేరు: కొలిపాక శ్రీనివాస్ (58సం) తండ్రి రామయ్య, వృత్తి, వ్యాపారం, నివాసంఎ కంట్రాక్టర్ బస్తీ బెల్లంపల్లి తేది 15-09-2001 నాడు బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు రోడ్ వెడల్పు చేసి నపుడు నా దుకాణం పోయినది. నాకు ఎలాంటి పరిహారం కూడ రాలేదు. నేను నా భార్య- పిల్లలను పోషించుకునేందుకు ప్రైవేటు ఉద్యోగం చేస్తు మాతండ్రి సంపాదించిన ఇంట్లో ఉంటున్నను. నేను మెదటి నుండి కాంగ్రెస్ పార్టీ సభ్యుడను. మీరు ఎలక్షనుకు ముందు 12-11-2023 నాడు బెల్లంపల్లి, తిలక్ స్టేడియం కు వచ్చినపుడు నేను మీకు స్వాగతం పలికి స్టేజి పైన శాలువా తో సత్కరించి మా పద్మ శాలి కులస్తులంకు కార్పోరేషన్ ఏర్పాటు చేస్తు, 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ లో ఉన్న నాకు పద్మశాలి కార్పొరేషన్ ఛైర్యన్ పదవి ఇవ్వాలని మీకు వినతి పత్రం ఇచ్చినాను. తెలంగాణ లో మీ నాయక్వంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మిమ్ములను తెలంగాణ సిఎం గా నియామించాలని కాంగ్రెస్ ఐ పార్టీ ముఖ్య నాయకులు : శ్రీమతి సోనియా గాంధీ 10 జనపథ్ రోడ్న్యుడిల్లీ లేఖ రాసిన మీ యొక్క వీర అభిమానిని నేను మీ అభిమానిగా రేవంత్ రెడ్డి సైన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తేది 23-8-2024 నాడు మంచిర్యాల మెడికల్ కాలేజి - అటానమీ హెడ్ ప్రొఫెసర్ డా ధీరజ్ కి మా కుటుంబ సభ్యులపం తకాల తో నా మరణాంతరం నా యొక్క మృత దేహన్ని వైద్య-విద్యార్థుల పరీక్షలకు ఉపయోగించేలా బాండ్ పేపర్ పై రాసి ఇవ్వడం జరిగింది సమాజమే దేవాలయం- ప్రజలే నా దేవుల్లు అన్న స్వర్గీయ ఎన్టీ ఆర్ మాటలకు ఆకర్షితుడనై జీవిస్తున్న మీ అభిమానిని. నాకు బెల్లంపల్లి ఎమ్.ఎల్.ఏ., గడ్డం వినోద్ ,చెన్నూరు ఎమ్ఎల్ ఎ డా వివేకానంద, ఎమ్ పి గడ్డం వంశీ , రెవిన్యుశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో రాజీకీయ పరంగా ప్రత్యక్ష సంబంధాలు ఉన్నను నేను ఎవరి సిఫారసు లేకుండ మీరే నా హైకమండ్గా (సిఎం) భావించి నేను మీకు యాదగిరి గుట్ట దేవస్థానంలో బోర్డు మెంబరుగా అవకాశం (అఖిల భారత పద్మశాలి సంఘం అధికార ప్రతినిది) కల్పించగలరని నేను తెలంగాణలో కాంగ్రెస్ ఐ పార్టీ రావాలని మీరు తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని కోరుతు హైదరాబాద్ లోని ఎల్ బీ నగర్ , అష్టలక్ష్మి దేవాలయం లో 2-12- 2023న మీ' పేరున అర్చన, అభిషేకం మరి యు అన్న ప్రసాద వితరణకు నా వంతు ఆర్ధిక సహాయం చేయడమైనది.

## కమిషనర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య



**జగ్గయ్యపేట,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** జగ్గయ్యపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన సిహెచ్ నాగమల్లేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మరియు వార్డు కౌన్సిలర్స్ తో కలిసి శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ పాల్గొ ని నాగమల్లేశ్వరరావు కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిం చినారు.ఓకార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ, ఏలూరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ లే అవుట్ లలో స్థలాలు కొనవద్దు



**జగ్గయ్యపేట,ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక ):** జగ్గయ్యపేట పురకపాలక సంఘం పరిధిలో ఆక్రమ లే అవుట్ లపై మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాన్ని జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు,మరియు 19వార్డు కౌన్సిలర్ నూకల సాంబ ,టౌన్ ప్లానింగ్ అధికారి , అనదికార లే అవుట్ లు పై జగ్గయ్యపేట రిజిస్ట్రార్ వారికి అభ్యంతరములు తెలుపుతూ తీర్మా నాలను అందచేసి, రిజిస్ట్రేషన్ లను చేయకూడదని, అనుమతులులేని లే అవుట్ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడం వలన మున్సిపాలిటి ఆర్దికంగా నష్టపోతుందని తెలియజేశారు.

కావున ప్రజలు అక్రమ లే అవుట్ లలో స్థలాలు కొనుగోలు చేయవద్దని, నిశితంగా పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని కోరుతూ మున్సిపల్ కౌన్సి ఓలర్ నూకల సాంబశివ రావు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే బత్తుల నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌నకు

# మెగా స్పందన

### వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పాల్గొన్న యువత..








**రాజమహేంద్రవరం, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** అనుకోని ప్రమాదాలు, ఇతర కారణాలతో రక్తం లేక ఇబ్బంది పడే వారిని ఆదుకోవాలనే మహా సంకల్పంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నకు మెగా స్పందన లభించింది. బత్తుల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం రాజానగరం మండలం, రాజానగరం రాయల్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుండి మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆయన సతీమణి, నా సేన కోసం నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో వర్షాన్ని కూడా లెక్కచేయకుండా యువత అధిక సంఖ్యలో హాజరై రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో యువత, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు

# పనిచేయని ఉద్యోగులను సాగనంపండి

### చైర్మన్ రాఘవేంద్ర

### అక్రమ లే అవుట్లపై కౌన్సిలర్ సాంబ ఆగ్రహం

### అద్దె కారుపై ఇరుపక్షాల మధ్య ఢీ



**జగ్గయ్యపేట, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** జగ్గయ్యపేట పురపాలక సంఘంలోని ఉద్యోగులు సక్రమంగా పనిచేయడం లేదని అనేకసార్లు కౌన్సిల్ హెచ్చరిక చేసిన పట్టించుకోవటం లేదని చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు ఉద్యోగుల తీరుపై నిలదీయడంతో చైర్మన్ రాఘవేంద్ర తీవ్ర స్థాయిలో స్పందించారు. గతంలో కమిషనర్ ఇచ్చినటువంటి నోటీసులు బుట్టదగ్గరయ్యాయని... ఇకపై శాఖాపరమైన చర్యలు తీసుకునే విధంగా డిఎంఏకు తెలియజేయాలనిఆదేశించారు.

రామలక్ష్మి :–జగ్గయ్యపేట మున్సిపల్ సాధారణ సమావేశంలో టిడిపి కౌన్సిలర్ శ్రీమతి కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ మరియు పారిశుద్ధ్య ఉద్యోగుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. చెరువుకు సమీపంలో ఉన్న తన వార్డులో వీధి దీపాలు వెలగకపోవటం వల్ల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని. అనేకసార్లు తెలియజేసిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని. పారిశుద్ధ్య కార్మికులు కూడా సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపించారు.

సాంభ :–జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో అనధికార లేఔట్ ల ద్వారా మున్సిపాలిటీకి లక్షలాది రూపాయల నష్టం వాటిలిందని 19వ వార్డు కౌన్సిలర్ నూకల సాంబశివరావు అధికారులపై మండిపడ్డారు. దాదాపు 50 ప్రాంతాలలో లేఔట్ ల పేరుతో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి. అనధికార లేఔట్లకు అవకాశం కల్పించారని. దీనివలన పెద్ద ఎత్తున మున్సిపాలిటీకి నష్టం వాటిల్లిందని అన్నారు. అనధికార లేఔట్ ల పేరుతో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన జగ్గయ్యపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పట్టణ ప్రాంతంలో ఉన్న 50 లేఔట్ ల పై ప్రత్యేక విచారణ జరిపించి . అనధికార లేఔట్లు నిర్వహించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులతోపాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సాంబ డిమాండ్ చేశారు. పురపాలక సంఘం పరిధిలో ఉన్న లేఔట్ల విషయంపై ఇప్పటికే పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని. అయినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు తక్షణమే అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్ లను కూడా వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చైర్మన్ రాఘవేంద్ర ఆదేశాలు మేరకు కమిషనర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు.... మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ రావు మాట్లాడుతూ అక్రమ లే అవుట్లపై మున్సిపల్ అధికారులు సక్రమంగా స్పందించలేదే తప్ప మాకు. మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఖండించారు.అలాగే జగ్గయ్యపేట పట్టణంలో వనం- మనం కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని మూడో వార్డు కౌన్సిలర్ శ్రీమతి కాశి అనురాధ కిషోర్ కోరారు. ఈరోజు జరిగిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన మార్గంలో ఉన్న డివైడర్లపై ఉన్న చెట్లు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటన్నింటినీ తొలగించి. వాటి స్థానంలో స్వచ్ఛమైన గాలిని. ఆరోగ్యాన్ని ఇచ్చే పోషక విలువలతో కూడిన చెట్లను నాటించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 150 అడుగుల జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసుకున్నారని సంకలు కొడుతున్నారు కానీ..ఆ పతాకాన్ని వర్షాకాలంలో తీసి జాగ్రత్తలు చేయకపోవడం వలన ఎప్పటికప్పుడు చినిగిపోయి.. చూసేందుకు ఇబ్బందికరంగానూ.. జాతీయ జెండాను అవమానపరిచే విధంగా ఉంటుందని సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకునేలా చైర్మన్ రాఘవేంద్ర చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో వాణిజ్య దుకాణాల వారు నాసిరకం ప్లాస్టిక్ కవర్లను విక్రయించటం. కొనుగోలు చేసిన వస్తువులతో పాటు గుడ్డ కవర్లు కాకుండా ప్లాస్టిక్ కవర్లు ఇవ్వడం వలన పట్టణంలో కలుషిత వాతావరణం పెరిగిపోయిందని. ఇప్పటికే అనేక మంది పలు రకాల వ్యాధులకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే మున్సిపల్ అధికారులు. భారీ కార్పొరేట్ తరహా వాణిజ్య షాపులపై వెంటనే దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను నియంత్రించాలని. పట్టణంలో కూడా ప్లాస్టిక్ కవర్లను పూర్తిస్థాయిలో నివారించాలని మరో కౌన్సిలర్ సుందరమ్మ డిమాండ్ చేశారు. 31 వ వార్డు కౌన్సిలర్ గింజపల్లి వెంకట్రావు మాట్లాడుతూ రోడ్లపై ఆవుల సంచారాన్ని నియంత్రించి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. తన వార్డులో డ్రైన్లు సిమెంట్ రోడ్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ తప్పనిసరిగా పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ప్రధాన మార్గంలో ఉన్న డివైడర్లపై మొక్కలు నాటేందుకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ పతాకాన్ని కూడా సందర్భాన్ని బట్టి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటారనిఅన్నారు. వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్. కౌన్సిలర్ వి.మనోహర్లు మాట్లాడుతూ అదే కారు టెండర్ విషయంపై మాట్లాడుతూ ఆన్లైన్ టెండర్ ప్రకారం కారును ఖరారు చేయాలని పట్టుపట్టగా తెలుగుదేశం పార్టీకి చెందిన పేరం సైదేశ్వర రావు. వెంకట్ లు అడ్డుపడి. చంద్రకళ అనే కారు ఓనర్ పై గతంలో పలు రకాల ఫిర్యాదులు ఉన్నాయని వాటిపై విచారణ జరుగుతున్నందున అటెండర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని మురుగే కాలవలను శుభ్రం చేసేందుకు కేటాయించిన నిధులను సరైన పద్ధతిలో ఖర్చు చేయాలని ప్రభాకర్ సూచించారు. అనంతరం పదవీ విరమణ చేసిన మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావును మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తో పాటు ఇతర కౌన్సిలర్లు. మున్సిపల్ ఉద్యోగులు. సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# రోడ్డు విస్తరణ పేరిట తొలగించిన ఇండ్లు

### ధ్వంసమైన డ్రైనేజీ వ్యవస్థ

### రోడ్డుపై పొంగిప్రవహిస్తున్న వర్షపు నీరు

### అవస్థలు పడుతున్న వేపాడ వల్లంపూడి గ్రామస్తులు

### పట్టించుకోని మండల గ్రామస్థాయి అదికారులు

**వేపాడ, ఆగస్టు, 31 (ఆంధ్రపత్రిక) :** ఎన్నికలప్పుడు ఓట్ల కోసం రాజకీయ నాయకులు హామీల వర్షం కురిపిస్తారు.నేతల మాటలను నమ్మి జనం ఓట్లేసి అధికారం కట్టబెడతారు.అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు సమృద్ధిగా ఉన్నాయో లేవో చూడరు.ఇచ్చిన హామీ మేరకు టెండర్లు వేయిస్తారు.కాంట్రాక్టర్‌ను ఇరకాటంలోకి నెట్టి పనులు ప్రారంభించేలా ఒత్తిడి తీసుకువస్తారు. మంత్రులు, ఎమ్మెల్యే లు చేత అట్టహాసంగా శంకుస్థాపనలు కూడా చేస్తారు.కాంట్రాక్టర్ ఓపిక ఉన్నంత వరకు పనులు చేపట్టి చేసిన పనులకు బిల్లులు చెల్లించని పరిస్థితిలో చేతులెత్తేస్తారు.ఆ తర్వాత ప్రారంభించిన పనులు సగంలో ఆగిపోవడం వల్ల ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడతారో అర్థం చేసుకోరు.జరిగే పరిణామాలను పట్టించుకోరు.ఇదీ నేటి పాలకులు నాయకుల తీరు.వివరాల్లోకి వెళ్తే మండలంలో అతి ప్రధానమైన సోంపురం – ఆనందపురం రోడ్డు పరిస్థితి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతొంది. వైసీపీ అధికారంలోకి రాగానే ఈ రహదారి విస్తరణ కోసం సుమారు 29కోట్లు మంజూరు చేసినట్లు అప్పట్లో పాలకులు వెల్లడించారు.నిధులు సిద్ధంగా ఉన్నాయో లేవో తెలీదు గాని టెండర్లు పిలిచారు. అప్పటి జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు అప్పటి ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి



శ్రీనివాసరావు తదితరులు సోంపురం జంక్షన్ లో శంకుస్థాపన చేసారు.ఆ తర్వాత సంబంధిత కాంట్రాక్టర్ కాస్త ఆలస్యంగానైనా రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు.నత్తనడకన 80శాతం మేర పనులు పూర్తి చేశారు.మిగిలిన 20శాతం పనులు అసంపూర్తిగా నిలిపివేసిన సంగతి అందరికీ తెలిసిందే.ఎందుకు నిలిపివేయాల్సి వచ్చిందంటే చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు.ఇదిలా ఉంటే మండల కేంద్రం వేపాడ,వల్లంపూడి గ్రామాలలో రోడ్డు విస్తరణ పేరిట హడావిడిగా ఇండ్లను ధ్వంసం చేశారు.వాటితో పాటు డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారు.దాంతో రోడ్డు కూడా అస్తవ్యస్తంగా తయారయింది.పడుతున్న వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యం కారణంగా వర్షపు నీరు రోడ్డుపైకి పొంగిపోయి ఇళ్ళల్లోకి చొరబడి ప్రజా జీవనాన్ని స్తంభింప జేస్తోంది.రెండు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డు పై మురికినీటి నిల్వ వల్ల దోమల బెడద ఎక్కువై ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. ప్రజలు ఎన్ని పాట్లు పడుతున్నా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు.ఆర్.అండ్.బి అదికారులు పట్టించుకోరు.నిత్యం వేపాడకు రాకపోకలు సాగించే మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు.గ్రామ స్థాయిలో పంచాయితీ కార్యదర్శులు,సర్పంచులు, ఎంపీటీసీలు కూడా పట్టించుకోరు.పోనీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పాలకులు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు.నియోజకవర్గ ప్రజల అత్యదిక ఓట్లతో గెలుపొందిన స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి గాని,విశాఖ ఎంపీ శ్రీభరత్ గాని ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియదు.ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పక్కనపెట్టి కనీసం వర్షపు నీరు బయటకు పోయే విదంగా డ్రైనేజీ వ్యవస్థనైనా మెరుగు పరచాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# విద్యార్థులు సెల్ఫోన్లకు ఆకర్షితులవ్వకండి

### ఎస్.కోట రూరల్ సీఐ కె రవికుమార్

**వేపాడ,ఆగస్టు,31(ఆంధ్రపత్రిక):**విద్యార్థులు విద్యార్థి దశలో సెల్ ఫోన్లకు ఆకర్షితులవ్వకుండా దూరంగా ఉండాలని,సెల్ఫోన్లకు ఆకర్షితులై తమ జీవితాలను పాడు చేసుకోవద్దని,సెల్ ఫోను అనేది సమాచారానికి మాత్రమే వాడాలని శృంగవరపుకోట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.రవి కుమార్ విద్యార్థులకు తెలిపారు.మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన నేటి సమాజంలో ప్రస్తుతం ఆడపిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో ఆడపిల్లలు తెలివిగా వ్యవహరించి, జాగ్రత్తగా ఉండాలన్నారు.పాఠశాలకు వెళ్ళి,వచ్చే సమయంలో ఎవరైనా ఏ విధమైన ఇబ్బంది పెట్టినా వెంటనే తల్లిదండ్రులకు గాని లేదా పాఠశాలలోని ఉపాధ్యాయులు కు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.అదేవిధంగా పాఠశాలలోని మగ విద్యార్థులందరూ తోటి విద్యార్థినులను చెల్లెల్లుగా భావించి,సోదర భావంతో మెలిగి వారి పట్ల గౌరవంగా ఉండాలన్నారు.పాఠశాలలో గాని బయట గాని ఏ విధమైన అసాంఘిక మైన కార్యక్రమాలు చేయకుండా అందరూ చక్కగా క్రమశిక్షణతో చదువుకొని అటు ఊరికి,ఇటు చదువుకున్న పాఠశాలకు,పెంచిన తల్లిదండ్రులకు, దేశానికి,పేరు,ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు.విద్యార్థులు చదువుకున్న కాలంలో చెడు మార్గాల వైపు అడుగు



లు వేయకుండా,చెడు అలవాట్లు కు బానిసలు కాకుండా తమ జీవితాలను బాగు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

### శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** వర్షం సైతం లెక్కచేయకుండా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు.జగ్గయ్యపేట నియోజవర్గం, జగ్గయ్యపేట మండలం, చిల్లకల్లు గ్రామంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పెన్షన్ లను అందించారు.బి

**ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ**

బివృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, కిడ్నీ బాధితులకు ఇస్తున్న పెన్షన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకుందని ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆటంకములు ఏర్పడినను పెన్షన్ పంపిణీ జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ పంపిణీ చాలా సీరియస్ గా తీసుకుని పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే ఈరోజు పెన్షన్ అందించామని అన్నారు.. పేద ప్రజల పక్షాన నిలబడాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందని తాతయ్య గారు తెలిపారు.పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన జరుగుతుందని తెలపడానికి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిలుస్తుందని ఆయన అన్నారు.వాలంటీర్ల వ్యవస్థ ఉండదు పెన్షన్ పంపిణీ సజావుగా జరగదని అప్పుడు అధికారంలో ఉన్న వైసిపి నాయకులు ప్రజలను మభ్యపెట్టడానికి ఏవేవో మాట్లాడారు.వాలంటీర్ల వ్యవస్థ లేకపోయినా సచివాలయం సిబ్బందితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పెన్షన్‌ల పంపిణీ చేసి చూపించారన్నారు.ఇచ్చిన మాట ప్రకారం మొదటి నెల నుండే పెన్షన్ పెంచారని తాతయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగికి విధులే జ్ఞాపకాలుగా మిగులుతాయి

### సమాచార శాఖ డిడి నాగార్జున

**కాకినాడ, ఆగస్టు 31(ఆంధ్ర పత్రిక):** ఉద్యోగిగా తన బాధ్యతలను నిర్వహించిన కాలంలోనే అవి తీయటి జ్ఞాపకాలుగా మారి వారికి ఎంతగానో గుర్తు చేస్తాయని సమాచార శాఖ డిడి డి నాగార్జున అన్నారు. ఆ కాలంలో ఉద్యోగి తాను నిర్వహించిన విధులే పదేపదే తీయటి జ్ఞాపకాలుగా ఉంటాయన్నారు. శనివారం కాకినాడలోని సమాచార శాఖ డిడి కార్యాలయంలో టైపిస్ట్ జి స్వరాజ్య కుమారి పదవీ విరమణ



సందర్భంగా హౌస్ ఆఫ్ ప్రేయర్ పక్కనున్న హాలులో ఆమెకు అభినందన సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన డిడి నాగార్జున మాట్లాడుతూ స్వరాజ్య కుమారి ప్రతీ విషయాన్ని ఎంతో శ్రద్ధగా ఓపిగ్గా విని తన బాధ్యతలను సకాలంలో నెర్వహించేవారన్నారు. కార్యాలయంలో అందరితోటి కలిసిపోయి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. తనకు అప్పగించిన పనిని సకాలంలో పూర్తిచేసే వారన్నారు. స్వరాజ్య కుమారి విధులు నిర్వహించిన బాధ్యత పట్ల ఆమె పనితనాన్ని గుర్తు చేసుకుంటామని నాగార్జున పేర్కొన్నారు. ఆమె శేష జీవితం ఎంతో ఆనందంగా కుటుంబ సభ్యులతో గడవాలని డిడి నాగార్జున ఆకాంక్షించారు. బిషప్ జి విజయరాజు మాట్లాడుతూ తన అక్క స్వరాజ్య కుమారి తొలినాళ్ల నుంచి ఎంతో క్రమశిక్షణ కలిగి అందరితో కలిసి పోయే వారన్నారు. కొద్ది రోజులపాటు ఇబ్బందులు పడినా వాటిని మర్చిపోయి తిరిగి తమలో ఎంతో సంతోషాన్ని నింపినట్లు విజయరాజు చెప్పారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత స్వరాజ్య కుమారి మాట్లాడుతూ తనకు కార్యాలయంలో సహకరించిన సిబ్బంది మేలు మరువలేనన్నారు. తన ఇల్లు మాదిరిగానే కార్యాలయంలో తన బాధ్యతలను నిర్వహించేదాన్నినని తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని స్వరాజ్య కుమారి చెప్పారు. అనంతరం పదవీ విరమణ చేసిన స్వరాజ్య కుమారిని సమాచార శాఖ సిబ్బంది, బంధువులు పూల మాలలు వేసి శాలువతో సత్కరించి ఆమెపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ వీఆర్వో పెద్దింటి రవి, సమాచార శాఖ సిబ్బంది సిహెచ్ బాబూరావు, పద్మజ, బషీర్, గోపి, లక్ష్మి, నరేష్, అజయ్, సతీష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

### అంగన్వాడీ కేంద్రాల్లో రెండు రోజులు పాటు

# వన మహోత్సవం

### మొక్కలు నాటిన ఐసీడిఎస్ సూపర్వైజర్లు, కార్యకర్తలు



**వేపాడ, ఆగస్టు, 31 (ఆంధ్రపత్రిక) :** ఐసీడిఎస్ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో వన మహోత్సవం కార్యక్రమం శుక్ర, శనివారా లలో ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని బొద్దాం, నీలకంఠరాజపురం సెక్టార్ల సూపర్వైజర్లు కామేశ్వరి, భాగ్యవతిల పర్యవేక్షణలో జరిగిన ఈ వనమహోత్సవం కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, పలువురు మహిళలు పాల్గొని మొక్కలు నాటారు.మండల కేంద్రం వేపాడ గ్రామంలోని మూడు అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు మంగలక్ష్మి,రాజేశ్వరి,దేవీ తదితరులతో పాటు ఆయాలు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐసీడిఎస్ సూపర్వైజర్లు మట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలపై ఉందని,తద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు.

# జామగుడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అపశ్రుతి

ఆహార విష తుల్యత వలన ఆసుపత్రి పాలైన 104 మంది విద్యార్థినిలు

శుక్రవారం రాత్రి ఆసుపత్రిలో చేరిన 61 మంది ఇప్పటికే పూర్తి కోలుకోని వైనం

శనివారం ఉదయం మరో 42 మంది ఆస్పత్రిలో చేరిక

పరిస్థితిని తీవ్రంగా సమీక్షిస్తున్న జిల్లా యంత్రాంగం అధికారులు










డుంబ్రిగుడ ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) ; కోరాయి పంచాయితీ పరిధిగల జామగుడ ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి 61 మంది బాలికలు కలుషిత ఆహారం భోజనం సేసి కొద్దిసేపటికే విద్యార్థినిలకు వాంతులు విరోచనాలు మొదలయ్యాయి.మరి కొంతమందిని వైద్య సిబ్బంది పాఠశాలలోని వైద్య సేవలు అందిస్తున్నారు. అరకులోయ ఆసుపత్రిలో చేరిన వారి బాలికల సంఖ్య 104 కు పెరిగింది.ఆస్పత్రిలో చేరిన విద్యార్థినిలు ఈరోజు వరకు ఎవ్వరు రికవరీ కాకపోవడం, రిలీవ్ కాకపోవడంతో అందర్నీ ఆందోళన కలిగిస్తుంది. ఈ విషయంపై ప్రశ్నించగా ఆసుపత్రి వర్గాలు నోరు మెదపడం లేదు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, జిల్లా అధికారుల యంత్రం అంత హుటాహుటిన శనివారం పాఠశాలలో సందర్శించి నిర్వాహకుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా వైద్య బృందాన్ని ఈ విషయమై నియమించామని చెప్పారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఆ పాఠశాల సిబ్బందిని మొత్తాన్ని మార్చే యోచన చేస్తామని స్పష్టం చేశారు. చికిత్స పొందుతున్న విద్యార్థినిలకు ఎంత ఖర్చైనా వెనుకడబోమని చెప్పారు. త్వరగాత్తిగా రికవరీ అయ్యేటట్లు చూసి హాస్టల్లో విద్యార్థినిలకు పంపాలని వైద్యులకు సూచించారు. హాస్టల్ నిర్వహణలో కొన్ని లోపాలు గుర్తించినట్లు చెప్పారు.వాటిని సరిచేసి నూతన మెనూ సార్టును ఏర్పాటు చేసి జిల్లాలోని మూడు ఐటిడిఏల పరిధిలో ఏ రోజుకు ఆ రోజు విద్యార్థిని విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాల విషయమై వాట్సప్ ద్వారా ఐటీడీఏ పీవోకు విజువల్స్ పంపించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. వారి వెంట అల్లూరి జిల్లా అధికారుల అయంత్రాంగం పాల్గొన్నారు.

## మద్యం షాపుల సిబ్బంది సమ్మెకు సంపూర్ణ మద్దతు

మాలమహానాడు ఏపీ దళిత కూలీ రైతుసంఘం నేతల స్పష్టీకరణ



వేపాడ, ఆగస్టు, 31 (ఆంధ్రపత్రిక) : రాష్ట్ర వ్యాప్తంగా 7వ తేదిన మద్యం షాపుల సేల్స్ మెన్, సూపర్వైజర్ల సంఘం చేపట్టదలచిన మద్యం దుకాణాల బంద్ కు తాము సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఏపీ దళిత కూలీ రైతు సంఘం,మండల మాలమహానాడు నేతలు దేబార్కి కిరణ్,పార్ధన సోమునాయుడు,దేబార్కి రవి,డోలా నాగేష్,రెడ్డి మరియదాసు స్పష్టికరించారు.స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ,గత వైసీపీ ప్రభుత్వం వీరిని ఉద్యోగంలోకి తీసుకున్నపుడు ఇంటర్యూల ద్వారా ఎంపిక చేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు.నూతన మద్యం పాలసీ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది ఉద్యోగులు రోడ్డున పడతారన్నారు.ఉద్యోగ భద్రత కల్పించవలసిన ప్రభుత్వం ఉద్యోగాల నుండి తొలగించాలని చూడడం దుర్మార్గపు చర్యగా వారు అభివర్ణించారు.ఉద్యోగాల నుండి తొలగించి నిరుద్యోగులను చేసి వారి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేయడం తగదన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇప్పటికే వినతి పత్రం సమర్పించి నందున ప్రభుత్వం పునరాలోచన చేసి మద్యం షాపుల సిబ్బందికి న్యాయం చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఏపీ దళిత కూలీ రైతు సంఘం,మండల మాల మహానాడు సంఘాలు హెచ్చరించాయి.

## ఎసెన్షియా కార్మిక కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, కొవ్వొత్తులతో నివాళులు అర్పించిన సిఐటియు




అచ్యుతాపురం, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక) : అచ్యుతాపురం ఎస్.ఈ.జెడ్ ఎసెన్సియా పరిశ్రమలో 17 మంది మృతి చెందిన ఉద్యోగ, కార్మిక కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ కొవ్వొత్తులతో సిఐటియు ఆధ్వర్యంలో శనివారం అచ్యుతాపురం జంక్షన్ లో నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ 17 మంది ప్రాణాలను బలిగొన్న ఎస్సెన్సియ యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం అన్యాయం అని, యాజమాన్యాలకు రాయితీ ఇస్తూ కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్లే తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు లేకపోవడం వల్ల, యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికులు విధులకు రావాలంటే క్షణక్షణం భయాందోళన చెందుతూ విధులు నిర్వహించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్ఈజెడ్, ఫార్మాసిటీ ప్రాంతంలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నా, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడం కార్మికుల ప్రాణాలు పోవడానికి కారణం అవుతుంది అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత దగ్గరలో ప్రాథమిక చికిత్స హాస్పిటల్ అయిన లేకపోవడం వల్ల విశాఖపట్నం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈలోగానే కార్మికులు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి, ఈ ప్రాంతంలో బర్నర్ వార్డుతో కూడిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగిలిన వారికి మెరుగైన వైద్య సదుపాయం కోసం ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, పరిశ్రమలు తనిఖీ అధికారులు, భద్రత ప్రమాణాలు మెరుగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం మండల కన్వీనర్ కే. సోమునాయుడు, రమణ, చండి, రామునాయుడు, నరసింహారావు, నానాజీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎసెన్షియా ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆర్థిక సహాయం అందజేసిన వైఎస్ఆర్సీపీ నాయకులు



అచ్యుతాపురం, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక) : ఇటీవల అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం ఏ.పీ.ఎస్.ఈ.జడ్ నందు గల ఎసెన్సీయా కంపెనీ లో జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని ఇటీవల మాట ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం శనివారం ఎమ్మెల్సీ శ్రీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్, ఎలమంచిలి నియోజవర్గం మాజీ శాసనసభ్యులు శ్రీ యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు), చోడవరం మాజీ శాసనసభ్యులు శ్రీకరణం ధర్మశ్రీ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదగా చనిపోయిన అచ్యుతాపురం మండలం మోటూరుపాలెం గ్రామస్తుడు పూడి మోహన్ మరియు వసెట్టిపాలెం గ్రామస్తుడు చిన్నారావ్, రాంబిల్లి మండలం మూలజంప గ్రామస్తుడు సన్యాసి నాయుడు కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల చెక్కులను అందజేసి ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటామని వారికి భరోసా ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం రాంబిల్లి మండలాల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటాపురం సబ్ స్టేషన్ వద్ద అర్ధరాత్రి ఆందోళన



మునగపాక, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక) : మునగపాక మండలం వెంకటాపురం గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిరసపల్లి, తోటాడ, వెంకటాపురం తదితర గ్రామాలకు చెందిన యువకులు శుక్రవారం అర్ధరాత్రి ఆందోళన చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు విద్యుత్ సరఫరా రాకపోవడంతో తక్షణమే విద్యుత్ సరఫరా చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, రాపేటి పరమేష్, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కాసేపటి తర్వాత విద్యుత్ సరఫరా అందించడంతో ఆందోళన విరమించారు.

## కౌమార బాలలకు అవగాహన సదస్సు



అచ్యుతాపురం, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక) : అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామంలో ఉన్న కె.జి.వి.బి స్కూల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అర్.కె.ఎస్.కె కౌమర స్నేహ పూర్వక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా కౌమార బాలురు, బాలికలకు పెళ్లి ఏ వయస్సులో చేసుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రారంభ వివాహాలు 18సంవత్సరాలు లోపు, అలస్య వివాహాలు 30సంవత్సరాలు పైబడిన వారు వివాహాలు చేసుకోవడం వలన వచ్చే ఇబ్బందులు గురించి మరియు పిల్లలకు పిల్లలుకు మధ్య ఉండవలసిన అంతరం మరియు రక్తహీనత అంటే ఏమిటి? ఎలా వస్తుంది? వస్తే ఏ ఆహర నియమాలు పాటించాలి అని ముఖ్యంగా బాలికలకు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, చోడపల్లి గ్రామం ఎమ్.ఎల్.హెచ్.పి భవాని, ఏ.ఎన్.ఎమ్ రమణమ్మ, ఆశా వర్కర్ దేముడమ్మ, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఉమాదేవి, స్టాఫ్ నర్స్ విశ్వరి అందరూ పాల్గొని స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

## సాహసం చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్

జోరు వానలో కాలినడకన 20 కిలోమీటర్ల ప్రయాణం

గిరిశిఖర మారిక గ్రామంలో 70 పింఛన్ల పంపిణీ





వేపాడ, ఆగస్టు, 31 (ఆంధ్రపత్రిక) : నిజంగానే జాకేరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సాహసం చేశారనడంలో ఎటువంటి సందేహం లేదు.నేటి సమాజంలో కొంతమంది ఏసీ రూముల్లో,ఫ్యాన్లు కింద కూర్చొని ఉద్యోగాలు సక్రమంగా చేయని తరుణంలో తను తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయాలనే సదుద్దేశంతో ఆ వెల్ఫేర్ అసిస్టెంట్ చేసిన పనిని “సాహసం చేసాడు “అనడంలో ఎటువంటి సందేహం లేదు.వివరాల్లోకి వెళితే మండలంలోని జాకేరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ప్రేమ్ కుమార్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం భాగంగా తమ సచివాలయ పరిధిలోని గిరిశిఖర ప్రాంతమైన మారిక గ్రామం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ లెక్కచేయకుండా,జోరు వానలో కాలినడకన గ్రామానికి చేరుకొని,గ్రామంలో గల 70 వృద్ధాప్య,వితంతు,వికలాంగు,పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశాడు.వెల్ఫేర్ అసిస్టెంట్ చేసిన సాహసానికి సచివాలయ పరిధిలోని జాకేరు గ్రామ సర్పంచ్ దంపతులు బుద్ధ చిన్నమ్మలు అప్పలనాయుడులతో పాటు సచివాలయ పరిధిలోని గ్రామస్తులు,తోటి ఉద్యోగులు మండల స్థాయి అధికారులు హర్షం వ్యక్తం చేశారు.ప్రేమ్ కుమార్ ని ఆదర్శంగా తీసుకుని మిగతా ఉద్యోగులు విధులను నిర్వహించాలని పలువురు అంటున్నారు.

## తెరిపివ్వని వర్షం

పలు చోట్ల కూలిన పశువుల పాకలు చెట్లు

గ్రామాల్లో రోడ్లపైనే నిలిచిపోయిన వర్షపు నీరు





వేపాడ, ఆగస్టు, 31 (ఆంధ్రపత్రిక) : తుఫాన్ ప్రభావంతో వర్షం తెరిపివ్వడం లేదు.రాత్రి నుండి అదేపనిగా పడుతున్న జల్లులు కారణంగా దాదాపుగా జనజీవనం స్తంభించి పోయింది. వాతావరణం అనుకూలించక పోవడంతో ప్రయాణాలు పెద్దగా ప్రయాణాలు జరగడం లేదు. ఉరుములు మెరుపులు పెను గాలులు వీచకపోయినప్పటికి మండలంలోని చినగుడిపాల శివారు బోజంకివానిపాలెం గ్రామంలో బోజంకి చినతల్లికి చెందిన పశువుల పాక నేల కూలింది. అలాగే వల్లంపూడి, బల్లంకి అడవిపై చెట్లు నేలకొరిగాయి. అదే విధంగా మండలంలోని కుమ్మపల్లి, వేపాడ, వల్లంపూడి తదితర గ్రామాలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచి పోయి రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అరిగిపాలం గ్రామంలోని పాఠశాల ఆవరణ అంతా జలమయమైంది.పదే పదే పత్రికల్లో ప్రచురించినప్పటికీ పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు.అధికారులు గాని పంచాయితీ కార్యదర్శులు,నాయకులు గాని పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలంతా క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అలాగే మొన్నటి వరకు వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందిన మండల రైతాంగం ప్రస్తుతం పడుతున్న వర్షాల వల్ల మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

## “తల్లిపేరు మీద ఒకచెట్టు మన రేపటికోసం”



కె.కోటపాడు, ఆగస్ట్ 31 (ఆంధ్రపత్రిక) : నాటిన ప్రతిమొక్కను పెంచి పెద్దదిచేస్తేనే మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని ఈఓపీఅర్డీ పి.వి.ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు.స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద శనివారం సీడీపీఓ వి.మంగతాయారు ఆధ్వర్యంలో “తల్లి పేరు మీద ఒక చెట్టు మన రేపటి కోసం” కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అయన మొక్క నాటిన అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటడం, పెంచడం అందరికీ ఒక సామాజి బాధ్యత కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి మండలంలోని కె.కోటపాడు, ఎల్.వి.పాలెం, దేవరాపల్లి మండలం కాశీపురం, దేవరాపల్లి సెక్టార్ల సూపర్ వైజర్స్ ఎల్.బి.సుశీల, రమణమ్మ, కళ్యాణి, రాములమ్మ, అంగన్వాడి కార్యకర్తలు డోకల కుమారి, మంగళగిరి లక్ష్మి, శివలక్ష్మి, గౌతమి, చెల్లయ్యమ్మ, కళావతి, సత్యవతి, ఈశ్వరమ్మ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన జీవీఎంసీ ఉద్యోగులకు ఘనంగా సన్మానం




**విశాఖపట్నం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పనిసరని, ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది లాంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీలో వివిధ హెూదాలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న 17 మంది జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులను ఉన్నతాధికారులతో కలసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారు జివిఎంసిలో సుదీర్ఘకాలం ప్రజల కొరకు ఎన్నో సేవలు అందించారని, రోజులో తన కుటుంబం కంటే తమ సంస్థ కొరకు అంకితమై సమయములో, సేవలు అందించి, ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని అలాగే చిరు స్థాయి నుండి అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేసిన పి.రమేష్ జీవితం అంతా సంస్థ సేవ కొరకే అందించారని కొనియాడారు. ఇక వారి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి జీవీఎంసీ ఉద్యోగులు పనిచేస్తున్నారని ఉదయం నుండి రాత్రి వరకు రోడ్లపై, కార్యాలయాలలో పనిచేసి ప్రజలకు అనేక సేవలు అందించారని అటువంటి ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినప్పుడు వారిని సగౌరవంగా జివిఎంసి గౌరవించడం మన సాంప్రదాయం అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు, ఉద్యోగులకు ప్రావిడెంట్ సొమ్మును 1 కోటి 23 లక్షల 60 వేల రూపాయలను అధికారులు అందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరు పి.పద్మజ, పర్యవేక్షకులు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలవేళ పంటలపై అప్రమత్తంగా ఉండాలి

**కె.కోటపాడు, ఆగస్ట్ 31 (ఆంధ్రపత్రిక) :** రానున్న మూడురోజుల్లో ఇంకా అధికవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులందరూ పంటలను ఎప్పటికప్పుడు గమనించాలని చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు వర్ధనపు రవీంద్ర తెలిపారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలువల్ల మండలంలో పంటలపై ప్రభావం ఏమేర ఉందో తెలుసుకోడానికి శనివారం ఆయన



వి.సంతపాలెంలో వరి పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఇప్పటిదాకా ఎలాంటి నష్టంవాటిల్లలేదని, వర్షపునీరు పొలాల్లో నిలువ ఉండకుండా వి.ఎ.ఎ.ల సలహా మేరకు రైతులు చిన్నచిన్న నీటి కాలువలు తీసుకుని నీటిని బయటకు పంపేయాల్సి వస్తుందన్నారు. భారీ వర్షాలకారణంగా ఎక్కడైనా పంటలు మునగడం, పంటనష్టం జరిగితే వెంటనే గ్రామాలలో ఉన్న వ్యవసాయ సహాయకులకు తెలియ చేయాలన్నారు. అలాగే వి.ఎ.ఎ.లు అందరు ఎప్పటికప్పుడు పొలాలను పరిశీలించి అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎ.డి.ఎ.రవీంద్రతో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం వి.సోమశేఖర్, వీఏఏలు స్నేహ, విజయ్, రైతులు నరవ సముద్రం తదితరులు ఉన్నారు.

## మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజశేఖర్



**కె.కోటపాడు, ఆగస్ట్ 31 (ఆంధ్రపత్రిక) :** న్యాయవ్యాదుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని టిడిపి విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తి రాజశేఖర్ తెలిపారు. కూటమి న్యాయవాదులందరం విశాఖలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశామని తెలిపారు. న్యాయవాదులకు రక్షణ చట్టం చేయాలని, బీమా సదుపాయం కల్పించాలని, న్యాయవాదులకు కార్పస్ ఫండ్ తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళామన్నారు. మంత్రి లోకేష్ స్పందించి పరిశీలిస్తామన్నారని అయన తెలిపారు. విశాఖపట్నానికి అనేక కంపెనీలు వస్తున్నాయని, వాటిద్వారా న్యాయవాదులకు వృత్తిపరంగా అనేక సేవలు అందించే అవకాశం ఉంటుందని లోకేష్ చెప్పారని తెలిపారు. అలాగే విశాఖ ఎం.పి.భరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జి, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్ ఎస్.రాజు దృష్టికి మా సమస్యలు తీసుకు వెళ్ళామని అయన తెలిపారు. మంత్రి లోకేష్ ను కలిసినవారిలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పి.ఎస్.నాయుడు, వెన్నెల ఈశ్వరరావు, సవిల సతీష్, శోభన్ బాబు, విశాఖపట్నం టిడిపి లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కన్నూరు అప్పలనాయుడు, ఉమాశంకర్, దుర్గాప్రసాద్, పార్థసారథి, పొట్నూరు కిరణ్ కుమార్, పల్లా బాలాజీ, కరణం త్రినాధ్, సంతోష్, డి.నరేష్ కుమార్, వరప్రసాద్, వెంకటరమణ, అచ్చంనాయుడు, శాంతి, సత్యనారాయణ, శ్రీధర్, మణికంఠ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారని రాజశేఖర్ తెలిపారు.

## అమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమం



**మునగపాక, ఆగస్టు 31, (ఆంధ్రపత్రిక) :** అమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో గవర్ల అనకాపల్లి గ్రామంలో క్రీస్తుశ్రలు ఆళ్ల వరలక్ష్మి తౌడమ్మ కుమారుడు ఆళ్ల శ్రీనివాసరావు వాళ్ల అమ్మ జ్ఞాపకార్థం నాలుగవ వర్ధంతి సందర్భంగా గవర్ల అనకాపల్లి గ్రామంలో శనివారం నిరుపేదలకు గొడుగులు పంపిణీ కార్యక్రమం మరియు మారేడు మొక్కలను పంపిణీ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి జిల్లా ఇస్కాన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీమన్ దుర్లాబ్ కృష్ణ ప్రేమ్ దాస్ విచ్చేసి ప్రతి ఒక్కరు కూడా తల్లిదండ్రులను గౌరవించాలని, వారి అడుగుజాడల్లో నడవాలి అని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ అధినేత ఆళ్ల శ్రీనివాసరావు, ఆళ్ల రాము, చదరం భాస్కర్ రావు, దాడి వీర మహాలక్ష్మి నాయుడు, పొలమరసెట్టి మురళీకృష్ణ, బొడ్డేడ చెల్లి నాయుడు, రాపేటి పరమేశ్వరరావు, ఆళ్ల సోమినాయుడు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌కు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ వినతి



**విశాఖపట్నం, ఆగస్ట్ 31( పత్రికపత్రిక) :** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు విశాఖ టిడిపి పార్టీ ఆఫీసులో ఆయన్ని కలిసి ఇప్పటివరకు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ లో జరిగిన పరిణామాలు వివరించారు. సొసైటీ అధ్యక్షులు బి.రవి కాంత్ మాట్లాడుతూ, విశాఖలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కల నెరవేరడం లేదని, దీనిపై త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని మంత్రికి వివరించారు. మంత్రి లోకేష్ సావధానంగా సమస్యలన్నీ అడిగి తెలుసుకున్నారు. వెంటనే పక్కనే ఉన్న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తో ఈ సమస్యపై చర్చించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ అతి తొందరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. జర్నలిస్టులకు అండదండలు అందిస్తామన్నారు. ప్రధానంగా ఉన్న ఇళ్ల స్థలాల సమస్యపై అధికారులతో మాట్లాడి ఒక కార్యచరణ రూపొందిస్తామని చెప్పారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు జనార్దన్, కోశాధికారి శరత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొప్పన రమేష్, ప్రత్యేక ఆహ్వానితులు యర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ వార్షికోత్స వం సెప్టెంబర్ రెండో వారంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బి రవికాంత్, కార్యదర్శి యర్రా శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తు కార్యచరణ రూపొందించడంతోపాటు ప్రజాప్రతినిధులు అందరినీ ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

## బి.ఎన్ రోడ్‌లో చేపల వేట

### ఇప్పటికైనా అధికారులు స్పందించాలి



**రావికమతం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** మండలంలో కొత్తకోట ప్రాథమిక ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న బి ఎ న్ రోడ్డులో శనివారం సిపిఐ, సిపిఎం నాయకులు గొయ్యిలో చేపలు పట్టి.మొక్కలు నాటి. వినూత్నంగా ఆందోళన చేపట్టారు. కొత్తకోట హై స్కూల్ బి.ఎన్ రోడ్డు వద్ద సిపిఐ, సిపిఎం ,ఆదివాసి సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ.వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలోఆందోళన నిర్వహించారు. రోలుగుంట, బుచ్చయ్య పేట మండలాల్లో నేడు నుంచి ఆందోళన కొనసాగిస్తామన్నారు. అలాగే అనకాపల్లి జిల్లా రోలుగుంట. రావికమతం. బుచ్చయ్య పేట మండలాల పరిధిలో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ప్రయాణికులు. ప్రతిరోజు అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యులు. స్థానిక శాసనసభ్యులు గెలిచిన వెంటనే మరమ్మతులు చేపిస్తామని. హామీ ఇచ్చి నెటికి వంద రోజులు అవుతున్న కనీసం గోతులు కూడా కప్పలేదని గర్భిణీలు ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే మార్గం మధ్యలో ప్రసవిస్తున్నారు. రోజు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్ అండ్ బి అధికారులు కనీసం కనీసం జాడ కనిపించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులుబిఎన్ రోడ్డు మరమ్మత్తులు చేపట్టకపోతేఇతర వామపక్షాలతోబందు నిర్వహించాలని. ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే గోవిందరావు. సిపిఐ మండల కార్యదర్శి జోగి రాజు. గిరిజన సంఘం మండల అధ్యక్షులు గేమిల వాసు. వ్యవసాయ కార్మిక సంఘంనాయకులు సిహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వీఅర్ఓగా విరమణచెందిన "కృష్ణకుమార్"కు ఘన సన్మానం





**కె.కోటపాడు, ఆగస్ట్ 31 (ఆంధ్రపత్రిక) :** మండలంలోని రామయోగిఅగ్రహారం గ్రామ రెవిన్యూ అధికారి (వి.అర్.ఒ)గా సేవలందించి శనివారం ఉద్యోగ విరమణ చెందిన ములగలేటి కృష్ణ కుమార్ ను స్థానిక తహశీల్దార్ కార్యాలయం అధికారులు, సహచర వి.అర్.ఒ.లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కృష్ణ కుమార్-జయలక్ష్మి దంపతులకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంచార్జి తహశీల్దార్ డి.రమేష్ బాబు మాట్లాడుతూ కృష్ణకుమార్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డి.టి.సూరి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్.ఐ)జానకి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వి.అర్.ఒ.లు అనంత, శివకృష్ణ, గోవిందరావు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, అప్పలరాజు, కామరాజు, శంకరరావు, వెంకటేష్, లక్ష్మి, రత్నకుమారి, ఈశ్వరమ్మ, చెల్లమాంబ, ముత్యాలనాయుడు, ముత్యాలు, జగదీష్, మధు, వి.జి.ఎస్.నాయుడు, నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ గాయత్రి, కంప్యూటర్ ఆపరేటర్ కిషోర్, ఒ.ఎస్.శ్రావ్య, విలేజ్ సర్వేయర్లు, వి.అర్.ఎ.లు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### టెలీకాన్ఫరెన్స్‌లో ఆదేశించిన కలెక్టర్ హరేంధిరప్రసాద్



**విశాఖపట్టణం, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, తక్షణ చర్యలు చేపట్టే విధంగా అందరూ సంసిద్ధంగా ఉండాలని సూచించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జిల్లాలోని వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్, జీవీఎంసీ, ఆర్, బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యల్లో ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరాన్ని గుర్తించి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డ్రెయిన్లు సరిగ్గా ఉన్నాయా లేదా మురుగు నీటి కాలువల పరిస్థితిని సమీక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోకుండా వర్షపు నీరు నిలిచిపోకుండా చూసుకోవాలన్నారు. ఇరుకైన ప్రాంతాల్లో, పాత భవనాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆర్-బి, విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కంట్రోల్ రూమ్ లో మూడు షిఫ్ట్ లలో సేవలందిస్తారని పేర్కొన్నారు. ప్రజలకు సమాచారం అందిస్తారని, ఏమైనా సమస్య ఉంటే సహాయక చర్యల కు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తారని వివరించారు. ప్రజల సౌకర్యార్థం ఫోన్ నెం.0891 - 2590100, 0891 - 2590102లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

## ఘనంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల 195వ ఉంజల్ సేవ కార్యక్రమం



**అనకాపల్లి ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) ;** శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానం నందు శ్రీ గౌరీ పరమేశ్వరుల 195వ ఉంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగినది,ఈ కార్యక్రమమునకు దేవాలయ అ ర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ , పొందూరు సూర్య నారాయ ణ శాస్త్రి,శేషు, సాయి, వేదవిదులైన పండితులచే నిర్వహించబ డినది. ఈ ఉంజల్ సేవలో పాల్గొన్న కొణతాల వెంకటరమణ నారాయణమ్మ జ్ఞా వారి కుటుంబ సభ్యులు, ఆలయ మండపంలో శ్రీ అన్నమాచార్య వాగ్దేయ వరద వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి బృంద సభ్యులచే కోలాటములు కీర్తనలు భక్తులు ఎంతగానో ఆకట్టుకున్నా. అతిథులు శ్రీ గౌరీ గీత మహిళా మండలి శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వ రి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

## పింఛన్ల పండుగలో పాల్గొన్న నాగ జగదీష్



**అనకాపల్లి ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక)** వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జోరుగా పెన్షన్ల పంపిణీ చేశారని మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛ న్లు' ఒక రోజు ముందుగానే అంటే ఈ నెల 31నే కూటమి ప్రభు త్వం పంపిణీ చేస్తోందని, వేకువజాము నుంచే జిల్లావ్యాప్తంగా పెన్ ష్ల పంపిణీ ప్రారంభమైందని మొత్తం 64,61,485 పెన్షన్ లబ్దిదా రులకు రూ. 2729.86 కోట్లను కూటమి సర్కార్ పంపిణీ చేయ నుందని,ఉద్యోగుల సెలవుకు భంగం కలగకుండా, పెన్షన్‌దారు లకు నగదు అందడం కోసం ఒకరోజు ఆలస్యం కాకుండా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని,భారీ వర్షాల కారణంగా చాలా ప్రాంతాలు జలమయమయ్యాయని, తుఫాను ప్రభావిత కారణంగా అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారని, ఎటువంటి ఆస్తి, ప్రా ణం నష్టం లేకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు నాగ జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి పాత 14వ వార్డు నెయ్యిని వీధిలో ఈరోజు పెన్షన్ పంపిణీ కార్యక్రమం రేబాక ఈశ్వర అప్పారావు శ్రీకాకుళం గణపతి రేబాక లోవరాజు చింతపల్లి కృష్ణ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్లు పంపిణీ ఆలస్యంపై

## డిఆర్డిఏ పిడి అసహనం

**రావికమతం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** మండలంలో వివిధ గ్రామాలలో శనివారం ఉదయం 8:30 గంటల వరకు పెన్షన్ కంపెనీ కార్యక్రమం ప్రారంభం కాకపోవడంపై డిఆర్డిఏ పిడి కె. సచిదేవి అసహనం వ్యక్తం చేశారు. పెన్షన్లు పంపిణీ పరిరక్షణకు మండల పరిషత్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పంపిణీ కోసం నియమించిన 189 మంది సిబ్బంది గాను 6 గురు ఉద్యోగులు ఉదయం 8.30 అయినా పెన్షన్లు పంపిణీ ప్రారంభం చేయలేదని గుర్తించారు. ఈ సిబ్బందికి సంబంధించిన శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి ఆలస్యానికి కారణం తెలియజేయాలని ఆదేశించారు. ఆమె సమీక్షలో పాల్గొన్న సమయానికి మండలంలో 50 శాతం పెన్షన్ ల పంపిణీ పూర్తయిందని ఎండిఓ వెంకన్న బాబు తెలియజేశారు.

### వమ్మవరం పాఠశాల మినహా ఐదు పాఠశాలలో

## ముగిసిన ఎస్ఎంసి ఎన్నికలు

**రావికమతం ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** మండలంలో శనివారం నిర్వహించిన పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలలో ఐదు పాఠశాల ఎన్నికలు పూర్తికాగా కోరం లేక బొమ్మ వరం ప్రాథమిక పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక వాయిదా పడిందని ఎంఈఓ తలుపులు తెలిపారు. ఈనెల 17న మండలంలో 71 పాఠశాల కుగాను 65 పాఠశాలలో మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు పూర్తి అయిన విషయం తెలిసిందే. వమ్మవరం, సాయి నగర్, గుడ్డిప కసిరెడ్డి పాలెం, మరు పాక ప్రాథమిక పాఠశాల, మరుపాక మోడల్ స్కూల్ కమిటీ ఎన్నికలు వివిధ వివిధ కారణాలవల్ల నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి శనివారం ఈ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించగా వమ్మవరం పాఠశాలలో కోరం లేక ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. మిగిలిన ఐదు పాఠశాలలో కమిటీలు ఎన్నిక ప్రక్రియ ముగిసింది.

## ఎన్.టి.అర్.భరోసా పింఛన్లు 97శాతం పంపిణీ



**కె.కోటపాడు, ఆగస్ట్ 31 (ఆంధ్ర పత్రిక) :** మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సుమారు 97శాతం పూర్తయింది. శనివారం ఉదయం ఐదు గంటలకు ముందే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారిణి, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం (డి.పి.ఆర్.సి) జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి కె.కోటపాడులో పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ అప్పలరాజు, పలువురు అధికారులు ఉద్యోగులు185మంది ఊరూరా ఇంటింటా పెన్షన్ పంపిణీ చేశారు. వర్షంవల్ల అంతరాయం కలిగినా పింఛన్ల పంపిణీ కొనసాగించారు. ఉదయం 9:34 గంటలకు 86.93 శాతం, 11:15 గంటలకు 93.14శాతం, మధ్యాహ్నం 1:22 గంటలకు 95.2శాతం, 3:23 గంటలకు 95.71 శాతం, 3:55 గంటలకు 95.92 శాతం, సాయంత్రం 5.2 0 గంటలకు96.23శాతం, 5:55 గంటలకు 96.41 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. మండలంలో మొత్తం 10,927 పింఛన్లకు గాను 10,535మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. మరో 392 లబ్ధిదారులకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది.

# రేపు ఎస్ఆర్ఎం వర్సిటీ

# స్నాతకోత్సవం

**ముఖ్య అతిథిగా పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాలక్రిష్ణన్**

**గౌరవ అతిథిగా 'స్విగ్గీ' సీఈవో రోహిత్ కపూర్**

**1018 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం**

**28 మంది విద్యార్థులకు బంగారు పతకాలు**



**అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక) :** అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యాప్రమాణాలను అందిస్తోన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సెప్టెంబరు 2న మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ఆవరణలోని అబ్దుల్ కలామ్ ఆడిటోరియమ్ లో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆక్సిల్లర్ వెంచర్స్ ఛైర్మన్ మరియు ఇన్ఫోసిస్ కో ఫౌండర్ పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాల క్రిష్ణన్, గౌరవ అతిథిగా ప్రఖ్యాత స్విగ్గీ ఫుడ్ మార్కెట్ సీఈవో రోహిత్ కపూర్‌లు విచ్చేస్తున్నారు. వీరితో పాటు యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ స్నాతకోత్సవంలో పాల్గొంటున్నారు. 1018 మందికి డిగ్రీలు ప్రదానం 4వ స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ మొత్తం 1018 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుంది. వీరిలో ప్రతిభ కనబరిచిన 28 మంది బంగారు, వెండి, కాంస్య పతకాలను అందుకోనున్నారు. 18 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఐదుగురికి వెండి, మరో ఐదుగురికి కాంస్య పతకాలను ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా 24 మంది పీహెచ్ విద్యార్థులు, మరో 26 మంది ఎంటెక్ విద్యార్థులు, 835 మంది ఇంజినీరింగ్, 11 మంది సైన్సెస్, 60 మంది ఎంబీఏ. 29 మంది బీబీఏ, ముగ్గురు బీకాం చదువులు పూర్తి చేసుకుని డిగ్రీలు అందుకోనున్నారు. వీరితో పాటు ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నుంచి 30 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు..

**బోధన, పరిశోధనే లక్ష్యంగా....**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కేంద్రంగా 2017 జులైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రారంభమైంది. ప్రస్తుతం 9 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, సైన్స్, లిబరల్ ఆర్ట్స్ అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరు మాత్రమే కాకుండా 350 మంది పీహెచ్ విద్యార్థులు ఉన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యాపరంగా ఎంతో అభివృద్ధిని సాధించింది. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రయివేటు యూనివర్సిటీగా పేరు గడించింది. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న యూనివర్సిటీలకు ధీటుగా ఇంజినీరింగ్ విద్యను అందిస్తూ అత్యుత్తమ ఫలితాలను సాధిస్తోంది. ఏటా 80 శాతం విద్యార్థులు వివిధ పేరున్న కంపెనీలలో సాఫ్ట్వేర్ ఉద్యోగులుగా ఎంపికవుతున్నారు. మిగతా వారంతా ఉన్నత చదువుల నిమిత్తం విదేశీ యూనివర్సిటీల్లో జాయిన్ అవుతున్నారు. బోధనతో పాటు పరిశోధనలకు యాజమాన్యం పెద్దపీట వేయడంతో ఇక్కడి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పరంగా రీసెర్చ్ ప్రాజెక్టులు కూడా లభ్యమవుతున్నాయి. యూనివర్సిటీలో బోధన చేస్తోన్న అధ్యాపకులందరూ అంతర్జాతీయ స్థాయిలో పేరున్న యూనివర్సిటీల్లో పీహెచ్‌డి చేసిన వారే కావడం విశేషం. కాగా రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్కుమార్ ఆధ్వర్యంలో డీన్లు డాక్టర్ వినాయక్, డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనూప్సింగ్, పంకజ్, అనిల్ నిగమ్, ఫెర్నాండేజ్, రేవతీలు స్నాతకోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

# నేడు, రేపు మాగుంట జరుపు పర్యటనా కార్యక్రమాలు



**ఒంగోలు, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):** ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి 01-09-2024 మరియు 02-09-2024 తేదీలలో జరుపు పర్యటనా కార్యక్రమము

05.00 సా - ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట.

06.00 సా-ఒంగోలులో జరుగు స్థానిక కార్యక్రమాలలో పాల్గొనుట.

07.00 సా - ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట.

02-09-2024

08.00 ఉ - ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట.

10.00 ఉ - ఒంగోలులో కాపు కళ్యాణ మంటపంలో ఉప ముఖ్యమంత్రి, కొణిదెల పవన్ కళ్యాణ్ గారి జన్మదిన సందర్భంగా బాల నాగేంద్రం నిర్వహించు రక్తదాన శిబిర ప్రారంబోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, దామచర్ల జనార్ధన్ రావుతో కలసి పాల్గొనుట.

11.00ఉ - ఒంగోలులో డి.ఆర్.ఆర్. మునిసిపల్ వున్నత పాటశాలలో ఉప ముఖ్యమంత్రి, కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా షేక్ రియాజ్ నిర్వహించు మెగా రక్తదాన శిబిర ప్రారంబోత్సవ కార్యక్రమంలో దామచర్ల జనార్ధన్ రావు గారితో కలసి పాల్గొనుట. 01.00 సా - ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట.

# తక్షణ సహాయ చర్యలలో ఆర్ పి సిసోడియా

## రాష్ట్రం అతాకుతలం

## రోజంతా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి వ్యక్తిగత పర్యవేక్షణ



**విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రపత్రిక):**తుఫాను నేపథ్యంలో రాష్ట్రం అతాకుతలం అవుతుండగా విపత్తుల నిర్వహణ (రెవిన్యూ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా సహాయక చర్యల కోసం నేరుగా రంగంలోకి దిగారు. అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో ఉదయం నుండే అయా జిల్లాల యంత్రాంగాలను అప్రమత్తం చేస్తూ వచ్చిన సిసోడియా, శనివారం విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుండి పరిస్థితిని సమీక్షిస్తూ వచ్చారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేసారు. అధికారులను సహాయ పునరావాస చర్యలలో నిమగ్నం అయ్యేలా అదేశాలు ఇచ్చారు. సిసోడియా విపత్తుల నిర్వహణ సంస్థ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్ ద్వారా పలు సూచనలు చేసారు. విజయవాడ మొగల్రాజపురం సమీపంలోని సున్నం బట్టీల సెంటర్ వద్ద భారీవర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడ్డ సమాచారంతో నేరుగా అక్కడికి వెళ్లిన సిసోడియా, సహాయకచర్యలను పర్యవేక్షించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ సృజనను అదేశించారు. ఈ సంఘటనలో నలుగురు మృతి చెందగా ముఖ్యమంత్రి ఒక్కొక్కరికి రూ. ఐదు లక్షల సహాయం ప్రకటించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన ఆయన, ఎప్పటి కప్పుడు తాజా సమాచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అందిస్తూ, ఆయన ఆదేశాలకు అనుగుణంగా అధికారులకు సూచనలు చేసారు. చరవాణి సమీక్షలో అధికారులతో మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తం చేయవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రత్యేకించి ప్రాణనష్టం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాలని స్పష్టం చేసారు. అపాయకర విద్యుత్ లైన్లను గుర్తించి తదనుగుణ చర్యలు తీసుకోవాలన్నారు. వృక్షాలు నేలకూలి, కరెంట్ తీగలు తెగిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, మరోవైపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే తక్షణమే స్పందించేలా అధికారులు సిబ్బందితో సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన మేరకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ సమాచారాన్ని ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. భారీ వర్ష సూచనలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారుల వేటకు వెళ్లకుండా చూడాలని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్లకు సూచించారు. వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మ్యాన్ హోల్సు వద్ద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా అన్ని చర్యల తీసుకోవాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకం లేకుండా పారిశుధ్య పనివార్లను సిబ్బందిని అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు





# జల దిగబంధనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా వర్షానికి విజయవాడ నగరం ప్రధాన కూడలు జలమయమైనాయి.

ఆంధ్రపత్రిక ఫోటోలు : సి.హెచ్.విజయ భాస్కర్



Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com